వ్యాసముక్తావళి.

(తొలి భాగము)

రచయిత:

భమిడిపాటి సుబ్బారావు

నరసాపురము

ప్రకాశకులు.

వేంకటరామ్ అండ్ కో.,

ఎడ్యుకేషనల్ పబ్లిషర్సు, బుక్ సెల్లర్సు,

ఏలూరు

శ్రీ కృష్ణదేవరాయ ఆంధ్ర భాషానిలయము,

విభాగము .... వ్యాసములు

సంఖ్య వ-14

PRINTED BY MR. K. KODANDA RAMAIAH,
AT ANDHRA GRANDHALAYA PRESS,
BEZWADA.

1932.

Copy Right Registered.] [PRICE As. 10.

పీఠిక.

అప్పుడప్పుడు తీరికసమయములు తెనుఁగు వ్యాస రచనావినోదమునఁ బుచ్చెడు అలవాటునకు లోనై కొన్ని వ్యాసములను వ్రాసితిని. ఏ విషయమై గాని సాధారణముగా నిరుగు పొరుగువా రనుకొను భావములనే ప్రోవుజేసి యొక క్రమములో నిడిన హేతువున, నిందలియభిప్రాయములు పాఠకులకుఁ జిరపరిచితములే కావచ్చును. అన్య విషయములమాట యటుండనిచ్చి వ్యాసరచనాధోరణినే యిందుఁ బ్రాధాన్యముగ గణించితిని.

నావ్రాసిన వ్యాసములను వినిన కొందఱు మిత్రులివి స్త్రీ పురుషుల కెల్లఱకు నందు ముఖ్యముగ బడిపిల్లలకు వ్యాస రచనమున నీతిగ్రహణమున మిక్కిలి సహకారు లగు నని వాకొని వీని నచ్చొత్తింపు మని నన్నుఁ బ్రోత్సహించిరి. తదుపదేశము నా కుత్సాహకారణ మగుడు వ్యాసముక్తావళిని గూర్చి మున్ముందుగఁ దొలిసరమును బ్రకటన గావింప సమకట్టితిని.

వ్యాసమునకు ఎత్తుగడ, రచన, సమాప్తి ముఖ్యములనియు, రచయితయం దాద్యంతముల నధికశ్రద్ధఁ జూపవలయుననియు, దీనిఁ జదువువారు గ్రహించునెడల నాప్రయత్నము సార్థకము. మఱియు వ్రాసినకొలఁది వ్యాసరచన మలవా టగును. తద్రచనలోఁగల కొన్నిపద్ధతుల నీవ్యాసముక్తావళి రుచిఁజూపును. అనేకాభిప్రాయములు మనస్సులోఁగల్గియు వ్యాసరూపమున వాని వ్రాయఁజాలనిపిన్నల కిది తోడ్పడుచో నామనోభీష్టము నెఱవేఱినదనియే సంతసించెదను.

నరసాపురము,
15-7-32.

ఇట్లు,
భమిడిపాటి సుబ్బారావు.

విషయసూచిక.

		పుట.
1.	భక్తి	1
2.	పరహితాచరణము	7
3.	వాగ్దానము	13
4.	క్రమము	17
5.	ధైర్యము	23
6.	ఆశ	29
7.	పాటు	36
8.	డాబు	42
9.	నడత	49
10.	కోపము	58
11.	ఎగతాళి	66
12.	వృత్తి	71
13.	పట్టుదల	76
14.	మరణము	82
15.	మితవ్యయము	89
16.	భూతదయ	96
17.	మూఢవిశ్వాసము	102
18.	అలవాటు	110
19.	ఓర్పు	119
20.	స్తుతి	125

వ్యాసముక్తావళి.

భక్తి.

"భక్తిలేని పూజ పత్రిచేటు."

1. భక్తి యనఁ దక్కువవాఁ డధికు నెడలఁ జూపు భయగౌరవసంయుక్తమైన ప్రేమము. అల్పవయస్కుఁ డధికవయస్కుని, నిర్ధనుఁడు లక్ష్మీవంతుని, అల్పవిద్యావంతుఁడు పండితుని భక్తితోఁ జూడఁదగును. ప్రజలు రాజును, బిడ్డలు తల్లిదండ్రులను, ఛాత్రు లుపదేశకుని, సేవకు లధికారిని, ప్రాణికోటి దైవమును స్వదేశమును భక్తిం గనుట సహజము. అనఁగా నే విషయములోనైనఁ దక్కువమైనవా రావిషయమందుత్తీర్ణులైనవారియందుఁ బ్రేమ, గౌరవము, భయము నను గుణత్రితయసంయుతబుద్ధిఁ బొందుట భక్తి నూనుట. అధికుఁడు తన కేదేని యపాయముం గలిగించు ననుకొని జడియుటమాత్రము భక్తి కాదని యిచ్చోట గ్రహింపవలసి యున్నది.

2. ఎవఁడు భక్తిఁ జూపఁబడుట కర్హుఁడో వానియం దనశ్వరమగు నధికగుణ మేదియో యొక్కటి యుండవలయును.

కేవలము భౌతికవస్త్వాధిక్యముం గని భక్తిం జూపుట యాయా ధిక్యతయున్న యన్నినాళ్లుండి తొలంగిపోవును. అనఁగాఁ గోటీశ్వరుఁ డని యొక్కనిఁ గొల్చువారి భక్తి, యాదరిద్ర్య మున్నంతకాల ముండి తల్లోపముతో నశించును. మూర్ఖుఁ డెంతని యనన్యసామాన్యగుణ మేదియో కలిగియున్నవాఁడు భక్తి కర్హుఁడు. పుట్టుకచేతనే యెల్లరు తమ తమ జననీజనకుల యెడ భక్తిం జూపవలెను. ప్రజ లేలిక మొదలగువారియందు భక్తియుంచు టొప్పును. భార్యకు భర్తయెడ నుండు బుద్ధి భక్తిపూర్వకము. భర్తకు భార్యయెడ నుండు బుద్ధి నట్లన రాదు? కొలఁది గొప్పలతో నిమిత్తము లేక సమస్తజనులు పరమేశ్వరునియందు భక్తియుక్తు లగుట యుక్తము.

3. భక్తు లిష్టదైవమును సంతతము తలపోయుదురు: వారిచర్యలు చూపఱకు నవ్వు పుట్టించును. హనుమంతుఁడు 'రామ, రామ' యనని క్షణము కానరాదు. ప్రహ్లాదుఁడు విష్ణువును స్మరించుటలో విరామము లేదు. వా రేపనులఁ జేసిన నవి భగవదర్పణబుద్ధిప్రేరితములే! వారి కితరము చెవిఁ జొరదు. అందుచేతనే భక్తు లున్మత్తు లను నుడి పొడమినది. కొందఱు భక్తు లారంభస్థితిలోఁ దోషివారియపనిందలకు లక్ష్యము లై రని భక్తచరిత్రములు సాక్ష్య మొసంగుచున్నవి. ప్రజలదండనములు భక్తులకుఁ దగులకుండఁ జేయునది భక్తి కవచము. భక్తులు తమ లక్ష్యమైన దైవమును సంతృప్తిఁ జేయుటే ముఖ్య మని శారీరకకష్టములను, ధననష్టమును, సంఘబహిష్కరణములను నోర్చుకొనెదరు. ఓర్చుకొనెద

రనుటకంటె యవి తాకని యుద్వేగముతో వారు లక్ష్యము దిక్కుగాఁ బర్విడెద రను టొప్పును. శ్రీకృష్ణునియెడ గోపికలును, శ్రీరామునెడల గోపన్నయుఁ జూపిన భక్తి యిందుల కుదాహరణముగఁ బేర్కొనందగును. క్రీస్తువెంట నరిగిన మాగ్డలనుకన్య భక్తురాండ్రిలో మేల్బంతి.

4. దైవభక్తి కితరము లేవియు సాటిరావు. దైవమొనరించిన మేళ్ళం దలంచుకొనియైన దేవునెడల భక్తిఁ గలిగియుండుట కర్తవ్యము. జీవుఁడు తనదీర్ఘప్రయాణములో నరరూప మెత్తి తక్కినజంతుజాలములో మిన్నయై, పరమేశ్వరునిపై భక్తి గల్గియుండకుండుటకంటె గర్హ్య మన్యము లేదు గదా! అయినను నీ వనుదినముగల యరువది గడియల కాలములో నేమాత్ర మ్మీసమస్తము నిచ్చిన దాతవిషయికమైన చింతలో వినియోగించుచున్నావో తలంపుము. ఎవ్వని కరుణాలేశమే జగంబున కంతకును బుక్కిలింతలపాలియమై వెలయునో, యెవ్వనిసంకల్పమాత్రమునఁ బ్రపంచమునఁగల భోగభాగ్యములమాట యటుండఁ బ్రపంచములే యస్తమించునో, యాచిద్విలాసునిగూర్చి నీ వనుదినము గొంత విచారణ మొనరించి యాతనియెడ భక్తిఁ జూపుట యుచితముగాదా! అట్లొనర్పుము.

5. కొందఱు దైవభక్తులు మఱికొందఱు దైవదత్త ప్రకృతివస్తుభక్తులు. ఇంకను గొందఱు మానవకల్పిత వస్తుభక్తులు. వీరు స్వసుఖమును గణనసేయక తమ యిష్ట దైవముల కలంకారముల నిడ సర్వదా ప్రయత్నించెదరు.

వీరుగాక యింకఁ జెప్పంబోవు భక్తులు ధూమపానీయాదితుచ్ఛభోగభక్తులు, వశవర్తులు. వీరును నిష్టదైవతముల నహర్నిశలు సేవించి యారోగ్యముం జెడఁగొట్టుకొని దుష్ప్రవర్తకుల కాదర్శప్రాయులై నశించుచున్నారు. వీరు నిజమైన భక్తులఁ ధూలనాడి యపనిందల పాలొనరించుచుండుటలో నేమాత్రమును వెనుఁదీయరు. వీరును దమ యిష్టదైవములను మనోవాక్కర్మల సేవింతురు. కాని వీరిదైవములు వీరినాశనమునకు దారిఁజూపుట యథార్థము. పైనఁ జెప్పిన ద్వివిధము లగు భక్తులును ద్రికరణశుద్ధిగ నిజదైవములను బ్రేమింతురు. కాని మొదటి తెగవారుత్తమగతులను, దక్కుంగలవార లధోగతిని బొందెదరు. కాఁబట్టి, యేదైవమును నీ వాశ్రయించుచున్నావో విచారణచేసి తెలిసికొని తొల్తనే నీచాశ్రయమును-వర్జించి మే లొడఁగూర్చువాని నాశ్రయించుట నీయుపయోగమునకే యని గ్రహించి, యారీతిని జేయునది. చేతులు కాలినఁ బిదపఁ దన్నివారణోపాయములకై వెదకులాడుట కంటె ముందుగానే యేహానియు రాకుండఁ దప్పించుకొనుట శ్రేయోదాయకము.

6. కష్టములపాలైనవారు, జిజ్ఞాసువులు, ధనకాంక్షులు, జ్ఞానులు నను నాలుగు తెగలవారుమాత్రమే భగవంతుఁ డనిన భక్తిగలవారు. ఉద్యోగభంగమైననాఁడు సుందరకాండము విప్పువాఁడును, రోగగ్రస్తుఁడైననాఁడు ముడుపుల గట్టువాఁడును సుఖదినములలో దేవుని స్మరింపఁడు. జనసామాన్యము లోకవ్యాపారములలో మునిఁగి తేలుచుఁ బర

మేష్ప్రియునికినే మఱచును. అతఁడు లేఁడనికూడ వారు దలపోసి నాస్తికు లగుదురు. భగవంతుఁడు లేఁడనుకొనువారికి భగవద్భక్తి పూజ్యమేగదా! సంతోషములో భోగనిమగ్నుఁడై యున్నసమయమున నరుఁడు స్వప్రయోజకత్వము వలన నంతటివాఁడనైతి నని యెంచి, దైన్య మనుభవించు నాఁడా దైన్యమునకుం గారణము భగవంతుఁడే యనుకొని యాతనిఁ దూలనాడుట పామరసామాన్యలక్షణము. భగవద్భక్తివలన సమస్తఫలములును గొంగుబంగార మను వారు కూడ స్వచ్ఛమైన భక్తి నీశ్వరునిపైఁ బాదుకొల్పరు. ఇది హాస్యకరవిషయము; నిరుత్సాహపఱుపవలసిన సమాచారము.

7. భక్తిఁ జూపుటకు సఖ్యము, శ్రవణము, దాసత్వము, వందనము, అర్చనము, సేవ, ఆత్మలో నెఱుక, సంకీర్తనము, చింతనము నను తొమ్మిది మార్గము లున్నవి. వివిధమతములవారు వివిధమార్గముల భక్తిఁజూపుచు నొండొరుల నపహసించుకొనుట నిజభక్తిలోపసూచకముగాన నది కూడదు. ఇన్నిమార్గముల నొక్కభక్తుఁడే యనుసరింపఁ దగును. లేదా కొన్నిఁటిఁ గొన్నియెడల నుపయోగింపనగును. గొప్పవానియెడ భక్తిఁజూపుట స్నేహమూలమున, నూడిగము మూలమున, వందనమూలమునఁ గావచ్చును. లేదా మఱియేయితరపద్ధతులనైనఁగూడ నవలంబింపవచ్చును. దేవుని విషయమై వీనికిందోడు సంకీర్తనము పూజ ధ్యానము చేకొనువా రున్నారు. దేశభక్తుల సంకీర్తనములు చిరపరిచితములే.

మార్గ మేదైన నేమి త్రికరణశుద్ధియైన భక్తి యుండవలయును. లేనిచో నది కపటవిశేషణ పూర్వపదభక్తియగును. కపట భక్తి సోపాధికము, ప్రేమశూన్యము, గౌరవహీనము. అట్టి కపటభక్తులు మోసగాండ్రు, స్వలాభపరాయణులు, దుస్తంత్రజ్ఞులు. వారు నిజకార్యనిర్వహణకాలముననే, నక్క వినయములం జూపి,యాపిదపధ్వజమెత్తెదరు. అట్టివారిని నిరుత్సాహపఱచుటకు, నట్టిభక్తిని నిరసించుటకు నిజమైనభక్తి లజ్జ లేక మనోవాక్కర్మలం జూపంబడునదై యుండవలసియున్న దని పురాతనమైన తీర్మాన మున్నది.

8. కొంతమంది దైవమునకైనను సరే సేవ సేయుట భక్తిజూపుట నిజప్రతిభకు భంగకర మని యూహించెదరు. దేవాలయమునకు బోవను, నమస్కారముచేయను నాత్మగౌరవహీన మనుకొనువారు నిట్టిజనులే. వారు కేవలము పరులం బరిపాలించుటకే మేము ప్రత్యేకము పుట్టితి మనుకొను సర్వజ్ఞత్వపూరితహృదయులు; అధికారమదోన్మత్తులు; ఐహిక భోగాసక్తులు. వారైననుం దమ కపకారము జరుగనున్న వేళ నది తప్పించుకొనుటకు లోకుల మెప్పుదల వడయుటకు దొంగ భక్తిని బ్రకటించెదరు. ప్రమాదము దాంటినమీందట యథాపూర్వస్థితిలోనికి మాఱి తాటిమువ్వెక్కి కూర్చుండెదరు. ఒకప్పుడు భక్తిమూలమునం బ్రమాదములు తప్పినవనుకొను వారుకూడ నటుపైన నిజమైన భక్తు లేల కారోగదా!

9. అంతరంగమున భక్తి కలదు. తత్ప్రకటనకార్యములతో మాకు నిమిత్తము లేదని కొందఱివితండవాదము. కాని,

భక్తి యణంగి నిల్చి ప్రకటన మొల్లనిది కాదు. ఒకని బాహ్యా వర్తన మాంతరంగికభక్తి కనుగుణముగ నుండితీరును. అందు చేత బాహ్యావర్తనమునఁ గన్పట్టనిభక్తి చాటున నుండదు. ఒకనిప్రవర్తనమున భక్తిలక్షణములు లేనిచో వానిహృదయ కుహరమునఁగూడ నది శూన్యమే యనఁజెల్లును.

10. కాఁబట్టి యభ్యాసముచేసి భక్తిబీజమును నీమనః ఫలకమున నాటుము. ఈశ్వరభక్తిని బెంపొందించుకొనుము. పెద్దలను గురువులను జననీజనకులను భక్తితోఁ బూజింపుము. ఎంతయధికభక్తిగలవాఁడవైన నంతసచ్ఛీలవంతుఁడవై పేర్గాం చెదవు. భక్తి కసాధ్య మగు కృత్యము లేదు. అందుచేతనే భక్తులహృదయము లీశ్వరధామము లని ప్రసిద్ధి.

పరహితాచరణము.

క॥ పరహితము సేయఁ బూనిన
పురుషుఁడు పాపంబు సేయఁ బొందఁడు కీడున్. భా॥ శాం॥

1. నిరంతరము స్వకుక్షింభరకార్యపరులై యుండక పరులకు హితమగు పను లొనరించుట మానవుల కనీసధర్మము. ఇది యార్యవచనము. ఎవరు పరులు? వారి కేది హితము? పర హితము తెలిసికొనుటెట్లు? తెలిసికొనియుఁ బరహితకార్యము లెల్లఁ జేయుట సుసాధ్య మగునా? ఇట్లు సందియంబులసంఖ్య మితిమీఱియుండఁ నరుండా పరహితాచరణధర్మము నెఱవేర్చు చుఁ గృతకృత్యుం డగుటకు మార్గమేది?

2. ఎవ్వనికైనను దానుదక్కఁ దక్కిన బంధువర్గము, మిత్త్రబృందము, తదితరమనుష్యలోకము, జగత్తులోని సమస్తజీవరాసులు ననఁగా బ్రస్తుతము సజీవులై యున్నవారలే గాక మున్ముందుద్భవించెడి ప్రాణిసమూహముకూడఁ బరు లని యర్థము. ఇట్టిస్థూలబుద్ధితోఁ గాక సూక్ష్మబుద్ధితోఁ జూచిన నెల్లరయందున్న జీవుఁడు పరమాత్మాంశమే యగుటచేఁ బరులనఁదగినవారే కానరారు. ఇది యెట్లనఁగ తండ్రి కుమారునకు మనుమనికే కాక నిజసంతతిలో నుదితులగు నితరులకుఁగూడ నమితసౌఖ్యమొడఁగూర్పఁ ధనము సేకరించు నవ్వడి, మనుజుఁడు సమకాలికులకే కాక భావిజనులకుఁగూడ హితమగు కార్యము లొనర్పనది. వారి కేది హితమని సందేహంబులఁ గుందనక్కఱ లేదు. తన కేదిహితమో వారికి నదియే హితము. తన కిష్టమైనదై హానికరము కాని కార్యము సులభముగా శ్రమలేక చేసి కొని యెట్లు నరుఁడు సుఖించునో యా దేరీతిని మంచిపనులఁ జేసి యాత డితరులకుంగూడ సుఖమొడఁగూర్పవలయు. అంతియ కాక, యితరులు కొందఱొనరించినపనులవలనఁ దాను ఫలమనుభవించుచుండి, యా యుపకారులకందఱకుఁ దానే చందమునఁ గృతజ్ఞత దెల్పుచుండెనో యాచందముననే ముందుతరములవారల మేలుకొఱకు వాఁడు కొన్ని కార్యముల జేసిన వారి కృతజ్ఞత వడయందగు. తా ననుభవించునవన్నియుఁ గల్పించినవారెల్లరు సజీవులై నేఁ డుండిరా? వారిలోఁ బెక్కండ్రు పరమపదించి స్వర్గమలంకరించిరే. తన్మృతులకుఁ దనకృతజ్ఞతఁ దెల్పుటకు మార్గము పుట్టఁబోవువారి కనుకూలకార్యములఁ

దా నాచరించుటే. నిజదేశకాలపాత్రములఁ బట్టి తన కేది హితమో నిజాంతరాత్మ నడిగి యెఱిఁగి యది యేరీతి నున్నచో రాఁగలకాలమందుఁ దన కుపయోగపడునో గ్రహించి యట్టి పనులే పరులకును హితమని నిశ్చయించి నరుఁడు వానినాచరింపఁ బూనవలయును. ఒకవేళ ముందు ముందు పరిస్థితులు మాఱిపోయినప్పటికి, నతఁడు నాటినపునాదులపై నూతన భవననిర్మాణము భావిసంతతులకు సుకరము. మఱియు సూర్యోదయాది సూర్యోదయము వఱకు జీవితకాలములో నెన్నియుండిన నొక్కనికి సుఖమబ్బుచున్నది. అట్టిచో లోకమంతయు వర్తమానభవిష్యత్కాలములందుఁ బ్రమోదము జెందవలెనన్నచోఁ గావలసిన వెన్నియో యుండును. అవి యిట్టివి, యిన్ని యీమాదిరి వని వర్ణించి లెక్కించి నిర్ణయింప నేరితరముఁ గానిపట్లు వాని నన్నింటి నాచరించు టెట్లందు వేమో? ఇది గొప్పసంశయమే కాని పనిచేయువానిహృదయమునకుం దట్టునట్టిదిమాత్రము కాదు. పరహితము చేయనేరని సోమరి పనిఁ దప్పించుకొనఁ నెంచి పనిపట్ల శ్రద్ధవహింప నొల్లనిసమయంబులయందుఁ బైకి వాదనాపూర్వకంబుగ వెల్లడిచేసెడి సందియం బిది యని నమ్మెను. పనిచేయఁగలవాఁడు పరహితాచరణధర్మము నిర్వర్తింపఁదలంచినవాఁడు నేదియో శక్త్యనుసార ముడుతభక్తితోఁ జేయుచునే యుండును. కాని వితండవాదనలకు దిగఁడు. సోమరికి మొదలే దొరకదుగాని పాటుపడి చేయువానికిఁ జేసిన కొలఁదియుఁ జేయవలసినపనులే కానుపించును.

3. పనిపై బుద్ధిగలనరుఁడు స్వోదరపూరణంబునకుఁ గాక యింటిలోనివారికందఱకు నాహారసామగ్రిలు, వసనములు, తదితరసంభారములు గడించుచున్నాఁడు. కుమారుఁడు తనవలె శ్రమపడనక్కఱలేకుండ గొప్పయాస్తితో జీవనము ప్రారంభింపవలె నని యూహించి తద్వసతి సంపాదన మారంభించుచున్నాఁడు. వార్ధక్యావస్థలోఁ దా విచ్చలవిడిగ వ్యయమొనర్చుకొనుటకు ధనము నిలువఁజేసికొనుచున్నాఁడు. తానకస్మాత్తుగఁ బేదఱికంబులో మరణించిన మొడల నాలుబిడ్డలు నిరాహారులై యుండనక్కఱలేకుండ, దాఁ బొట్టగట్టుకొనియైన ధనము దాఁచుచున్నాఁడు. ఇదంతయుఁ బరహితమే కాని వీనిలో నేను, నాసుఖము, నావారు, నావారిసుఖము, నను నట్టి యహంభావమున్నది. అందుచేఁ గేవలము నిజసౌఖ్యాభిలాషి కానివాఁడయ్యు నరుఁడు పైసందర్భములోఁ బరహితమొనరించినాఁడను ప్రశంసకు ముల్లువాసి క్రిందగునుగాని మీఁదుఁగాఁడు. దీనివలెనే తన కెప్పుడైన నితరులతోఁ బనివచ్చునేమో యని వారి కిప్పు డుపకార మొనరించుటఁ బరహితంబుగాక యాత్మహితంబునాఁ బఱఁగు. ఇచ్చట నరుఁడు పరహితం బొనరించినాఁడని తలంప నేయవకాశము లేదు.

4. పలుపలుకు లేల? పరహితగుణభేదంబు లొక్క తేటగీతమున నుత్తరహరివంశమునఁ బేర్కొనఁబడినవి. అది యెట్లంటేని వినుము: 'ఉత్తముండు హితము చేసి యూరకుండు। మధ్యముండు హితముచేసి మాఱువెదకు। నధముఁ డొరుచేయు హితమైన నడిచిపుచ్చు। హితమునకు. నెగ్గుచేయువాఁ డెవ్వఁ

డగును?' ఉత్తములు ప్రకటనకై కాక ధర్మబుద్ధితో బరహిత కార్యములు చేయుచుందురు. దారిని బోవుచో గంటఁబడినకంటకము నెత్తి దూరముగఁ బారవేయుట, నడువలేని దుర్బలులకుఁ జేయూతనొసంగుట, గ్రుడ్డివారికి దారిచూపుట, వ్యాధిబాధితులచెంత కరిగి యుపశమనవాక్యము లాడుటయుఁ బరహితాచరణకార్యములే. "ఎన్నఁడో కాని యిది కాపునకు రాదు. నేను దీనిఫలముల ననుభవించెదనా" యనెడి సంశయంబులం బడక మొక్కలు నాటుటయు నట్టిదే. ప్రఖ్యాతికొఱకు వేలాదిశుష్కవాగ్దానములుగాక గుప్తముగ నొక్కదమ్మిడియో, గుప్పెడుతండులంబులో నిరుపేదవానికిడుట తత్తుల్యమే. సద్యోఫలితమున కాశించి, పొట్టపాడుఁబెట్టి దానికాయలు తిని, సంవత్సరము తిరుగకుండ దానిమొదలంట నాశన మొనరించుటకంటెఁ బలు పక్షి జంతు మానవ సముదాయమునకుఁ గలకాలము ఫలపత్రచ్ఛాయాశ్రయంబు లిచ్చు వటవృక్షపుబీజంబులు నాటి పెంచుటయు, నెందుకైన మంచి దని యెంచి పెద్దమండలాధికారియింటిదుఃఖమును దగ్గింపఁగపటపు ప్రేమవాక్యము లాడుటకంటె, దిక్కులేని వారికి వ్యాజోపశమన వాక్సాహాయ్యమో, ధనసాహాయ్యమో, శరీరసాహాయ్యమో చేయుటమొదలగునవన్నియుఁ బరిశుద్ధములైన పరహితకార్యములుగాని యన్యంబులు కావు. 'పరోపకారః పుణ్యాయ, పాపాయ పరపీడనమ్' అను కాళిదాసోక్తి యవశ్యస్మరణీయము.

5. బాటసారి యెండవేళ చెట్టునీడలో విశ్రమించి, యాతపబాధయు గమనశ్రమయు స్వేదజలధారలను బాపు

కొని చెట్టునాఁటినఁ దాఁ బేరెఱుంగని పుణ్యమూర్తిం గొండా
డుట వినియుఁ గనియు నరుఁడు పరహితం బొనరింపఁ గడంగ
కుండుట యన్యాయము, అక్రమము, అధర్మము. కావున నిదివ
ఱకే నీవు పరహితకార్యసాధన మారంభించితివా నిర్విఘ్నముగఁ
గొనసాగింపుము. లేదా యాలస్యమై మించిపోయిన దేమియు
లేదు; ఈనాఁడే తదాచరణమునకుం గడంగుము. ఒక్కపని
చేసి దానిస్తుతు లెందుఁ బ్రకటింపఁబడిన వని పత్రికలఁ దిరగవే
యుటతోఁ గాలముం బుచ్చక, దానినే వర్ణింప సమకట్టక,
యది చేయనట్టుగనే భావించి, మఱిమఱి యనేక పరహిత
కార్యము లొనరించి చుట్టుపట్లవారి సుఖమునకును బ్రస్తుతా
గోచర భావిలోకము యొక్క సౌఖ్యమునకును గారణమ వై
వారి ప్రస్తుతులకు నిదానమ వై యెప్పటికిని మృతజీవుఁడ వై
వెల్గొంద నుద్దేశింపుము.

6. జీవనదీమతల్లులు సర్వదా నిర్మలజలంబుల క్షేత్రా
రామంబులకును నరసమూహమునకును జంతునివహంబుల
కును పక్షిసంతానంబులకు నొసంగుట స్వలాభముకొఱకా?
వృక్షరాజంబులు ఫలంబులను సూనంబులను గాచి పూని,
జగంబుం దనియించుట స్వలాభార్థమా? గోవు మొదలగు జంతు
వులు నరుల కుపయుక్తంబులగు దుగ్ధంబు లొసంగుటయందు
స్వలాభాపేక్ష యున్నదా? బాటదరినున్న వృక్షము లెండ
ఱు పాంథులకు ఛాయ నొసఁగి, విహంగకులాయనిర్మాణంబు
నకుం దా విచ్చి పరోపకారము చేయుచుండుట గాంచము?
భానుండు జగన్నేత్రమై, వేవెలుంగుల నిచ్చి, పైరులఁ బెంచి,

దోరగాయలఁ బండించి, చీఁకటిఁ బారఁద్రోలి, చలి నడంచి యెన్ని యోవిధముల మహోపకారంబు లొనరించుచుండుట పరహితకార్యాచరణమనియే కదా! అది తనధర్మ మను నమ్మకము గల్గియుండుటచేతనే కదా, యాతఁ డట్లొనర్పఁ గల్గుచున్నాఁడు? నీ చుట్టునున్న నే ప్రకృతివస్తువునుగాని యేయల్పప్రాణిని గనినగాని తన చేతలచేత 'ఓనరుఁడా, నీవు జ్ఞానవంతుఁడ నని విఱ్ఱవీగెదవు కాని నావలె పరహితాచరణం బొనర్పఁగలవా?' యని ప్రశ్నించుచున్నమాడ్కిఁ గన్పట్టును.

7. కాఁబట్టి నిష్ఫలాపేక్షతో ధర్మబుద్ధితో యావచ్ఛక్తితోఁ బరహితంబుం గూర్చుట నైహికాముష్మికసుఖప్రదంబు.

'సజ్జనులు దారె పరహితాచరణమతులు.'

వాగ్దానము.

'* * * *

పలికి బొంకక నిజమునఁ ♦ బరఁగు కంటె
మానధనులకు భద్రంబు మఱియుఁ గలదె?' —భాగవతము.

1. ఏపనినైనఁ జేసెదననిగాని, చేయుననిగాని యింకొకనికి మాట యిచ్చుటే వాగ్దానము. తక్కిన దానములకును వాగ్దానమునకును భేదము హస్తిమశకాంతర మున్నది. గోదానమనఁగా గోవు నొకని కిచ్చుట. దానదాతపని ముగియును,

బ్రతికి గ్రహీత సంతృప్తుఁడై యానందించును. వాగ్దాన మిట్టిది కాదు, ముం దెప్పుడో యొకపని చేసెద నని మాటయిచ్చుట మాత్రము ప్రస్తుతము జరుగును. చేయవలసినపని యట్లే యుండును. దానిచేత కింకను వ్యవధియుండును. అనఁగా మాట యిచ్చుటకును బనినాచరించుటకును మధ్యఁగల యవకాశము కొంచెమైన నది దుష్టమైనది. ఏమనఁగా నాసందునవిఘ్నేశ్వరుని బెండ్లికి వేయివిఘ్నము లన్నట్లెన్నియో యంతరాయములు గలుగవచ్చును. వాగ్దానమొనర్చినవానిచిత్తవృత్తిమారవచ్చును. స్థితిగతులు భేదింపవచ్చును. అన్నమాట నిలుపుకొనలేక పోవుటయే కలుగవచ్చును. వడ్డించుకొన్నది తినుముం దెన్ని యాటంకములోఁ గల్గును. మాట క్రియారూపముఁ బొందుట యన్న నెంతకష్టము; ఆలోపున కర్తయే నశించిపోవచ్చును. అందుచే వాగ్దానము తక్కినదానములందు దేనితోడను బోలికఁ జెందదు. వాగ్దాన మధికదానమగుటచేతనే తక్కిన దానముల కతీతమైనదై నిదానముతోఁ జేయవలసినదై యున్నది.

2. పలుచిక్కులీ వాగ్దానమం దుండుటచేతనే యెవ్వఁడును దొందరపడి వాగ్దానములేవియుఁ జేయరాదు. 'స్వల్పకార్యమిది, నేఁ జేయఁజాలనా' యని గర్వించి వాగ్దాన మొనర్పఁగూడదు. ఈపని నా కలవియగునా కాదా యనియు, పీనివిషయములో నే నిట్లు చేయవచ్చునా చేయరాదా యనియు, మఱెన్నియో యోజించి మాట నోరు జారవేయవలయును. కాలుజారిన సర్దుబాటుఁ జేసికొనవచ్చును గాని మాట నోరు

జారినచో సవరణ దుర్లభము. ఏమనుచున్నావో నిదానదృష్టితో నాలోచించి సందర్భములు గమనించి నీ సాయ మర్థించువాని పుట్టుపూర్వోత్తరము లారసి, యనినమాటఁ జెల్లించుకొనఁగల ననుధైర్య మున్నప్పుడే నాలుకఁ గదలింపుము. ముందువెనుక లారయక యనాలోచితముగఁ గ్రియాహీనములగు వాగ్దానములు చేయుట నాల్కకు వ్యర్థ పరిశ్రమ; చేటు.

3. ఒకసారి వాగ్దాన మొనర్చిన పిదప నది బొంకువడకుండ నిలుపుకొనుట పరమోత్తమపద్ధతి. అట్లె బలి, శిబి మున్నగు మహాత్ములందఱు మాట నిలుకుగలవారలు. ఆడిన మాట వారివలె నిలుపుకొనుటయే నరునకు గౌరవప్రదము. తద్దారవార్జనకొఱకు ధనము సంతానము రాజ్యము ప్రాణముఁ గోల్పోయిన వారిపవిత్రచరిత్రములతో గ్రంథములు నిండి నిబిడీకృతమైయున్నవి. సిరియాలరాజదంపతులు కుమారుని ఱోటదంపి వండి యతిథుల బూజించినది, హరిశ్చంద్రచక్రవర్తి మకుటము నాలుబిడ్డలను గోల్పోయి కాటికాపరియైనది యెందునిమిత్తము? అనినమాట నిల్పుకొనుటకుఁగాదే? అందుచేతనే గదా గ్రంథములలో వారినామము లాకాశమున నక్షత్రములట్లు ప్రకాశించుచున్నవి. సముద్రయాన మొనరించునావికుల కట్లు, లోకయాత్రఁజేయు సాధారణమానవులకానక్షత్రములే గదా సరియగుమార్గము నెఱుంగ సాయపడునట్టివై వెలుగొందుచున్నవి.

4. మాట నిలుపుకొనలేకపోవుట యగౌరవకరము, దుర్బలత్వ సూచకము, కిల్బిషకారణము. మాటనిలుకు లేని

వాని నితరులు నమ్మక దూరము సేయుదురు. కావలసినవారు మిత్రులునుగూడ వానితో నే వ్యాపారమును బెట్టుకొనుటకు భయముఁ జెందెదరు. 'ఎల్లవారు నాడితప్పినవానిని దూషించెదరు' 'ఆడితప్పినగా...' కను దూషణమును వినిన గార్దభ మొకటి 'అయ్యో! నాగర్భమున నిట్టి ఖలుఁడా జన్మించినాఁ' డని విచారించిన దని చెప్పుహాస్యకథసారాంశ మేమి? చేసినవాగ్దానము కార్యరూపమునఁ బరిణమింపఁజేయ నేరనివాఁడు గాడిదకంటెను నీచుఁ డని యేకదా!

5. కాఁబట్టి సమర్థత లేనివేళ యొకవాగ్దానము బడాయికో, ప్రమాదముననో, వేళాకోళమునకో చేసి, యా మాటప్రకార మాచరింపక యూరకుండుటకంటె మొదలు వాగ్దానము చేయకపోవుటే సమంజసము. అంత్యనిష్ఠురముకంటె నాదినిష్ఠురము మేలు. ఒకనికి సాయము చేసెద నని చెప్పి చేయకున్నచోఁ గల్గునష్టము లెంచుము. సాయము పొందగోరువానికిఁ బూర్వభయ మట్లే నిల్చుట, దానికిఁ దోడాశాభంగము కలుగుట, సాయమొనరించెద నని యొనర్పనివానికి శాశ్వతగౌరవకళంక మువ్వతిల్లుట యను నష్టత్రయం బుదయించును. అట్లనే సాయము నాశపెట్టుకున్నచోఁ దదపేక్షకుఁడు వేఱొక్కనికడ కేగ, కోర్కె లంద నవకాశముండదు; నదియుఁ దొలంగుట యను మఱొక్కటిఁగూడఁ జేర్పదగును. ఆడితప్పుటకంటె మాటాడకుండుటే మేలు.

6. పేరో ప్రతిష్ఠయో పత్రికలోఁబడు నని కాని యభినందన సభలలో నుతులంబడయందగునని కాని వేలకొలఁది

విరాళముల వాగ్దానముచేసి కొందఱుపొందిన ప్రతిష్ఠ స్వల్పమే కాని, ఆవిరాళపుధనము నీయక వారందిన యప్రతిష్ఠ దిక్కులు ప్రతిధ్వనించి పోవుచున్నవి. అట్టివారెందఱో నీ చుట్టుపట్లను న్నారు. మొక్కవోయిన వారిగౌరవస్థితి నారసివైన నీవు వట్టి వాగ్దానముల నెన్నఁడుం జేయకుము. ఎంత స్వల్పకార్యమైనను నీవు చేయుదు నని చెప్పి చేయకుండుట వాగ్దానభంగమే! ఆట పాటలలోఁ బరిహాసమునకుఁగాని, వ్యాపారములలో ముందు వెనుక లారయకగాని, సంతోషసమయంబుల సుఖావేశముచేఁ గాని, వేయేల, యేస్థితిలోఁగాని వాగ్దానములఁ జేయవలదు. ఒకవేళ నేకారణముననో మాట నిచ్చితివా, మూఁడాఱైన నాఱుమూఁడైనను సరే మాటనిలుపుకొనుటే ప్రధానముగ గణించి తన్నిర్వహణమున దేహమనోబుద్ధిబలముల వినియోగించి, ధనమును, బంధుగులను, మిత్రులను, ప్రాణములను గోల్పోయియైనను దాని నిల్పుము. స్వలాభము నెంచని వాగ్దాననిర్వహణము ప్రశంసాయోగ్యమై శాశ్వతకీర్తిదాయకమై వెలయును.

క్రమము.

1. ఇల్లు చూచి యిల్లాలిగుణము కనిపెట్టనగును. ఇది సామాన్యలోకోక్తియేయైనను దీనియం దిమిడియున్న భావము మహోత్కృష్టమైనది. ఇంటిలో నెక్కడనున్న వస్తువుల నక్కడనే విడువక, యవి యుండవలసిన తావుల నుంచు గృహిణి

ప్రతికార్యమును సాంతముగను, మనోరంజకముగను, యథావిధిగను నిర్వర్తింపఁగల దనియే యాసామెత కర్థము. అగరుపుల్లల నంట గిన్నెలను, బుస్తకములఁ గూరగాయలను గలిపి గ్రుచ్చెత్తు నామె సదనము లొగ్గిడిగా నుండి శుచిత్వదూర మగును. సూది కొకస్థలనిర్ణయము లేమింజేసి సూచికాన్వేషణమునకుఁ జీపురుకట్ట మొదలు చీనిచీనాంబరములవఱకుఁ బదార్థాలోకనదీక్షఁ బూని తిరుగవేసి బోర్లింపవలసి వచ్చును. అప్పుడైనను వెదకెడిది లభించు నని నిశ్చయము లేదు. ఎడ్డితనముచేత వస్తుసముదాయము నంతయుఁ గలగాపులగ మొనర్చినచో గృహము క్రమము తప్పి గత్తరగ నుండును. ఏదైన వెదకుటచే వ్యర్థకాలహరణ మగును.

2. ఏపనికైనను గ్రమ మావశ్యకము. ప్రపంచములో బ్రహ్మాదిస్తంబపర్యంత మెన్ని చూచినఁ జిందఱవందఱగ నున్నట్లుఁ గన్పట్టినను భగవంతుని క్రమానురక్తియే సూక్ష్మదృష్టికి వెల్లడి యగుచుండును. జంతువుల యుత్పత్తిస్థితి లయములలోఁ గ్రమము. రసాయనవస్తుసమ్మేళనమునఁ గ్రమము. ప్రతిపదార్థమునందు నణువులసంపుటిలోఁ గ్రమము. ఖగోళచలనమునఁ గ్రమము. మనుజుం డెటుఁగన్నఁ గ్రమానుసరణములైనవే దృష్టిగోచర మగుచున్నవి. ఇంచుక క్రమ మెచ్చటఁ దప్పినను సృష్టిలోని గోళములు ఢీఢిక్కులు గొట్టుకొనును. బెజవాడ ధూమశకట విశ్రాంతి స్థానమున కరిగి నిలిచిన నెంత యల్లకల్లోలముగ నుండును? వచ్చువారు, పోవువారు, నిలువ నుంకించు శకటములు, కదలఁ గడంగు

బండ్లుఁ గన, దారి తెన్నుఁ దోఁచక యయోమయముగా నుండును. ఘంటారావములు, సీలలధ్వనులు విని యెప్పటిబండి యప్పుడే యొకదానివెంట నొకటి కదలి వివిధవేగములతో వివిధమార్గగాములై పోయి కొంతసేపటి కావిశ్రాంతిస్థానమున విశ్రాంతి విశ్రాంతిఁ దీసికొనుచున్నదా యన్నట్లుండును. మొత్తముమీఁద నాస్థలము గగ్గోలుగాఁ గ్రమహీనమైనట్లు స్థూలదృష్టికిం గన్పట్టినను నెంత స్వల్పకార్యమైనను గ్రమానుసరణముగ నడచుచున్నది. క్రమమే లేనిచో నచ్చట విశ్రాంతియే పొసఁగదు సరికదా బండ్లొకదాని కొకటి కొట్టుకొని బ్రద్దలై జననాశము దినదినము సంభవించుచుండవలసినదేకదా!

3. క్రమమువలనఁ బ్రమాదములు తప్పుటయేగాక కాలము వ్యర్థము కాదు. కాలము విలువ గమనించువారల కీక్రమ మత్యావశ్యకము. గృహకృత్యవ్యాపారముల నహరహ మొక్కతీరునఁ జేయు నటివ కది యలవాటై యేప్రొద్దున నాక్రమము తప్పునో యాప్రొద్దే చిత్తభ్రమ ముదయించినట్లుండును. ఉదయంబున నిద్రమంచముమీఁదనుండి లేచి యేపని ప్రారంభింపవలయునో నిశ్చయము లేక దేనిలోఁ జేఁ జేసికొనవలెనో యెఱుంగక యొకటి ప్రారంభించి సగముచేసి దాని నచ్చటనే విసర్జించి మఱొక్కటి చేయఁదొడంగి యదియు నట్లే యర్థకృషిగ ముగించి కూలంకషాచరణ మొందును లేక కాలహరణ మొనరించువార లెందఱో యున్నారు. అంగడికిఁ బోయి క్షణములో వచ్చెద నన్నవాఁడు దారిమధ్యమునఁ

గంటఁబడినవానితోఁ బొల్లుమాట లాడి, యవేళయగువఱకుఁ గడపి, రిక్తహస్తములతో నింటి కరుదెంచు నెడల వానికిఁ గాలము విలువగల దని తెలియునే? ముందుగఁ గార్యక్రమము నిర్ణయము జేసికొనకపోవుటచే నెందఱో యెన్నిపనులో చేయ సమర్థులయ్యు నొక్కటియుం జేయఁ జాలరైరి.

4. ఇంటి యజమాని క్రమము దప్పినచో గృహవాసులకందఱకు నక్రమానురక్తియే యలవడును. వేళకుఁ దిండికిరాని భర్త తనకుఁ దోఁచినప్పుడు వంటఁజేయు భార్యను, దరుణము దాఁటిన పిదపఁ గార్యము లాచరించు సేవకులను, నుండుండి యొక్కఁడు నుడుగుండి యొక్కఁడు భోజనమునకు సిద్ధమగు సంతానమును బొందియుండును. భార్యగాని సేవకులుగాని సంతానముగాని నైజముగ నక్రమాభిలాషులు కారు. గృహయజమాని క్రమవిముఖత్వమే వారి నట్లు చేసినది. ఇల్లంతయు నల్లకల్లోలముగఁ గాక క్రమముగ నడుపవలయు నన్నచో యజమాని క్రమము నవలంబించి సర్వకార్యములు నుచితవేళలఁ జేసెడివాఁడై యుండఁదగును. అక్రమాభిలాష యంటురోగమువలె నింటిలోనివారి కంటకుండఁ జేయఁగల వైద్యోపాయములు ప్రతిగృహయజమానియుఁ దెలిసికొనవలయును.

5. క్రమము గృహమును శుచిర్భూత మొనరించి యెంతయో మనోరంజకముగఁ జేయును. ఒక చిన్నగదిలోఁ గుటుంబమంతయుఁ గాపురము చేయుచున్నను నొక్కొక్క స్త్రీరత్నము సర్వవస్తుసముదాయములను జిత్రవిచిత్రముగ

సర్వ ప్రతివస్తువున కొక తావును గల్పించి దేని స్థలమున నావస్తువు నుంచి నిజమైన పుణ్యమును బ్రకటించును. తత్సదనసందర్శన మానందదాయకము. అంగడిలోనున్న రకరకముల తినుబండారపువస్తుక్రమము కన్నులపండువై చూపఱకు నోరూరఁ జేయును. కన్నులు మూసికొని చేయినాచి చూడక యిచ్చట నీవస్తువున్న దని చెప్పి తీయవచ్చును. పుస్తకభాండాగారములోని గ్రంథసంచయములకుం గల క్రమ మత్యద్భుతమైనది. పుస్తకముల వెదకువాని కా కబ్బములక్రమము పనిని తేలిక జేయును. అన్వేషణమును సౌకర్య మొనరించును. భాండాగారమును శుచిత్వముగ నుంచును. పదిపుస్తకము లున్నవాఁడు వానిని వరుసక్రమముగఁ బెట్టుకొనక గదినంతయుఁ జూడ శక్యముకాని స్థితిలో నుంచుకొనునుగాని, భాండాగారము పుస్తకక్రమమునం జేసి శుచివంతముగ నుండును.

6. చిన్నయింటిలోఁ గాపురముండుటవలన గ్రమదైన్యమును సౌధంబులో నుండుటవలనఁ గ్రమాతిశయంబును గల్గవు. కుటీరమైనను సౌధరాజమైనను దన్నివాసజనుల నైజగుణమును బట్టి క్రమముగనో క్రమముతప్పియో యుండును. నిఱుపేదరాలై పర్ణశాలలోనున్న స్త్రీయైన నొక్కతె గృహమును లక్ష్మి తాండవ మాడుచున్నట్లుంచును. దివ్యభవనములందున్నను నొక్కొక్కస్త్రీ క్రమముగా వస్తువులఁ బెట్టక క్రమముగా నేకార్యములఁ జేయక గుమ్మములోని కరుగఁవాని కావేయిల్లు పెద్దమ్మ కావాసమైనట్లుగాఁ దోఁచుభంగిని జరియించును. కొందఱు ధనికుల మందిరములలోనికిం దొంగిచూచి

తివా కుర్చీలపై నీఁగలుముసురు ప్రాఁచిపానీయపాత్రలును, బల్లలపై నెంతుతమలపాకులుగల పళ్లెరములును జెల్లాచెదరుగ నీకుఁ గానవచ్చును. క్రమముగ సదనము లుంచవలెననెడి యభిలాషయే యట్టియిండ్లయజమానులకుఁగాని యజమానురాండ్రకుఁగాని తక్కుంగలజనములకుఁగాని లేదనియే నీ వూహింపవలయును. మఱియు విశేషవస్తుసముదాయముగలవారికిఁ గ్రమముగా వాని నుంచుకొనుట కవకాశము లేదని కొందఱవ్యర్థవాదము. దానినిబట్టి తేలెడి దేమనఁ గ్రమమునకుఁ బదార్థాధిక్యమునకుఁ జుక్కయెదురనియు నవి యొక్కచో నిల్వ వీలులేదనియు; ఇది యసత్యము.

7. స్థలకుశలత్వబాహుళ్యములుగాని, ధనహీనతావిశేషతలుగాని, యల్పాధికజనసంఖ్యలుగాని, క్రమముయొక్కయంతరాయాభివృద్ధులకు మూలములు గాఁజాలవు. నైజముగనో యలవాటుచొప్పుననో క్రమాసక్తి యుద్భవించినమానవుఁ డింటికొక్కఁడున్నను వాఁడు గృహక్రమకారకుఁ డగును. సహజముగ నాగుణములేనివారు పరిశ్రమచేసి క్రమబుద్ధి నార్జింపఁదగును. వేకువను లేచి, దినమంతయుఁ జేయవలసిన పనుల నిర్ణయించుకొని యొకపట్టిక వ్రాసికొనియో జ్ఞాపకముంచుకొనియో యందు విరామవాహ్యాళుల కనుకూలకాలముల నిర్ణయించుకొని యాప్రకారము నడువఁ బ్రయత్నించి రాత్రిపరుండఁబోవువేళ నాపట్టికయం దుదాహరించిన వెన్నియాచరణమం దిడితివో తెలిసికొనుము. మొదటినాఁడు పట్టికలో నొక్కటియు నీవు చేయకపోవచ్చును. అంతమాత్రమున

భయపడక ధైర్యముతో నావిధముననే చిరకాలమొనర్చితివా జీవితకార్యపద్ధతి సాధ్యమగును. పట్టికలో నప్పుడప్పుడవసరమునుబట్టి స్వల్పములగు మార్పు లుండవచ్చును. ఏమన నది బ్రహ్మలిఖితముగాని రాజశాసనముగాని కాక యనుభవశాలి చిత్తున వ్రాసినయేర్పాటు. అనుభవము కలిగినకొలఁది సరియగు పట్టికల వ్రాసికొని యందున్న తెఱఁగు నుల్లంఘింపకయే నీవు సంచరింప సమర్థుఁడ వగుదువు.

8. అజ్ఞానులు సోమరులు పనిఁబూనకముందే కొందఱు క్రమప్రకారము బుద్ధిపరిశ్రమనో దేహపరిశ్రమనో చేసి చేసి మేధావులు సింహబలులు నైరి. వారిమనోరథవిజయకారణము నిరంతర పరిశ్రమాక్రమము. క్రమము రుచి మఱఁగినఁగాని దానియందలి సత్య మవగాహనము కాదు. గడియారము సరిగాఁ దిరుగుట కేక్రమము కారణమో నీజీవితనిర్విఘ్నవిజయమునకుం గూడ నాక్రమమే కారణము. ఇన్ని లాభము లున్నట్టి క్రమశిక్షను నీవుపొందితివా, శుచివంతుఁడవై యన్యులకు మార్గదర్శివై పేరొకొనఁదగిన క్రమాభిమానివై ఆరవిశశితారకముగఁ గీర్తివంతుఁడవై వెలయుదువు.

ధర్మము.

"యతో ధర్మ స్తతో జయః."

1. నిర్ణీతవిధాయకకృత్యము లొనరించుట ధర్మము. ఏవి విధాయకకృత్యములు? జన్మచేత సంఘముచేత నీతిచేత

విధింపఁబడినవన్నియు మానవునకు విధాయకకృత్యములే. అందునఁ బరులమేలుకొఱకుఁ దనమేలుకొఱకు నరుఁడు నెఱవవలసిన వెన్నియో ధర్మము లున్నవి.

2. ధర్మములు కాలవీథిని మేఘము లంబరవీథినట్లు కలుషాపములం దాల్చుచుండును. ఒకనిధర్మము మఱొక్కని ధర్మము నొక్కటిగాక వేఱువేఱుగ నుండును. ఒకప్పు డీధర్మములు పరస్పరవైషమ్యభూయిష్ఠములు. దేశపరిపాలన మొనర్చువానిధర్మ మొకటి. గృహసమ్మార్జన మొనర్చువాని ధర్మము మఱియొక్కటి. ఉదయంబున ముఖప్రక్షాళనంబు గావించుకొనుట భూనేతకును సేవకునకును సమానధర్మము. శరీరపోషణము మానవధర్మ మని యొక్క వేదాంతి యన శరీరమును శుష్కింపఁజేయుటయే యుచితధర్మమని, వేఱొక్కఁడు వాదాడును. సృష్టిలోని యితరము లన్నిటివలెనే ధర్మము నిల్లు గట్టుకొని కాపురముండక మార్పు లొందుచుండును. మఱియుఁ గాలానుసారముగ భేదించుచుండును. "జిహ్వా కొక రుచి, పుఱ్ఱె కొక బుద్ధి" యన్నట్లు కాలంబున కొక్కధర్మంబు. కావుననే యుగధర్మములు దేశధర్మములు వేఱు వేఱుగ నున్నవి. మానవుఁడు కలిమిలేములతో నిమిత్తము విడిచి 'ధర్మంచర' యను నాజ్ఞకు బద్ధుఁడు కావలసినదే.

3. సృష్టిలోని వారెల్ల రెవ్వరిపనుల వారు చేయుచున్నారు. అణువుపని యణువును బ్రహ్మాండముపని బ్రహ్మాండమును జేసికొనుచున్నది. గడియారములోని మరలన్నియు వేని పని యవి చేసికొనుచున్నవి. కావుననే గడియారము

పని చేయుచున్నది. సృష్టిలోని సర్వము దేని కది స్వధర్మము నిర్వర్తించుచుండెడి కారణముచేతనే సృష్టివ్యాపారము నిర్విఘ్నముగ సాగుచున్నది. గృహములోని యజమానుఁ డాహార వస్తువుల సంపాదించి తెచ్చియు, గృహిణి భర్త తెచ్చినది పచన మొనరించి పెట్టియుఁ దమ ధర్మములం దాము చేసికొనుటచేతనే గృహనిర్వాహక కార్యము చక్కఁగఁ గొనసాగుచున్నది. భూమి సూర్యునిచుట్టుఁ దిరిగి, సూర్యచంద్రులు కాంతి నొసఁగి, గాలి వీచి, పొలములు పండి, పూలు వికసించి, యవి తమ ధర్మములు చేసికొనుచున్నవి. నదులు స్నానపానములకు జలంబు లిచ్చి, నగంబులు ఫలంబులఁ గాచి తమ ధర్మానుష్ఠాన దీక్షఁ బ్రకటించుచున్నవి.

4. ఏ కాలమున్న కే దేశమున కే సంఘమున కుచితమైన ధర్మము నా కాలమునందలి, యా దేశమునందలి, యా సంఘమునందలి వ్యక్తులందఱు నెఱవేర్పవలయును. అట్లు చేయకున్న వారు మిగిలినవారిచేఁ బరిహసింపఁబడెదరు. అయితే నూతన ధర్మప్రతిష్ఠాతలు సమకాలికధర్మభిన్నముగనే ప్రవర్తించి మొగతాళి నాదిని గొంతకాలము పడి, కడ కున్నవారి నందఱం దమ చెప్పుచేతలలో నుండునట్లు చేసెదరు. ఎప్పుడైనను నూతనధర్మము లీగతినే వెల్వడినవి. సాధారణ మానవులు నూతనధర్మము స్థాపించువారల మనుకొని భ్రమపడి తమ కుచితము లగు ధర్మములకు దూర మగుట యవినీతి.

5. ఎవని ధర్మమును వాఁడు చేయకున్నచో నష్ట మేమన వచ్చును? పొద్దునఁ బాఁచినోటినిఁ దోముకొనుట

నీధర్మముగదా! ఆపని చేయకున్న నేగి యేమని నీ వడిగిన ప్రశ్నార్థము- అనఁగా నీధర్మ మగు నీముఖప్రక్షాళనముం జేయకుండుటవలన నష్టమేమి? నోరు కంపుఁగొట్టును. ప్రాఁచినోటితో నేపదార్థముఁ దినినను నీ కసహ్యకర మగును. ఇంతటితోఁ బోయిన మేలే! చుట్టుపట్లనున్నవారికిని నష్టమే కల్గును. అందుచే ధర్మమైనదానినిఁ జేయకున్నచోఁ జేయనివానికే కాక వాని యాశ్రితాదులకుఁ గూడ హాని వాటిల్లును. యంత్రాంగమైన చక్రము తిరిగి తనధర్మము నిర్వర్తింపకుండిన యెడల యంత్రమంతయుఁ గదలక నిలిచిపోవును. ధర్మము తప్పినవాఁ డొక్కఁడే కాక వాని సంబంధులుగూడ నష్టముం బొందుట సంభవించును. ఎవనిముంగిలి వాఁ డూడ్చుకొనునప్పుడు గదా వీథియంతయుం బరిశుద్ధమగును. దాన వీథిలోనివారికే కాక యూరిలోనివారి కెల్లరకుంగూడ నామయము లుత్పన్నంబులు గాకుండును. ఎవనిధర్మము వాఁడు నెఱవేర్చువేళఁ గలుగు లాభములు గ్రహింపఁ గష్ట మగును గాని యట్లు నెఱవేర్పనినాఁడు గలుగునష్టములు వెంటనే విస్పష్టములగును. సారథియుఁ దురగములు చక్రములు వేని ధర్మము లవి చేసినప్పుడు శకటములు సరిగా నడచును. సారథి దిట్టగాకున్నను, గుఱ్ఱములు లొంగకున్నను, జక్రములు చలన ముడిగినను బండి నడువదు. శకటచలనమున కేబండిభాగమున కది నిజధర్మము నెఱవేర్పవలయును.

6. ధర్మనిర్వహణమును జేయుట చేయమి యనునవి యున్నవి కాని కొలఁది గొప్పలు శూన్యములు. ఒకఁడు ధర్మ

రక్షణము చేయుచున్నాఁడా లేదా యనే ప్రశ్న కగును లేదను నుత్తరంబు లున్నవి కాని సగము కాపాడుచున్నాఁ డనుట లేదు. కొంత కాపాడుటయు ధర్మనిర్వహణము చేయకుండుటలో నిమిడియేయున్నది. ధర్మరక్షణమున వరిముల్లువాసి యేమఱి యున్నను జెడుగు లుద్భవించి ధర్మంబు దప్పుట యను దోసంగు పొసంగును. ఇంక నధమకీటకము ధర్మనిర్వహణము స్వల్పమైన దనియు, నుత్తమ భూకాంతుని ధర్మనిర్వహణము హెచ్చైనదనియుఁ దలంపరాదు. ఇరువ్వరవిషయంబున యోజింపవలసినది ధర్మము రక్షింపఁబడినదా లేదా యనియే. ఇం దెవ్వఁడు ధర్మముగ నడువకున్నను లోటే. ధర్మమునఁ బ్రవర్తింపనివాఁడు సేవకుఁడైనను మకుటమాంధాతయైనను నొక్కటే యపకీర్తికిని శిక్షకును బాత్రుఁడగును. తొల్లి యుదరంబునకును దక్కినశరీరావయవంబులకును గలహము గ్గల్గినది. అవయవము లన్నియుఁ దాము పనిచేయుచుండ నుదరం బూరక మ్రింగుచున్న దని యెంచి సమ్మెకట్టి తమధర్మము నిర్వహింప వయ్యెను. నోటినుండి ముద్దయందు కొన్నఁగదా కుక్షి పనిచేయుట. నోటికిఁ జేయియుఁ గడుపునకు నోరును గబళంబును బంపకుండుటచేతఁ బొట్ట తన ధర్మము నిర్వర్తింపఁజాలకపోయెను. అవయవములును బొట్టయు నాహారశూన్యతచేతఁ గృశించినవి. ఏయవయవముధర్మమా యవయవము నెరవేర్చి నప్పుడు సర్వశరీర సౌఖ్యారోగ్యము లొందవు. తక్కిన యవయవంబులు పనిచేసి పొట్టచేయకున్నను బొట్ట తనధర్మముం గాపాడఁ దక్కినభాగములు తమ ని

యమితకర్మలంజేయ కున్ననుగూడ దేహసౌఖ్యభంగకరమే. మఱియు నవయవంబుల ధర్మము నీచమైనదనియు నుదరంబు ధర్మము ఘనమైనదనియు భేదంబు లవంబును లేదు.

7. ఏవ్యాపారమం దున్న వానికైనను నిజధర్మములు తెలియును. తెలియకపోయినచో వాఁడవి వెంటనే తెలిసికొన వలెను. తెలియకున్న నా కేషుని గర్హింప నధర్మ మొనర్చిన వాఁ డగును. అట్లు ధర్మమెఱింగి ధర్మ మొనరింపకున్నచో, నధర్మ వర్తనుఁడయి, తన బిడ్డల కధమాదర్శమై వారి వినాశనము నకు హేతుభూతుఁ డగును. ఒకవ్యక్తిలోఁగాని, సంఘములో గాని, యుగములోఁగాని యధర్మము బ్రవేశింపనది కొంతకా లము చెలరేగి నిల్చునుగాని కడకు నాశన మందితీరవలసినదే. మానవున కనివార్యమగు నధర్మము బొడసూపినచో భగవం తుండు మానవరూపముననే యవతరించి ధర్మసంస్థాపన మొన రించును. లోకములో నధర్మ మశాశ్వతమనుటచేత నెప్పటికై న నది లయ మందితీరును. ధర్మముమాత్రము శాశ్వతమై నిల్చును. ఏదేశమున ధర్మమునకు దక్షులైనవా రుపేక్షింతురో, వారు చేటుం బొందెదరు. దానఁగల దురితము వారల కంటును.

8. ధర్మమూలంబగుట విజయపథంబు మృదుపుష్ప మయంబై సులభసాధ్యంబుగాక కంటకావృతంబై దుర్లభంబై యుండును. ఆయిడుములు నరుఁడు గడచి నడచి గమ్యముఁ జేరి ననే విజయమును, విజయుఁడు ధర్మావలంబకుఁడు నను శాశ్వతబిరుదంబులును వానికిఁ గల్గును.

ఆశ.

శా॥ ఆశాపాశము దాఁ గడుఁ నిడుపు, లేదంతంబు రాజేంద్ర!..
—భాగవతము.

1. మంచివస్తువున కాసపడుట మానవస్వభావము. ఆవస్తువు యథార్థముగ లభించునా లేదా యనునది వేఱుసంగతి. తద్వస్తువు పరకీయమై యుండనగును. దానిఁ బొందుటకు నీకుఁ జిక్కు లుదయింపనోపు. నీకు దాని ననుభవించుటకుఁ దగిన శక్తియు లేకపోవచ్చును. మండలేశ్వరునిశుంఢాలము గని మనకు నిది యుండరాదా యని తలపోసి దానికీ వాశింపవచ్చును. లేఁడు తపదంతావళంబును నీ కొసంగునా? దానిఁ ద్రోలుకొనిరా రాజసేవకులు నిన్ను దండనసేయరా? ముందుగా నేనుంగే యంగీకారముంజూపి నీకు లొంగుబాటులోని కరుదెంచునా? ఇన్నియు జరిగినను సాధారణుఁడవు నీ వాగజశ్రేష్ఠమున కొక్క పూటయైన నాహార మిడఁగలవా? ఈభావికష్టపరంపరలవిచారింపకే సుఖమునకు విభవమునకు నాశపడుట ప్రాణికోటికి నైజము. ఏమనఁ బరులచింతచెట్టుకాయల కాజ్ఞయుండును గాని చూపరులయొక్క గుటకల కాజ్ఞయుండదుకదా! కాఁబట్టి రమణీయమై యమూల్యమై యబ్బురమై సుఖదాయకమైన పదార్థంబులు కంటఁబడినవేళ నింద్రియనిగ్రహశక్తియున్న యోగీంద్రులుగాక తక్కుంగల మానవులది యపేక్షించితీరెదరు. తదపేక్షయే యాశ.

2. ఆశ యెంతయో దుర్నివారము. రుచికరంబులగు వంటకంబులు సిద్ధమగుత్రావులనుండి వెల్వడుతావు లాఘ్రా

ణించువారికిఁ దోరంపుటాస పుట్టించి నోరూరంజేయును. ధనికుం డగు బందుగుని సాహాయ్యంబును బేదచుట్టంబు లాశించెడరు. స్వర్గలోకసౌఖ్యముల నోలలాడుకాంక్షచేతనే కొందఱు యజ్ఞయాగంబు లొనరించెదరు. ఏదో మేలుకలుగునను నాసమెయి నరుం డేకార్యంబైన నొనరించును. విద్యాయశోధనవిభవప్రాప్తిపై నాశయే మానవులం బాటుపడంజేయును. ఒక్కొక్కవేళఁ దదనంతరసుఖ మాశించి దుర్మార్గకార్యములు నరహత్యలుకూడ నొనరించువా రున్నారు.

3. ఆశ జీవనాధారము. అన్నివిధములగు నాసలు వర్జించినవాఁ డేపనియుఁ జేయంజాలఁడు, చేయ నవసరమును లేదు. మానియైనవాఁడుగూడఁ బ్రపంచికవైభవముల రోసియు బ్రహ్మసాక్షాత్కారమునై పాశాపాశముచే నీడ్వఁబడుచున్న వాఁడేసుఁడీ! క్రమముగాఁ గక్ష్యలగడచి పైపై కెక్కవలెనను నాశయే వణిక్ఛిఖామణుల నిరంతరవ్యాపారము కొనసాగించును. రాజ్యమునకు రాజ్యముఁ గల్పి చక్రవర్తిత్వమును బొందునాశయే రాజపుంగవులచే యుద్ధములు దండయాత్రలు చేయించును. ఇట్లే ప్రతివ్యక్తియు జీవించి యొక్కొక్కకార్యమే నెఱవేర్చుట కాశయే ముఖ్యహేతువు. తొలిపనిలోని విజయ ముత్తరకార్యములపై నాశఁబుట్టించును. గోవుతోఁ బెఱిగెడి కొమ్ముల ట్లక్షసులభతతోఁ దృష్ణ తానును బెఱుఁగును. అట్టియాస లేనినాఁడు మానవులవ్యాపారములన్నియు మాయమై లోకము స్తంభించును.

4. ఆశకు మేరయు సముద్రమునకు లోతును దెలియ నశక్యమని సామెత. జీవితమున కనుకూలములగు గృహారామ క్షేత్రములు నిర్ధని కపేక్షములు. అవి కల్గిననాఁడు సౌధము నధిక క్షేత్రములను వాఁడు వాంఛించును. అప్పుడైనను సుఖియై యూరకుండునా? పదిమేడలు గట్టఁ గోరును. పిదప గ్రామములను గొన నభిలషించును. పిమ్మట సంస్థానాధిశత్వమునకై యత్నములు సాచును. తదుపరి బిరుదము లాకాంక్షించును. భూమండలమంతయుఁ జేఁజిక్కిన రాజేంద్రుఁడుకూడ నేయూర్ధ్వలోకములకో నిచ్చెనల వేయుచుండును. ఏమన నింతద్రవ్యమున్నచో నాశయుడుగునన్న నియమము శూన్యము. అందుచేత నే లక్షాధికారి మొదలు భిక్షాధికారి వఱకుంగల యేనింగన్నను దనయునికిఁ బైగతిం జెంద నుంకించు నాశాంశు వే గోచరించును. ఏతత్కారణముననే యాశకు మితిఁ గన్గొను బుద్ధిమంతులా లేరు. సూక్ష్మయంత్రములా లేవు. పెద్దవయస్సుతోఁ బాటు మానవుని యవయవములు పటుత్వము దొఱఁగును. గుణములు కొన్ని నశించును. ఆశమాత్రము దినదినప్రవర్ధమానమై యెవ్వేళను బలవత్తమమై యుండును. జరాదికంబుల కీల్గి నరుండు దేహంబు చాలించుచో నాశందప్ప సమస్తగుణములఁ గ్రమముగ విడనాడును. ఆశమాత్రము నరునియొడలునఁ బ్రాణము లున్నంత వఱకు వాని వదలక యంటిపెట్టుకొనియేయుండి, వాఁడు హరీయన్నట్లు నిశ్చయించుకొన్న మీఁద నాతనిం బాయును.

5. బహుళవ్యాపారఫలముల కేక కాలమున నాశఁ బూనుట మనఃక్లేశహేతువు. అన్నిఁట మానవుఁడు సమానముగఁ జిత్తైకాగ్రిత నిల్పఁజాలమి, నన్నియు ఫలవంతము లగునన్న నిశ్చయము లేమిని వాని కెప్పటికైనఁ గొన్నింటనైన నాశాభంగమగుట తటస్థమై తీరును. అప్పుడు వాని విచారాతిశయము వాని యాశాపరిమితి కనుగుణమగు వైశాల్యముం గల్గియుండును. ఒక్కఁడు ధనము ధన మని యెంత యధికముగా విలపించునో యంత యధికదుఃఖము నా ధనము లభింపని దినమున నాతఁ డనుభవించును. అధికాశయే శూన్యమైన వేళ మనోరథభంగ ముదయించిననాఁ డధిక విషాదమే యుండనోపదు. గాఢతర మగు నాశాక్రాంతత దుర్లభఫల యగు నెంతో యసహ్యకరము, దుఃఖకరము. ఆశ కొనలు సాగినకొలఁదిని తద్భంగజనితవిచారము నిశితత్వ మూనును. కాఁబట్టి యనమితాశయుఁ బెక్కుడలఁ బాఱు నాసగమియు దొఱంగుటచే నరుఁడు సౌఖ్యమును బొందును.

6. ప్రపంచములోని దుఃఖమంతయు నాశాజన్యమైనదే యనవచ్చును. ఏదైనఁ దనకు లేదనుకొనుట దుఃఖకరము. లేనిదానిని బొంద సంకల్పించుట దుఃఖకరము. తత్సాధనము దుఃఖకరము. కడకది చేఁజిక్కినఁ జిక్కకున్నను దుఃఖము. ఇన్ని దుఃఖములకాకరంబైనయాశ దుఃఖాస్పద మనం జెల్లదే! కాఁబట్టి బుద్ధిమంతున కాశపజ్జం బోవమియే సుఖకరంబు. చల్లగనున్న వస్తునిచయంబు గుణసంపత్తితో సంతృప్తిని జెంది నిరాశత్వంబు నొందినజ్ఞాని సంతాపంబు దక్కి సుఖి యగు ననుట నిర్వివా

దాంశము. తాటిచెట్టెక్క నూంకింపనివాఁడు నేలమీఁదనే సుఖముగ నుండును. పైకధిరోహించినవాఁడు పలుపాట్లం బడవలెను. వృక్షాగ్రము శ్రమపడి చేరి యచ్చట వాఁడు నిల్వఁ గలిగిన సౌఖ్యావహము గాని, క్రిందికి దైవవశంబునఁ బడెనా యెంత యున్నతి కెక్కెనో యంత పెద్దదెబ్బ తిని చావవలసియే యున్నది. కాఁబట్టి యాశాపాశబద్ధుఁడు కాక యున్నవాఁడు స్వేచ్ఛావిహారి; స్వతంత్రాధికారి. ఆశించి పొందిన దెప్పుడో పోవును గాని స్థిరము కాదు గనుక దానిఁ దొల్తనే [illegible] యాశింపక విడిచిపెట్టుట తెల్వి.

7. నిరాశాపరత్వంబున మఱొండు లాభం బున్నది నిరాశవలన యోగులు సాధించినట్టియు, బుద్ధిమంతులు సాధింపఁ బ్రయత్నించునట్టియు, నో నరుఁడా! సాధింపుమని వేదాంతజ్ఞు లుద్బోధించు నట్టియు, హృదయసంతాపాగ్ని నార్పునట్టియుఁ, జేతోమోద మొడఁగూర్చునట్టియు నింద్రియనిగ్రహశక్తి చేకూరును. ఇంద్రియవిజయమున కన్న నధికతమమగు శిక్ష మానవునకు లభింపదు. ఆ శిక్షయే వానికి సమస్తమును జేకూర్చి మోక్షప్రాప్తి కలిగించును. ఇంద్రియనిగ్రహపరున కాశకన్నఁ బ్రబలశత్రు వేదియు లేదు. అమితతరమగు నోటమి లేదు. దుర్గమతర మగు నంతరాయము లేదు. యతిరాజులు కొందఱా శత్రువుముందు నిల్వలేక తపోభంగము గావించుకొనిరను గాథలు పురాణంబుల నందందుఁ గన్పట్టు. కావున "క॥ ఆశయ యింద్రియనిగ్రహ, నాశముఁ బొందించుఁ

గావునం దొఱఁగెద నే, నాశను సౌఖ్యము నిచ్చు, నిరాశయు" నక తప్పదు.

8. ప్రపంచములో నుండి ప్రాపంచికవ్యాపారములఁ బాల్గొనుచుఁ బ్రాపంచికసుఖములఁ బడయ నెంచు సంసార లంపటు లధికసంఖ్యాకులు. వారిమాట యేమి? అనఁగా వారి కాశ కూడునా కూడదా యనునది నిర్ణయము గావింప వలయును. నిరాశ సుఖప్రద మని పాటువిడిచిన మనమందఱ ము క్షణమైన జీవింపఁజాలము. ఏ భౌతికవ్యాపారమును క్షణ ము సాగదు. మానవుండు పరులధనాదికంబుల కాసపడిం చుట దోషంబగుట వానిని జిల్లపెంకువలె నెవ్వఁడు చూచునో వాఁడే ధన్యుఁడు; పూజనీయుఁడు; స్నేహపాత్రుఁడు. ఇఁక సద భ్యాసములను విద్యాబుద్ధులను సద్గుణములను నలవఱచుకొను పట్లఁ గ్రమముగాఁ బైనఁగల యంతరవు నారోహింప నెల్లరు నాశింపవలసినదే! కేవల భోగపరాయణులై వినశ్వరపదార్థ సంపాదనముపట్ల నరు లాసఁ జూపకుండుటే విసీతి. లక్ష్మి చంచలస్వభావ. అంతలో బీదసాదలు బారుచూ అగుట ప్రతివ్యక్తికి ననుభవమే. మానవయత్నం, బిమ్మ్యోడ దైవంబు తోడ్పాటు లేకున్న, ఫలవంతము కానేరదు. కావునఁ గుటుం బపోషణమునకు వలసిన ప్రధానపదార్థములు న్యాయంబుగ నందువఱ కాసించి సాధించి తదుపరి తృష్ణ త్యజించి పరితృప్తిం జెంది సుఖంపఁదగును. ఇచ్చట నెంత ధనమున్నఁ దృప్తిఁబడ యం దగు నన్న నియమాభావ ముండుటయే యాధారముచేసి కొని యెల్లరు నాశల భంగముల మునిఁగి తేలుట యక్రమము.

మఱియుఁ బశువులను బాలుగులను దిలకింపుఁడు, అవి యే ప్రొద్దుతిండి కాప్రొద్దే పాటుపడును. ఆహారము నిలువఁజేసి కొనుట కాశగాని గాదెలుగాని వానికి లేవు. అందుచేతనే వానికి స్వేచ్ఛ. ఆశించి యర్థ మార్జించినవానికి సంతతభయము. కావున నాస గొంతవరకుఁ గొన్నివిషయముల జీవనాధారమే యయ్యు, కూడనియాశ కొలఁదిగాని గుణము.

9. పేరాస దురాశ యను రెండాశాభేదంబులు వాడుకలోఁ గన్పట్టు. వానిని వివరింప నిదియే యదను. పేరాస యనఁగా మిక్కుటము గాని యాశ. పేరాస కూడనిగుణము. పేరాస వల దనుటకుం గారణము తదాశ దుర్లభఫలమైన వేళ నీకు మిక్కుటం బగు నుమ్మలికంబు చిత్తంబునం దంకురించుటయే యని పైనఁ జెప్పఁబడినది. పరులధనకనకవస్తువాహనాదికంబులను దనకొలఁది యెఱుఁగక యాశపడుట దురాశ. ఉన్నదానితోఁ దనియక పెఱవారివి రావలె నను యాధిక్యాశసనంబు దురాశ. దురాశ దుఃఖముచేటు. నోటఁ బలలంపుఖండంబు నుంచుకొని కాల్వవంతెనమీఁదఁ బోవు శునకం బొండు జలంబులం దన ప్రతిబింబంబుం గని నిటఁగల కుక్క కొనిపోవు నామిషఖండంబున కాశించి నోరుదెఱవ నేమయ్యెనో సువిదితమే! పరులసొమ్మున కాశింప నున్నదియుఁ దొలంగె ననుట దురాశవల దని ప్రకటించుటయే.

పాటు.

'కృషితో నాస్తి దుర్భిక్షమ్.'

సీ. తలకొన్న పనుల సాంతంబుగాఁ జేసిన
ఫలమునఁ దలపెట్టఁ బనులు గల్గుఁ
బ్రారంభమం దహోరాత్రము ల్పని నేర్చు
ఫలమునఁ బని నేర్పు పదవి వచ్చుఁ
గాలికష్టములఁ జూచి తొలఁగక పనిసేయు
ఫలమున సంతోషభాగ్య ముబ్బు
శ్రద్ధతో మొదలంటఁ జక్కఁగాఁ బనిఁబూను
ఫలమునఁ గీర్తిసంపదలు ప్రబలు
అనుభవముచేఁ దెలియునగు ననఁగరాదు
పనులు చేయంగ లభియించు ఫల మిది యని.
మొదటఁ బిసుగయ్యుఁ బనులిచ్చుఁ దుదకు సుఖము
పనులఁ జేయుము సోమరితనము మాని.

1. నరుఁడు తన శారీరక మానసి కాధ్యాత్మిక శక్తులను స్వోపయోగమునకుఁ గాని పరోపయోగమునకుఁ గాని యుపయోగించుట పాటు. అనఁగా నుపకారకర మగుపని యేదైనఁ బాటే. పాటుపడుట మనుజునివిధి. ఆధర్మము నెఱవేర్చి పాటుపడువాఁడు సన్నుతి కెక్కును. పనిపాటులు నేర్వని స్త్రీ నిష్ప్రయోజనము, గృహనిర్వాహకమున కనుపయోగ మని నిందింపఁబడుచున్నది. కావునఁ బనిపాటుల యవసరము నొకించుక గ్రహించుట యెల్లరకు సమంజసము.

2. మానవశరీరనిర్మాణము పనిపాటు లొనరించుటకు వీలైయున్నది. నరములు కీళ్లు కండరములు కదలిక కనుకూలములై యుండి పాటుపడు మని నరుని బ్రోత్సహించి ముందునకు గెంటుచున్నవి. వానిబలమే నరుని బలము; వాని క్షీణతయే నరుని క్షీణత; వాని వృద్ధియే నరుని వృద్ధి. వానిఁ బెంపకున్నవాఁడు తన్నుఁ దాఁ బెంచుకొననివాఁడే సుండీ! కావున నరుని పెంపునకుఁ బాటు ముఖ్యసాధనము. మఱియుఁ బాటుపడుట మనుజునకు నైజము. అప్పుడే భూపతనమైన బిడ్డ కాలుసేతులు పై కెగురవేయును. పిన్నవయసు వారొక్కచో నిల్వక సదా సంచార మొనరించెదరు. వా రొక్కచో బంధింపఁబడుట కొల్లరు. ఏమియు లాభము లేకపోయినను వారు దేహమునకో బుద్ధికో లేదా రెండింటికో పరిశ్రమ కలిగించుచుందురు. చిత్తైకాగ్రత వారి కుండదు; రుచించదు. బాలకుల మనఃఫలకచిత్రితాంశములు చిత్రవిచిత్రభంగుల మార్పులందుచుండును. వారినోరు మాటాడుచునే యుండును. కాలు కదలుచునే యుండును. వారు నిల్చినచోట నిల్వక యొకచోటనుండి మఱొక్కచోటునకుఁ బర్వెత్తుచుండెదరు. కత్తి చేఁబట్టి చెట్లు చేమలు నఱకు వ్యాపారమున మగ్నలగుదురు. జ్ఞానము వచ్చియురానినాఁడే యీరీతిని బ్రవర్తించెడివాఁడు పెఱిఁగి పెద్దయై సోమరితనము నాశించుట యకార్యకరణ మని, పాప మని, నేర మని నిస్సందేహముగ వాక్రువ్వనగును. వయసున్నను న్నవారుకూడఁ బాటుతత్వము

గ్రహించి తమశరీరభాగము లేపాటునిమిత్తము పుట్టినవో యాపాటు వానిచేఁ జేయించుట యవసరము.

3. ముప్పొద్దులఁ గుడిచి యేపనులఁ జేయకుండఁ గూర్చుండి బ్రదుకు జీవితమే ఘనమైన దని, యాకాంక్షింపఁ దగిన దని, యనేకు లమాయకులు తలపోయుదురు. వారిది తప్పు డభిప్రాయమగుటఁ దదభిప్రాయసవరణము కర్తవ్యము. ప్రపంచములో సోమరుల ప్రశంసించుట ప్రోత్సహించుట కంటెఁ బాపకార్య మన్య మేదియుఁ బొడసూపదు. మానవుఁడు గౌరవింపవలసినవాం డిద్దఱే యనియు, నందు మొదటివాఁ డాధ్యాత్మికజీవితవృద్ధిఁ గావించువాఁ డనియు, రెండవవాఁడు శరీరపరిశ్రమము చేయువాఁడనియు నొకమహాత్ముఁ డనెను. ఇంతకు మించి యితరుఁ డెవ్వఁడును గౌరవార్హుఁడు గాఁజాలఁ డనియుఁ గూడఁ జెప్పెను. మఱియుఁ బాటుపడని దేహము రోగములకాణాచియై దేహికి విశేష మగు నలసట గలిగించును. ఒక్కచో స్థాణువువలెఁ గూర్చున్నవాని కాళ్లు గుదులుకట్టి బాధ కలిగించును. కండరములు కదలక రక్తప్రసారము మాంద్య మగును. నిద్రయు నావులింతలు గల్గి దారిద్ర్యలక్షణము లుప్పతిల్లును. వేయేల మందుఁడై యానరుం డుండును. అట్టితఱి నొక్కసారి విసవిస నరక్రోశము దూరము నడచివచ్చిన వాని కా దారిద్ర్యలక్షణములన్నియుఁ బటాపంచలగును.

4. ఏయవయవము పాటుపడదో యాయవయవము దుర్బలమై నీవు కోరినవేళఁ బనిచేయదు. కావున దా

మున్నంతకాలము నీవు పాటుపడవలయును. ఆపాటు మేనఁ బెలుగు శక్తియున్నవాఁటి తాత్కాలికోపయోగము నిమిత్తమేకాక, పెలుగు శక్తి యుడుగువాఁటి వృద్ధాప్యోపయోగమునిమిత్తముకూడ నైయున్నది. లేఁబ్రాయమునఁ బాటుపడనివా రెందఱో కాలము రాకుండఁగనే దుర్బలురై చెడిరి; నడిమివయస్సులోనే పరలోకగతులైరి. వారిస్థితిని గాంచియైనను దార్ఢ్యముతోఁ జిరకాలము మను నిమిత్తమైనను, వయస్సుతో సంబంధము లేక యెల్లవయస్సుల వారును బాటుపడుచుండవలెను.

5. మహాబుద్ధిశాలి పాటుపడఁడనియు వాఁడు సహజజ్ఞానసంపన్నుఁడనియు లోకములోఁ బ్రఖ్యాత మగు నమ్మకమున్నది. వాఁడు సాధారణముగా మానవబుద్ధి కందని కార్యము లద్భుతముగ క్షణములోఁ జేసె నని చెప్పుకొనుటయుఁ గలదు. ఆతఁ డే విషయమైనను తృటిలో గ్రహించి చిరకాలము జ్ఞాపక ముంచుకొనుటయేకాక చిక్కుసమయములలో బహుళోపాయములు చెప్పుననియుఁ బాండిత్యప్రకర్షముతో మాటాడుననియు నుచితప్రవర్తనము గమనించి సంచరించుననియుఁ గూడ నమ్మిక యున్నది. కాని నిజముగ బుద్ధిశాలురజీవితము లొకటి రెండు నీవు నిదర్శనమునకుఁ బరీక్షించినచోఁ గన్పట్టునది వారియం దున్న పాటుపడఁగలశక్తి యితరులయందునకంటె నధికతరమై యుండుటే సుమీ! అమితమైన పాటుపడుశక్తిగలవాఁడే మేధావి యగును. వ్యాసుని వంటి యొక్కొక్కకవి వ్రాసిన గ్రంథసంపుటములన్నియు

భావపుంజములతోడను బదగుంభనములతోడను నర్థగాంభీర్య
ముతోడను రసమాధుర్యంబుతోడను దులఁదూఁగుచుండును.
అట్టి పనులకు మానవునకుఁ దనజీవితము చాలదు. అట్టి
మహోత్కృష్టములగు గ్రంథములు గాకున్నమానె సంఖ్య
కైన సరిపోవునన్ని గ్రంథములు వ్రాయుటకు సాధారణకవి
రాజులకే నూఱేండ్లు పట్టును. తాము మేధానిధు లౌన
ించు కార్యములు చేయనేరనివార లాపనులచుట్టు నద్భుత
ముగు కథలఁ గల్పించెదరు. కలనాట చెప్పవలసి వచ్చిన
మొదల సోమరులు నిద్రించువేళ నా మేధానిధులు నిరంతర
పరిశ్రమచేసి రనియే చెప్పవలసియున్నది.

6. ఓర్పుతోడను బట్టుదలతోడను గ్రమముగఁ బాటు
పడెడువాఁడు సామాన్యమానవాతీతకృత్యము లెన్నియో
నెరవేర్పఁగలఁడు. సోమరులకుఁ బిఱికిపందలకు నిది పరిహాస
కరముగ నుండును. ఘనులెల్లరు పాటుపడియే తమ్మానము మా
ర్జించుకొనిరి. సోమరికిఁ జేయఁ బనులే కానరావు. పని ప్రారం
భము చేయువానికన్నియుఁ బనులే. ఒకపనిలో నవాంతరముగ
నితరకార్యములయాచరణమున కవకాశము గల్గును. పాటు
పడి యొకపని చేసి తత్ఫల మనుభవించువానియానంద మవ్యాజ
మై యద్వితీయమై యలరారు. పరులపాటుఫలము నీ వనుభ
వించునాఁడా యానంద మేమాత్రముం గలుగదు. నీయంతట
నీవొకపని చేసితివా యం దెన్నిలోపము లున్నప్పటికి నది నీ
కిచ్చుసౌఖ్యము పరుఁడుచేసిన దెంతయందముగా నున్న నది గలి
గింపఁజాలదు. శ్రమపడి యొకలెక్క చేసి చేసి, కడకు ఫలిత

మంచిన గణితశాస్త్రజ్ఞునిహృదయానంద మాతసిగ్రంథము నుండి లిక్కికి లిక్క మక్కికి మక్కగ వ్రాసికొనినవాని కల పడునే? అదృష్టమువలన నకస్మాత్తుగఁ గలిగెడిసుఖములకంటెఁ బాటుపడుటవలనఁ దొరకుసుఖము లెక్కుడు విలువవైనవి. పాటుపడు జనులు పనులఁజేయుచుఁ బాటలు పాడెదరు. ఆపాట వారియాయాసవిధ్వంసి, ఆనందచిహ్నము. నిపుణుఁడగు పని వానిపాటులో లయ యున్నది. నిపుణతగల కంసాలి సుత్తె దెబ్బలలో లయకలిమియు, చేతకానివాని చేతిసుత్తెదెబ్బలలో లయలేమియు మీ రెఱింగినదే.

7. పాటువలన పనులు సుకరము లగును. పాటువలన నద్భుతముగ దుర్లభకార్యములన్నియు లభ్యము లగును. అందువలననే 'కృషి ఫలీ'యను నుడి పుట్టినది. బండ్లను లాగి, బట్టలుదికి, కట్టెలఁగోసి, పొలములు దున్ని, పంట పండించి, వస్త్రముల నేసి సుఖ మొడఁగూర్చునది పాటు. ఆధునికప్రపంచపు సౌఖ్యమంతయుఁ బాటుపై నాధారపడి యున్నది. సుఖకరమగు గాఢనిద్ర పాటుపడువానికింగాక సోమరి కబ్బదు. శరీరస్వాస్థ్యము పాటుపడువానికిఁగాక సోమరికింగల్గదు. బహులాభముల సమకూర్చు మంత్రశక్తి పాటు. శ్రమలఁ బాపి సుఖమొడఁగూర్చు మాయ పాటు. ముడిపదార్థముల నుపయోగకరమగు వస్తునిచయముగ మార్చు నైంద్రజాలికము పాటు. మంటినిగూడ బంగారమొనరించు పరుసవేది పాటు. అట్టి పాటు గౌరవింపఁబడవలసినదిగాని గర్హింపఁబడవలసినది కాదు.

8. శారీరకమానసికాధ్యాత్మికవిషయములం దెద్దాని విషయ మగు పాటైనను గౌరవనీయమయినదే. ఏవ్యక్తి

పాటుపడునో వాఁడు సుఖములం బడయును. ఎవ్వఁడు పాటు నొల్లక సోమరియై సుఖములం బొందఁగోరునో వాఁడు తుదకు సుఖములకు దూరుఁ డగును. ఏపాటుదప్పిన సాపాటు దప్పు దని చెప్పుహాస్యవచన మున్నది. సాపాటైనను బాటుపడువానికి రుచించి మేలొడఁగూర్చునుగాని పాటులేనివాని కదియు సంతోషబలముల నియ్యదు. వ్యక్తులకు వర్తించునదే దేశములకును వర్తించును. ఏదేశమున జనులందఱు పాటుపడరో యాదేశమున దారిద్ర్య మిల్లు గట్టుకొనును. ఏదేశమునఁ బ్రజలు రాత్రిందివము లనుక్షణము వ్యర్థముచేయక పాటుపడెదరో యాదేశమున లక్ష్మి నివాసమొనరించును. పాటువంటి దన్యము లే దని ఘంటాపథముగఁ జెప్పనొప్పును. కాఁబట్టి పాటుపడుఁడు! పాటుపడుఁడు!! పాటుపడుఁడు!!! పాటే మీ కేభంగపాటును గల్గనీయక సర్వోద్యమంబుల విజయము సమకూర్చును. పాటుం బ్రేమించుటే దైవమును బ్రేమించుట. వ్యక్తులు గతించినను వారిపాటుఫలితములు వంశపారంపర్యముగ జను లనుభవింప నిల్చియుండును. పాటు ప్రయోజనకరము; వాంఛనీయము; గౌరవప్రదము.

డాబు.

1. తనయందు ఘనతలేనిది ఘనత యున్నట్లు గోచరింపఁ, దా విద్యాగంధమెఱుంగనివాఁడయ్యు విద్వాంసుని పగిదిఁ దోఁచ, ధనవిహీనుఁడయ్యు శ్రీమంతుఁడువోలెఁ గన్పట్ట

నరుఁడు చేయుప్రయత్నము, వేయువేషము, వాకొనుభాష మొదలగునవన్నియు డాబు. డాబు విశేష్యమే కాని, వాడుకలోఁ బడాయిమాటలఁ జెప్పెననుటకుఁ, జేతకాని ప్రజ్ఞలు వలికె ననుటకు 'డాబె' నను క్రియారూప మున్నది. అందునను వాఁడు డాబె నన్నప్పుడు డాబుమాట లాడె ననియే యర్థము కాని డాబుసరిపనులఁ జేసె నని యూహింపవలనుపడదు. ఇఁక వాఁడు డాబుచేసెనన్నచో మనోవాక్కర్మల దేనిచేనైనఁగాని యన్నిఁటిచేఁగాని డాబుచేసినాఁ డనియే యెంచుకొనవలయు. అనఁగా డాబుచేసెననుట విపులమైన యర్థమునను, డాబె ననుట సంకుచితమైనయర్థమునను వాడుకమాటలయందుఁ బ్రయోగం బున్నది.

2. అధికస్థితిలో నున్నవారివలెఁ దాను గావలె ననికాక, తా నున్నట్లు గన్పట్టవలె ననుసంకల్పమే డాబున కుత్పత్తిస్థానము. తా నధికుండైనట్లు తన్ను వినువా రల్పులైనట్లు డాబులరాయఁడు భ్రమపడును. నిజమైనలోకజ్ఞానము లేమియే డాబునకు మూలము.

3. ఎల్లరును డాబుచేయరుకాని డాబుచేయువా రన్నికాలముల నన్నిదేశముల నున్నారు. పేదవాఁడు మొదలు ధనవంతునివఱకుఁ గలయందఱిలోఁ గొందఱు డాబుచేయుదురు. అనఁగా దమయథాస్థితికంటె నధికతరస్థితిలో నున్నట్లు గోచరింపఁ బ్రయత్నించెదరు. నరుఁడు డాబుచేయువేళ నిజలోపనిగూహనమో, తనయం దభావమైనయౌన్నత్యనటనమో రెండునో యుండితీరును. కష్టసుఖములు, కలిమిలేములు

రోగారోగ్యములు జీవుల కబ్బుట సాజమగుటచే నందుఁ గష్టము, లేమి, యామయము వచ్చినప్పు డెవ్వండును వానిని గప్పిపుచ్చి, సుఖము, కలిమి, యారోగ్యము ననుభవించుచున్నట్లు నటింపనక్కఱలేదు. ఉన్నదోసంగుం దొలంగించుకొనుటకై కడంగక, దాని దాఁచుకొనుటయే గొప్ప యని యెడందం దలపోసి, యంతటితోఁ దనియక, నిజముగా లేనిసుగుణసంపత్తి యున్నట్లు నటించి మురిసి డాబు చేయఁ బ్రయోజనమేమి? కడగండ్లలోనుండియు భోగివలె మసలి దారిద్ర్యమున మున్గియుఁ జాకలినుండి యద్దెకు గొన్న చలువమడతలమడువుల బెడబెడలు వినిచి, రోగపీడితుం డయ్యుఁ బరులతో సంపూర్ణారోగ్యవంతుఁడట్లు మెలఁగి, తలమునుకలగు ఋణములపాలయ్యు ఋణదాతరీతిఁ దిరిగి, నిరక్షరకుక్షియయ్యుఁ బట్టభద్రునివలెఁ బ్రవర్తించి డాబుచేయుట యెందుకొఱకు?

4. ఎదుటివానిని మోసగించి తాత్కాలికముగ వానిని నమ్మించి వానివలన నేదియో లబ్ధి పొందుటకుఁ గొందఱు డాబు చేయుదురు. నీవు పేదవై ధనాపేక్షితుఁడవైనప్పుడు సంపన్నుని యొద్దకుఁ బోయి యొక్కరూపాయి నీ కిమ్మనిగాని బదులిమ్మనిగాని వేడితివా యాతఁ డీయఁడు. అట్టియెడ నీవు ధనికునివలె వేషము వేసికొని, నీ కంతకుఁబూర్వము పరిచయమంతగా లేని ధనికునిఁ జేరి, లక్షలతో నీకు వ్యాపారమున్నట్లు డాబుమాటలు చెప్పి, మాటలమధ్య వేయిరూపాయిలనోట్లు మాత్రమే దగ్గరనున్నట్లు, చిల్లర లేనట్లు నోరుజారవిడిచి చివరకుఁ బదిరూపాయిలు గంటలోఁ దిరిగియిచ్చి వేయుపద్ధతిని జేబదు

లిమ్మని యంటివా, నీ కాసొమ్ము లభించును. అనఁగా డాబుచేసి నీకోర్కె నెఱవేర్చుకొనఁ గల్గెదవు. ఈవిధమున నేసమయమునకుఁ దగినరీతి నాసమయమున డాబుచేసితివా కొంతవఱకు నీమనోరథములు తొలుత సఫలము లగుచుండును. దొంగసాక్ష్యములఁ బొల్లుపోసికొనువాఁడవయ్యు గృహస్థులయిండ్ల భోజనపుసమయమునకుఁ జేరి దైవభక్తి యుట్టిపడినట్లు నింటిలోనివారిచెవులు చిల్లులుపడునట్లు రామనామస్మరణచేసితివా మనస్సుకరఁగి యింటియజమానుఁడు నీ కాపూటకు భోజనమిడును. ఇట్లే సెలవులలోఁ బల్లెలకుం బోయి పెద్దపొలము కాపులఁ జేరి నీవు గొప్ప రాజకీయోద్యోగివలె ముచ్చటించినచో, వారు నమ్మి నీకు ముంజెలు తెచ్చి ఫలాహార మిడెదరు. సమయోచితముగా డాబుచేయువానికిఁ గొంతవఱకుఁ బ్రకమమునఁ దనప్రియత్నములవిజయమే చేకూరును.

5. కాని డాబులరాయునియాటలు సాగనిఘట్టము లున్నవి. పరిచితులముందు డాబు మొదలే సాగదు. అందుచేతనే డాబుచేయువాఁడు పరిచితులకంటఁబడినప్పుడు దొంగను దేలుకుట్టినట్లూరకుండును. లోకజ్ఞానముగల గడుసరులముందు డాబు చెల్లదు; ఏమన మనుష్యుని జూచినంతనే వారిగుట్టుమట్టులన్నియు నాగడుసరులు లాగెదరు. వీరికిందోడుగఁ బెంకెతనముగలవారిని జెప్పనగును. పెంకెవారు తా మాదినన్నమాట నెగ్గించుకొనుట ప్రధానముగ గణించెదరు. అట్టివారియెడ డాబుచేయువాని యదృష్టమునుబట్టి జయాపజయంబులు సిద్ధించును. డాబు లొల్లనివారిదగ్గర నితరులడాబు వ్యర్థము. నల్గురు

చూచుచుండఁ బేరుకొఱకు దానములు విరాళములు నొసంగ నిచ్చగింపనివ్యక్తులసన్నిధిని డాబుచేయుట బూది నాజ్యము వేల్చుటయే.

6. డాబుచేయువాఁడు కొంతకాలము యథేచ్ఛగా వర్తింపఁగలఁడు. కాని యెప్పుడో పాపము బద్దలైనట్లు వాని గుట్టు వెల్లడికాక తీరదు. వానిపరపతి నాటితో సరి. దేనికైన జన్మస్థితిలయములక్రమ మనుల్లంఘనీయముగదా! పైనఁజెప్పిన చొప్పున మొలకెత్తిపెంపైనడాబును గూలక తీరదు. డాబుతో యశోధనాదికముల గడించుట చీట్లతో భవనముగట్టుట. నిలిచినంతకాల మామందిరము లోక మెఱుంగనిబిడ్డల కానంద హేతువై కన్నుల కింపుఁ గూర్చును. కాని కొనయూపిరి తగిలి నప్పటికి నది నిలువక నేలమట్ట మగును. అట్లే డాబుసాగినంత కాలము తదనుసరణకర్తను బట్టఁ బగ్గము లుండవు. పల్లవించినడాబు వెల్లడియైనదా, వాఁ డేమాత్రమేని సిగ్గుబిడియము లున్నవాఁడైనచో, మఱి మొగమైనఁ జూప సిగ్గిలి పదిమంది మాటుమణఁగిన పిదప నూరు దిరుగవలసినవాఁ డగును; డాబు చేయుటకు పూర్వ మున్న సామాన్యస్థితిం గూడఁ గోల్పోయి యథఃపాతాళదుస్థితిం బడును; ఉన్నగోడు చెడ వాఁడు మఱి లేవఁజాలఁడు. పదిమందిలో గౌరవము పోఁగొట్టుకొనును; ఎల్లర యెగతాళికిని లక్ష్య మగును. వానిమాటవిలువ నశించును. వానికి మనోవ్యాకులత గల్గును. సిగ్గుబిడియములు లేనివాని కీతిట్లు దున్నపోతుపైఁ గుంభవృష్టి. కాన వాఁడు మఱియొక యూరుఁజేరి డాబు సాగించుచునే యుండును.

7. డాబుచేయుట యనఁగా మోసముచేయుట. నిష్కల్మషహృదయులను వంచించుట. అట్టివారిధనము నాకర్షించుటకుఁ బన్నిన వల డాబు. క్రొత్తవారును నమాయకులును డాబునకుఁ బడిపోయి ధనము గోల్పోవుదురు. డాబుచేయువాఁడు తోడివారి కన్నులు మూయఁగల్గునే గాని సర్వాంతర్యామికన్నుల మూయఁజాలఁడుగదా! అనఁగా డాబుచేయువాఁడు పాపభీతిలేనివాఁ డని చెప్పనొప్పును. ఏమన డాబుచేయుట యసత్యమున కొడిగట్టుటయే. మఱియు డాబునకు నసత్యమునకు నొక్క సామ్య మున్నది. ఒక్కకల్లయాడినవాఁడది కప్ప ననేకములు కల్ల లాడినట్లే యొక్కసారి డాబునకు దిగినవాఁడది నిలుపుట కెన్నియో డాబుపనులఁ జేయవలయును. డాబునకుఁ దాల్చిన యున్నతస్థితి కుచితముగ ధనముకూడ వెచ్చింపవలసివచ్చును. ఇతరులను జాటున యాచించుచు వారి పరోక్షమునఁ దానే వారికిఁ బోషకుం డట్లు పలుకాడ నుద్యోగించును. పలుపాట్లఁ బడును. అప్పుల కుప్పయై మేడిపండుగౌరవము, నేతిబీరకాయసామ్యము పొందును. వానిపాట్లు బరమేశ్వరునకే యెఱుక.

8. డాంబికుఁడు మనస్స్థిమితముం గోల్పోయి స్వేచ్ఛలేక సంచరించును. ఇతరులు తన్నుఁ దక్కువవాఁ డనుకొనుచున్నారేమో యని వానికి సర్వదా భయము. అందుచే నితరుల మెప్పువడయు వేషముల ధరించును. దొంగవారినామస్మరణచేయు డాబుసరివాఁడు వినువారు మాటాడుచోఁ దన కంఠము తగ్గించి వారిముక్కులకుఁ జెవు లొగ్గుచుండును. డా

బునకు దుస్తులను ధరించినవాఁడు ప్రజలదృష్టి నాకర్షించు నట్లు కొంగుల సద్దుకొనుచుండును. మహాగ్రంథములఁ జదివి నట్లు వినికిడివలనఁగొన్నమాటల దొరలించును. దూరమం దున్న ప్రసిద్ధోద్యోగులనామముల నేకవచనములోఁ బ్ర యోగించి వారెల్లరు తనకు దాసులై యున్నట్లు వాక్రుచ్చుచుం డును.

9. డాబు తగనియెత్తుగడ యగుటచేతను దలకు మీఱినప్రయత్నము చూపుచే టగుటను డాబుచేయుట దుఃఖమును గొనితెచ్చుకొనుటయే యని విశ్వసింపఁదగును. ధనికులట్లు గాన్పింప నెరవునఁ గలలో మురిసి యవి పోవఁ గడకుఁ బూర్వపుబలుకుబడినిగూడఁ బోఁగొట్టుకొని యెందఱు పరులనవ్వులపాలైరి. పులితోలు గప్పుకొనిన గార్దభము దర్పమును, నెమలిపింఛమును ధరించి మెఱసిన వాయసము గర్వమును దుదకేరీతిని బరిణమించెనో విదితమేకదా! స్త్రీలయెదుట బీరములు పల్కిన యుత్తరుని పోటుమానిసితనపుమాటల డాబు శత్రుదళదర్శనమాత్రమున రూపుమాసినది. ఉత్తర కుమారప్రజ్ఞలన్నమాట లోకోక్తియై యిల్లుకట్టుకొని సుస్థిరముగ నిల్చినది. చీడయుంటినను సిరియుంటదన్నట్లు డాబుచేయువారి కుత్తరకుమారునిపరాభవమే యబ్బును గాని వానిపేరట్లు తమనామములు శాశ్వతములు కానేఱవని నమ్మితీరవలయును.

10. డాబసురవృత్తి; మోసకార్యము; నిష్ఫలవ్యాపారము. అది పెక్కిక్కట్టుల కిక్క. కాఁబట్టి నీపూర్వుల

నిరాడంబరచారిత్రములఁ బఠించి, నీప్రస్తుతస్థితిగతుల గమనించి, దేశకాలపాత్రములమార్పుభంగి నెఱింగి, తగినమాత్రపు వేషములతోఁ, ననుకూలంపు టెత్తుగడలతోఁ బౌర్వాపర్యంబు విచారించి నిష్ప్రయోజనకరము లగు డాంబికవ్యాపారములు విడిచి డాబునకుఁ బరాచీనుఁడవై మెలంగి సుఖింపుము.

నడత.

1. 'ఒకఁడు గుణముగలవాఁ' డను వాక్యములో గుణమునకు మంచిగుణ మనియుఁ జెడుగుణ మనియుంగూడ నర్థము జెప్పుకొనుట కవకాశమున్నట్లు దోఁచుచున్నను, గుణమునకియ్యెడ మంచిగుణ మను నర్థమే రూఢి. అటులనే నడత యనినప్పు డున్మార్గప్రవర్తనముగాక సన్మార్గప్రవర్తన మనియే స్థిరపఱచుకొనునది. వృత్తము, ప్రవర్తనము నడతకుఁ బర్యాయపదములు. వీనికిముందు మంచియని గాని తదర్థమిచ్చునట్టి గాని యుపసర్గఁ జేర్చుకున్నను సద్వర్తన మనియే యవి యర్థమిచ్చును.

2. ప్రవర్తనము మంచిదైనవాఁడు పూజ్యతఁ గాంచును. ఒకనినడత వానిశీలము ననుసరించియుండదు. అంతమాత్రమున వర్తనమును బట్టి యోగ్యతానిర్ణయమునకుం గడంగుటకు వీలుకాదు. శీల మంతస్థితము, వృత్తము బహిర్వర్తనము. తొలుతఁ 'గన్నుల కింపైనఁ గడుపున కింపగు' నన్నమాట నీప్రవర్తనముపట్లు నుపయోగించి చెప్పుము. ఒకనివృత్త

ము నీకన్నుల కింపైనచో వానిశీలమువిషయమై నీకు సదభిప్రాయము పుట్టును. మార్గస్థుఁడు దప్పిఁగొని దారిలోనున్న తాళవృక్షమునీడఁ గూర్చుండి, చేతఁగలపాత్రిలోని పాలఁ గ్రోలు చనుకొనుఁడు. అతనివృత్తము దూరమునుండి కనినవాఁడా పాంథుని దా్రగుఁబో తనుకొనును. కాని వానిపరిస్థితులలో నట్టివాని యమలశీలమునకుఁ గళంకమాపాదింప దని యూహించుటకుం దగినంత వ్యవధి, ప్రేమ, సానుభూతి, లోకమున కుండునే? కాఁబట్టి ప్రతివ్యక్తియుఁ దన ప్రవర్తనము దిద్దుకొన వలసియున్నది.

3. నలుగురిలోనున్నపుడు వాఁడు మెలఁగురీతి యే నడత. అది తృప్తికరముగను జనరంజకముగను నుండవలయును. నీతు లని పెద్దలుచెప్పు కొన్నిటిని వినుఁడు. అవి యనుసరించితివేని నీవర్తనము బాగుపడును. పెద్దల సముచితప్రకారమునఁ బూజింపుము. సర్వభూతముల సనుప్రేమమునఁ జూడుము. పరిచితులు కంటఁబడినప్పుడు నమస్కరింపుము. ఉపకారికిఁ గృతజ్ఞతఁ జూపుము. ప్రతివాక్యాంతమందుననో, మధ్యనో, 'తమదయ' 'తమయాశీర్వచనమువలన' ననునర్థమిచ్చు పలుకుల గౌరవపురస్సరముగాఁ దొలిలింపుము. ఈమాటల వలన నీకు వీసమైన నష్టములేదు కాని యామంచిమాటచేయు కార్యము లక్షపిలువ యుండును. పరులపల్కుల నాలించినపు డవి నీయభిప్రాయానుకూలములైనను గాకున్నను గోపమూనరాదు. సర్వదా చిఱునవ్వుతో వానిఁ ద్రోసివేయుము. హాసన్ముఖ మెదుటివారిని హాసన్ముఖులఁ జేయును. ఆలోచనా

నిమగ్నులను గాఢనిద్రాపరులను లేపెడి కాలిచప్పుడుతో నడచుట, వదరుట, నిన్నుఁ గనవచ్చినవారి కాదరపూర్వక స్వాగతం బొసంగకుండుట, క్రొత్తవారి నెదుటఁ బస్తుంచి నీవు ముందుగఁ గుడుచుట, నీ వెంత కొమ్ములు దిరిగిన ఘనుఁడవైనను నీ కుపకారకర మగు పనిచేయు నితరులను దరియక, రమ్మని వారికి వార్త నంపుట, యధికారి నని యితరులఁ దూలనాడుట, దుష్ప్రవర్తన మనఁబడును. ఇందులకు వ్యతిరిక్తంబైనవన్నియు సత్ప్రవర్తన నాఁ బఱగును.

4. నడత మంచిదైనవాఁడు వేకువను లేచి, కాలకృత్యముల నిర్వర్తించుకొని నియమానుసరణముగ సొంతపనులఁ జేసికొని సాయంకాలమున కిల్లుఁ జేరి సాపడి నిద్రపోవును. వీలైన నితరుల కుపకార మొనరించును. లేదా తటస్థుఁడై మిన్నకుండును. ఇతరులవిషయమై లేనిపోని సంకోచములఁ జెందఁడు. ఒకనియొద్ద విన్నమాటల నచ్చటనే మఱచును. రెండవవాని చెవి నేయ నుంకింపఁడు. ఎల్లరకుఁ జెవియొగ్గును గాని యెవ్వనికి మాటనీయఁడు. ఆడంబరజీవన మొల్లక యున్నతాలోచనలు సేయును, లేనిపోని యెత్తుగడలతో నప్పులపాలు కాఁడు. ధనమునకై యాసపడి యకార్యము లాచరింపఁడు. సత్యప్రతికూలవాక్యము లాడఁడు. పేచీలకుఁ బెదబాబు కాఁడు. ధన మార్జించుకొనినను దానిని గుప్పిటఁ బెట్టుకొనునే గాని హృదయకుహరమందు దాచుకొనఁడు; పొగఁబీల్చుట వంటి యసభ్యకార్యముల నేవగించి వానికిఁ బరాఙ్ముఖుఁడగు; తలవంచుకొని యే వీథి నరుగును; పనిగలవారితోడనే ప్రస

గించును; వ్యర్థకాలహరణానురక్తి కెడమగుటచేఁ దనకాలమునుగాని యితరులకాలమునుగాని నిరుపయోగముగ గడప నంకింపఁడు. అవసరమునకుపయోగపడు వస్తునిచయ మింటఁ జేర్చుకొని యెవ్వేళల సంసిద్ధుఁడై యుండునుగాని, కావలసినప్పుడు పరువులెత్తి కలియఁ ద్రొక్కుకొనఁడు. పరులు నొచ్చునట్లెదురాడఁడు. అందుల కడ నబ్బినప్పుడు శాంతముగ హితబోధసేయునుగాని తనమాట నెగ్గినదను ప్రగల్భములఁ బల్కఁడు. ఎందైనఁ దనకే యోటమి చేకూఱినప్పుడు, దిగులు జెందక, ధైర్యముం దాల్చి సంతోషవదనప్రదర్శనముం గావించును. పిన్నపెద్దలతోడను స్వపరజనులతోడను సౌమ్యతతో సాదరపూర్వకవచనము లాడును. ఇంటిలోవారితోడను బైవారితోడను బ్రేమ తొలుకాడ మాటాడును. పరులవ్యాపారములలోనికిం దలఁదూర్పఁడు.

5. ఇఁక దుర్వృత్తమునకుం గారణములు కామక్రోధలోభములు మొదలగు దుర్గుణములు. వానిని జయించినవారు వ్రేళ్లలెక్కిడఁగలయంతమందియే యున్నారు. వట్టిపదవులకై పండితుఁడు, పామరుఁడుకూడ పైకము వెచ్చించి పేదయై బంధుమిత్రులు పరులు నను భేదంబులేక, యెల్లర మోసగించి నరకంబునకు రాచబాట లేర్పరచుకొనుచున్న యీదినములలోఁ గోరికలు లేనివాఁడు కోపరహితుఁడు లోభశూన్యుఁడునై యొక్కఁడుండు ననుకొనుట వెఱ్ఱి. అట్టివారు విడివిడిగాఁగూడ నుండరు. ఇట్టివాఁ డొక్కఁడున్నను బ్రజ లొకనిపై నొకఁడు నమ్మకముంచక, వారు శత్రువులై దేశసంక్షోభ ముదయింపఁజేతు రన్న

వింత యేమి? పేరాస పెక్కుడుముల కిల్లు. ఎవనికిఁ గావలసినంత ధనముమాత్రము వాఁడు నిలువఁ జేసికొనినచో, నధికమున కాశ పడనిచో దేశసంక్షోభము సర్వము నడుగంటును. ఈవాక్య మందముగ నున్నది. ఉపన్యాసవేదికపైనుండి గంభీరముగ గర్జించు వక్తకుపయోగముగ నున్నది. దీని నొరవడిబెట్టువాఁడే గాని నాచరణమునఁ బెట్టుయోగ్యుఁ డేడీ?

6. మానవునివృత్తము వానియాశయమును బట్టి యుండును. వర్తకునియాశయ మొకటి, న్యాయవాది యాశయ మింకొకటి, వీధి నూడ్చువాని యాశయము వేఱొక్కటి. మోసగించి, పేచీలుపెట్టి, శ్రమపడి ధన మార్జింప వారు తలంచెదరు. దేవునిదృష్టిలో నీమూఁడుపనుల నేదిగణ్యతఁ గాంచునో యెల్ల రెఱింగినదే కాని నీమువ్వుర నెవ్వని నీవు గౌరవించుచున్నావు? గౌరవ మీయవలసినవాని కీయక, గౌరవింపఁగూడని హానిని భీతిచేత గౌరవించుచున్నావు. వానివర్తనము చెడ్డదని యెఱింగియు నొక్కని గౌరవించి, వర్తనము మంచిదని తెలిసియు నింకొక్కని గౌరవింపని నీవృత్తము నేమనవచ్చును?

7. సత్ప్రవర్తనమునకు లోకజ్ఞాన మావశ్యకము. నానాదేశాచారములు దెలిసి యాయాదేశమువారియెదుట వారి కనుగుణముగ మసలుట సద్వృత్తము. అట్లు మసలనిచో వారు నిన్ను దుష్ప్రవర్తనుఁడవని సముద్ధతుఁడవని త్రోసివేయుదురు. నీకును వారికిని సౌభ్రాత్రము కుదురదు. కలహము లంకురించును. దానికిం గారణము నీయజ్ఞానపూర్వకదుర్వృత్తము. రాజసభలోఁ బాదములు గన్పడఁ గూర్చుండు

భారతీయులకుఁ దప్పు. హిందువులలోఁ జెప్పులతో భుజింప నేగుట దప్పిదము. తెల్లవారిలోఁ జేతివ్రేళ్లతో నన్నము గలుపుట దుష్ప్రవర్తనాచిహ్నము. ఏసంఘములో నీ వుంటివో యెఱిఁగి నీ యంతరాత్మప్రబోధితములకుఁ బ్రతికూలములు కానట్టియు నీ వున్న సంఘమువారు హర్షించునట్టియుఁ బనుల నాగాముల నెంచి ప్రవర్తింపుము.

8. వాత్సల్యానువర్తనము లున్న వాఁడు తా నేమిచేసిన నితరుల కేమి హానిగలుగునో యని భయపడును. అమలప్రవర్తనముగల బాలుఁడు దేశమున కలంకారము. ఘనపరాక్రమసాహససంపన్నతగల స్త్రీపురుషు లెప్పుడును వినయవిభూషితులు. మర్యాద లెఱిఁగిన బాలురు బాలికలు సర్వదా యీ దిగువ వ్రాయఁబడిన వర్తనాసూత్రముల నాయాతావుల నెడంద నిడికొనందగుఁ గాన నవహితుండవై యాలించునది:—

స్వవిషయము:—స్వచ్ఛన్యాయవర్తనముం గలిగి యుండి, దుర్భాషలాడక, దుస్సాంగత్యముఁ బరిత్యజించి శరీరము బట్టలు స్వచ్ఛముగ నుంచుకొనందగును. త్రికరణశుద్ధిగఁ దలపెట్టినపని చేయవలయు. పరమార్థజ్ఞునకు వినయఫణితి తగును.

స్వగృహము:—ఇంట జననీజనకులకు యథాశక్తిగఁ జేదోడు వాఁదోడుగనుండి వారిని సంతోషపఱచి గౌరవించి పూజింపఁ దగు. సోదరసోదరీమణులను దదితరబంధువులను

వాత్సల్యముతోఁ జూడఁదగును. స్వలాభపరుండవుగాక మంచి వస్తువులన్నియు వారి కొసంగి మిగిలినవే నీవు పొందుట యుచితము.

బడి:—నీవు విద్యార్థివైనచో నుపాధ్యాయుల గౌరవించి, యణకువఁ గలిగియుండి వారియాజ్ఞానువర్తివైఁ బడి విధానము లతిక్రమింపక మెలంగునది. దొంగతనము మొదలగువానిపొంతఁ జనకుము. బడివస్తువులను నీస్వంతవస్తువులట్లు భద్రముగఁ గాపాడునది. సత్యమును దప్పక న్యాయపథంబుఁ బట్టుము.

ఆటలు:—ఆటలలో సంగడీండ్ర మోసగింపరాదు. బలహీనుల బెదరింపఁజనదు. ఏమనఁగా నాపని పిఱికివారు చేయుదురే కాని ధైర్యశాలు రొనర్పరు. అందఱితోడను సంతోషముతోఁ గలిసి మెలసి యుండుము. వారితోఁ బోరాడవలదు. తోడివారి నేరిని వెక్కిరింపక వారికి హితవులేని పేరులఁబెట్టి పిల్వక మెలంగునది. ఓటమికిఁ గుందకుము. నీవిజయమునకుఁ గాక నీపక్షమువారివిజయమునకై యెల్లప్పుడు యత్నింపుము.

వీథి:—దారిని బోవుచో నుపాధ్యాయులుగాని యితర పెద్దమనుష్యులుగాని యెదురైరేని వారి కంజలి ఘటించి వారి యాశీస్సు లందఁదగును. వీథిని నడచువారిని గెంటి వారిమీఁదినుండియే నడచిపోరాదు. ఆలుబిడ్డల యితరులకుఁగాని వారి వస్తువాహనంబులకుఁగాని నష్టము గలిగింపఁజనదు. వర్తకుల యంగడిగుమ్మములలోను, గిటికీలయొద్దను నిలిచి వారిని విసి

గింపఁజనదు. వృద్ధులతోడ నంగవిహీనులతోడఁ బరియాచకము లాడక, వారిని క్రొత్తవారిని విశేషసౌమ్యతతో గౌరవింపుము. ఎదురగువారికిఁ జోటిచ్చుచు నెల్లవేళల వామపార్శ్వంబునకుం దప్పుకొని నడచునది.

సేవకులు:—సేవకులును బాటుపడువారినిగూడ నుచితగౌరవముతో నారయందగును. నీ వుద్యోగివై ధనమియ్యఁగలవు, చెప్పులు గుట్టుకొనలేవు. చెప్పులఁ గుట్టువాఁడు పనితనము కలవాఁడు; కాని నిర్ధని. మీ రొకని కొకఁడు సాహాయ్య మొనర్చుకొనవలయును. ఎవనివ్యాపారములో వాఁడగ్రేసరుఁడే. ధనికుఁడ వని విఱ్ఱవీగక పనివారలను మధురభాషణముల గౌరవింపవలెను గాని నిరసింపరాదు. నీవు ఘనుఁడవు కాదు; సేవకుఁడు నీచుఁడు కాఁడు. దైవదృష్టిలో నెల్లరొక్కరూప. గరువముచే మానవులు స్థితిభేదములఁ బట్టి గౌరవభేదములఁ గల్పించి యొండొరుల నిరసించుకొనుట యనీతి. ఎల్లవృత్తులు నెల్లకార్యములు పరోపకారకములైనచో గౌరవనీయములే.

అన్నితావుల:—ఎచ్చటనైనను సరే పిన్నపెద్దలను నీమోటవృత్తముచే బాధింపఁజనదు. సంభాషణముం దయ్యా యమ్మా యను గౌరవపదముల దొఱలించుటలో నీ నాల్కను వెన్కాడనీయకుము. ఎవరిగృహమునకైన పోయిన వెంటనే యచ్చట పొంచుండి వినక, తలుపు మెల్లగఁ దట్టి నిలుచుండుము. ఎవ్వరని లోపలివా రడిగిన నే నని చెప్పక నీపేరు చెప్పుము.

పెద్దలు క్రొత్తవారు నీదగ్గరకు వచ్చినప్పుడు నీవే వారి కభిముఖుఁడవై గౌరవముతో స్వాగతం బిమ్ము. వారు గోరున దిచ్చి యవసరమైనచో నీవు లేచియైనను వారిఁ గూర్చుండఁ జేయుము. మాటాడువాని కెన్నఁడడ్డు తగులకుము. అనవసర వ్యాపారములలోఁ జేఁజేసికొనకుము. వేళపట్టున నీపనులఁ జేసికొనుము.

9. మొత్తముమీఁద దుర్బలుల రక్షించుట, యజ్ఞానులకు జ్ఞానబోధసేయుట, యెత్తుపడిపోయినవారికై జాలిపడి వారిని లేవనెత్తుట, యధమస్థితిలోనివారికిఁ జేయూత నొసఁగుట, తల్లిదండ్రులఁ బ్రేమ ముట్టిపడ సేవించి వారిమాట పాలించుట, బిడ్డలకు దయతో విద్యాబుద్ధులను గఱపి పెంచుట మొదలగున వన్నియు మానవధర్మములు; సద్వృత్తలక్షణములు. ఎప్పుడు సేవచేయుటయేగాని భోగములపొందుట పనిగాదని యెంచుట, ననుదినము నిన్నటికంటె నధికతరస్థితిలోని కరుదేరఁ బ్రయత్నించుట మేలు.

10. ఈగతినిఁ జెప్పఁబూనిన విఱుగుదఱుగు నుండదు. ఆదియంతరము గానరాదు. ఏండ్లు పూండ్లు పట్టును. స్థాలీపులాకన్యాయముగఁ జెప్పిన యీవర్తనాసూత్రములన్నియు వడఁబోసి కరడునఁబోసినసారంపుముద్ద యనంజెల్లు నొక్కవాక్యమును సర్వదా స్మరింపుము. అది యేదనఁగా "నితరు లెట్లు నీ కొనరింపఁగోరెదవో యట్లే నీ వితరుల కొనరింపుము." వారి స్థితిలో నీ వున్నట్లూహించుకొని యప్పుడు నీ కేది హితమగునో యెంచి యది యన్యుల కాచరించుటవలన నీవర్తనము బ్రశంస

నీయమైన దగును. ఇదియే వృత్తమును నవరించు మహాగురు మంత్రము. ఈ సూత్రంబులఁ బాఁడిగాఁ గొని యం దేర్పాటుగావించినమార్గంబున నడువ మేకొనువాఁడును, బరమేశ్వరునిపైన భక్తిఁ బాదుకొల్పినవాఁడును, దుర్నీతిసంఘ విధ్వంసనాపాదకుఁడునై యైహికాముష్మికసౌఖ్యంబు లొడఁగూర్చు పవిత్రనగల నరుం డగు ననుట తథ్యము.

కోపము

కోపమునను ఘనత కొంచెమై పోవును
గోపమునను మిగుల గోడుఁ జెందుఁ
గోప మడఁచె నేని కోరిక లీడేరు.—(వేమన)

1. అపరాధులపైఁ గొందఱిమనంబులఁ బ్రజ్వలితం బగు తీక్ష్ణవృత్తి కోపము. కోపము కాపురుషగుణం బని భారత వచనము; బుధాభిప్రాయము; విశ్వసనీయవిషయము. కోపముదేకగుణములం దొకటి.

2. ప్రపంచమునఁ గోపమెఱుఁగనిజాతి లేదు. దారిద్ర్యముచే భోగమున కెడమైన జాతు లున్నవి; సంచారజీవనమున కలవడి స్థిరవసతిసౌఖ్య మెఱుఁగని జాతు లున్నవి; సోమరితన మన్నది శూన్యముకా నిరంతరపరిశ్రమఁ జెందుజాతు లున్నవి; కాని కోపోద్రేకముం జవిఁజూడని జాతిమాత్రము నిప్పచ్చు. దేవతలుకూడ నప్పుడప్పుడు కోపము వహించినట్లు గాథ లుండ మానవులు జంతువులు గోపమూనుటలో నబ్బుర మేమున్నది?

3. ఇకఁ దక్కుంగల యుద్రేకగుణములకును గోపమునకును భేదము లొకటి రెండున్నవి. తక్కినగుణములు కేవలము వ్యక్తిగతములు. ప్రేమం గనుఁడు. సామాన్యముగా నొకపురుషుఁ డొక స్త్రీని మోహించును. ఒకజాతిలోని లేక సంఘములోని పురుషులందఱుం గలిసి యాపని చేయరు కాని, జాతి మొత్తమంతయుం గలిసి యేకాభిప్రాయముతో నితరదేశములపైననో, పరరాజులమీఁదనో కోపమూనుట యున్నది. మహాసైన్యములు కోపప్రేరితములై రణంబు లొనరించిన సందర్భము లేదేశచారిత్రమునందైన గుప్పలు తెప్పలుగఁ గన్పట్టును. ఉద్భవించినప్పుడే కోపము తా రాజువ్వవలె పైకెగయును. తక్కుంగల గుణము లుత్పన్నములైఁ క్రమముగఁ బెఱుంగును. కోపోద్రేకపరవశత్వంబునఁ దనకుఁ గాని యెదుటివానికిఁగాని రాఁగల కీడు తెలివిడి కోపికి లోబరం బగునను ట నిజంబు. ఆలోచించి పునః ఆలోచించి కోపి యేపనియుఁ జేయఁజాలఁడు. ఉద్రేక మాతని ముక్కుపట్టిలాగ నున్మాదము జెంది యాతఁడు కొట్టుకొనిపోవును. తన బలాబలములగాని, భాగ్యాభాగ్యములఁ గాని విమర్శింపక కోపి కోపకారకునిపైఁ బగదీర్చుకొనుపని నితరులకుం జెప్పక 'యహ మస్మి' యని తానే బయలుదేరును. ఇంతియఁ గాక ఘాడమైన కోపమును గోపి దోష మొనరించినవానిమీఁద తీర్చుకొనసాధ్యము కాని యెడల నితరులమీఁదనైనఁ దీర్చుకొనును. భర్తపై నలిగిన భార్య చంకబిడ్డను జావఁగొట్టును. పైయధికారిపై నాగ్రహావేశుఁడైన యుద్యోగి క్రిందినౌకరులఁ బడఁదిట్టును.

4. అనాథకమహంకార మెక్కుఁడను నార్యోక్తియున్నది. రోగులకుఁ గోపము ముక్కున నుండును. కొందఱకారణముగఁ గోపమూనెదరు. శాంతమూర్తులకుం దగినంత కారణమున్నప్పు డెప్పుడో నూటికిఁ గోటి కొక్కసారి కోపము గల్గును. కుపితులు కొందఱొకప్పుడు మండిపడియుఁ దదుత్తరక్షణమున శాంతస్వాంతు లగుదురు; కోపహేతువే మఱచెదరు. ఇతరవ్యాపారములు లేని కొందఱు కోపకారణమును దీర్ఘకాలము స్మరించుకొనుచుఁ గోపమును విషసర్పము నట్లు పెంచుచుందురు. కొందఱు కపటులు పైకి నవ్వుచున్న మోములఁ బ్రదర్శింపుచుండియుఁ గోపము నంతర్వాహినిగఁ బ్రవహింపఁజేయు చుండెదరు. ఇంకఁ గొందఱు కోపకారకుల నేమియుఁ జేయంజాలక వారియనంతరము వారిసంతతిపైఁ గూడఁ గోపమే వహించియుందురు. ఎట్లయినను గుపితుఁడు ప్రశంసనీయుఁడు కాఁడు. కుపితుని వ్రతము జపము తపము దానము మొదలగునవన్నిటి నంతకుఁ డలుకతో నపగతము గాఁగఁ జేయు నని ప్రమాణవచన మున్నది.

5. బలవంతుఁడు కోపముఁబూనినయెడల వెంటనే దానిని మానఁగలశక్తిమంతుఁడై యుండవలెను. అనఁగాఁ గోపగ్రహణమునకు విడుపుకూడ నుండవలయును. విడుపుశక్తి లేనిచోఁ గోపము కోపికి స్వనాశకరము. నిదానముగల్గి సంతోషస్వాంతుఁ డగువానికిఁ గోపముగల్గిన వాడకట్టంతయు జాగ్రతగ నుండితీరవలసినదే! ఏమనఁగా వాఁ డప్పుడు బుద్ధిఁగోల్పోయి కర్ణధారుఁడు లేని యానపాత్రమువలెఁ దేలిపోవును. ఘనులలోఁ

జాలమందికోపముఁ జెందెడివారలే యనవచ్చును. అందుచేతఁ గోపము ఋజువర్తనచిహ్నమని కాని ఘనతాలక్షణమని కాని యనఁగలమా? ముక్కునఁ గోపమున్న దూర్వాసు లెందరో మునులఁ బరివేష్టించి యున్నారు. వారందఱు గొప్పవారలేనా? అయితే కోపభేదములందు సత్యాగ్రహ ముత్తమోత్తమమని మహాత్మగాంధి యభిప్రాయ పడుచున్నాఁడు. తదితరకోపభేదంబులన్నియు నల్పతాచిహ్నంబులే.

6. కోపాటోపసామజంబు మానససరఃకోలాహలోత్సాహియై విహరించువేళ దుర్వారకోపవివశుని యాకృతి యెట్లు భయంకరము గ నుండునో యెఱుంగుదువా? బహుతీవ్రములగు దృక్కులు, వేడియెక్కి జేవురించి గీసినకందదుంపవన్నె వదనము, నిల్కడలేక యిటు నటు చలించి చలించి కడకు ఱెప్పవాల్పక చిత్తరువువలెఁ జూచునేత్రములు, ముడివడ్డ కనుబొమలు, పటపటలాడు పండ్లు, బిగించిన పిడికిళ్లు, సంచలించెడి పెదవులు, నసంగతమగు నపస్మారపు కేకలు, బెదరింపులు, శాపములు, నెగిరిపడు నాశికాపుటములు, సర్పమువలె బుసకొట్టు వేడినిట్టూర్పులు, సంచలించెడి యవయవంబులు చూపఱ భీతిఁ గొల్పును. ఎదుటివాఁడు కన్నెత్తి యివన్నియుం జూడనేరఁడు. ఇట్టివికృతాకారము కోపసంభవమే కాని ప్రజాపతిసృష్టి కాదు. కుపితుఁ డెల్లప్పుడు కోపము శాంతించువరకు ముండ్లపై నుండును. పరులు వాని నప్పుడు కదుపుట కందిరీగల తుట్టెం గదుపుటయే.

7. కోపము కూడనిగుణ మని తెలిసినది కనుక కోపముఁ జెందకుండుట కుపాయము లేవి? కోప మూనకుండుటకుఁ గోపావిష్టుని వికృతాకృతిని మతిభ్రమణమును గోపము వలనఁ గలుగునష్టములను స్మరించు టొకవిధము. కోప మధమదుర్గుణము. అది నష్టదాయకము. ఆత్మహత్యాకారణమే గాక బలవన్మరణహేతువు. తండ్రికిఁ బుత్రశోకమును, భార్యకు భర్త యెడబాటును, నధికారికి సేవకునిపై నసహ్యమును, వ్యాపారస్థునకు నష్టమును గలిగించునది యాగ్రహము. ధన మున్నవాఁ డది యనుభవించి మురిసియుఁ, గోప మున్నవాఁడు పరుల బాధించి మురియును. కోప మసూయ కన్న పాడుగుణము. ఏమన నితరులసౌఖ్యము చెడవలెనని కోరున దసూయ. పరులసౌఖ్యమును జెఱుచునది కోపము. ప్రపంచమునందలి యుద్ధములకు, వైరములకు, దూషణములకు, దుర్మార్గములకు హేతువు కోపము. కోపమునకుఁ గారణము తగని యహంభావము. నరుఁడు తాను గొప్పవాఁడ ననుకొని నీచమగు కోపమున కగ్గ మగును. కోపముయొక్క యీ యవలక్షణములన్నియుఁ దలపోసికొనినచోఁ గోపము మాన్పుకొనుటకు మఱొక్కపద్ధతి దొరకును. ఇతరులు తనను దూషించి రని దానఁ దనఘనతకు లోపము వాటిల్లె నని యూహించు నరుఁడు నిజముగ ఘనుఁడు కాఁడు; నీచుఁడే. నరుఁ డెంత ఘనతగలవాఁడైన నంతగా నితరులదూషణభూషణంబులచేఁ జెక్కుచెదరక నిల్వఁదగు. ఎట్టి యపకారమును నీకుఁ గోపము గలిగింప దనుటకంటె నీ ఘనత కుచిత

మగు బసదనం బెద్ది? బహుళవ్యాపారము లున్నవాఁ డెద్దానిలో నైన నష్టపడి విచారము చెందును. స్వల్పమైనకారణమే యాతనికిఁ గోపము పుట్టించును. అందుచే నందనిమ్రానిపండ్లకత్తులు సాచి విఫలప్రయత్నజనితమనఃక్షోభమును వినాశకరమగు కోపభరమును దెచ్చిపెట్టుకొనఁగూడదు. తలకు మించిన పనులలో వేలిడరాదు. ఎప్పుడును శాంతచిత్తులతోఁ గోపము లేనివారితో మెలఁగుటమంచిది. ఇది కోపమురాకుండఁ జేసికొనుమార్గములలో నొక్కటియా యని సందేహింపవలసిన పని లేదు. ఏమన వన్యఘాతుకమృగములును మానవపరిచయమ్మున సాధుసత్వము లగుచుండఁగా, ధూర్తకోపస్వభావులగు నరులు సజ్జనసహవాసంబువలన సాధువర్తను లగుటలో వింతయేమి? కోపము గలిగించెడివారియెదుటఁ బడక పోవుట మేలు. కొంతమందికిఁ దా మగునన్నది కా దన్న వేళఁ గోపము వచ్చును. వారిముందు ముక్కు గోకుకొన భయము. ఎందైనను గోపముపుట్టించువాగ్వాద మాదినే గోటఁ దుంచి వేయఁదగును. గ్రంథపఠనము కోపమూన నవకాశ మీయదు. ఆకలిఁగొన్నవాఁడు, విసిగివిసిగి వచ్చినవాఁడు, చిత్తవ్యాకులత జెందినవాఁడు గాలితోఁ గలహింప సంసిద్ధులై యుందురు. వారి నిజబాధఁ బాపనిఁకఁ గోప మంకురింపదు. ఇంతవరకుఁ గోపము రాకుండఁ జేసికొను పద్ధతులు వేర్కొనఁబడినవి.

8. కోపము శత్రు వగుట నది పొడమకుండఁ జేసెడి మార్గములతరువాతఁ గోపము నడంచునుపాయము లారయం దగును. కోపము పొడసూపు లక్షణములు తోఁచి

నంతనే వాని నడంచుటకై యత్నింపుము. కొందఱు రోగు
లకు రోగమువచ్చు పూర్వ మది సంభవించులక్షణములు తెలి
యవచ్చునట్లే యమితకోపుల కది కలుగక పూర్వమే తదా
గమనచిహ్నము లుదయించును. అందఱ కొకటే కోపకార
ణ ముండమి నొకఁడు తిట్లకు, నొకఁడు దుష్టచేష్టలకుఁ గిని
యును. ఒకఁడు నిజవంశగౌరవము పవిత్రముగాఁ దలం
చును. మఱొకఁడు స్వవిషయమే ప్రధానముగ గణించును.
దానినిదిట్టుట వానికిఁ గోపము పుట్టించునే. 'ఉన్నమాట
యన్న నులుకెక్కువ' యందురు. కాఁబట్టి నీ కోపకా
రణ మేదో నీవు తెలిసికొని దాని నితరులకుఁ దెలియనీయ
కుము. ప్రతివిషయమై తెలియఁ బ్రయత్నింపకుము. నీకుఁ
గోపముగలిగించు పరులదూషణములు నీవు తెలిసికొను
ప్రయత్నములమూలముననే నీ కెఱుకపడి తీరనివిచారమును
గలిగించును. నీ వూరకున్నచో నది సమసిపోవును. పరుల
దూషణములవిషయమై నీ యజ్ఞానమునకంటె నీకు హిత
మొడఁగూర్చునది యితరం బుండదు. అనేకులు కోపకారణ
ములను దామే కల్పించుకొందురు. ఎప్పుడును గోపము
మానవుని జేరదు. మానవుఁడే కోపముం బూనును. కోప
మెదురుపడినను దానివైపుఁ జూడరా దన్నప్పు డద్దాని
నాహ్వానించి తెచ్చిపెట్టుకొనుటకంటె నకార్యముండునే? కర్త
యూహఁ దెలిసికొనక కార్యము కంటఁబడినంతనే నీవు కిని
యుట నైజము. అట్టియెడ క్షమకంటెఁ గోపగజమున కంకు
శము మఱొండు కానరాదు. కోపము వెడలఁగ్రక్కక ప్రాలు

మాలినయెడలఁ గాలమే కోపమును రూపుమాపును. క్షమయు నాలశ్యమును గోపవినాశకరములు. కోపమువచ్చినప్పుడు బుద్ధికిఁ దోఁచినదంతయుఁ జేయుటకు మున్ముందుగా దీర్ఘశ్వాసముఁ దీసికొని తదుపరి పదిసారులు భగవన్నామస్మరణము జేయుట కర్తవ్యము. కోపముగలయంతసేపు నీ వేఁకార్యముం జేయను సమకట్టరాదు. కోపమును బైకిఁ బొడసూప నీయకుము. కోపమును జయింప నీయావచ్ఛక్తి నుపయోగింపుము. ఒకవేళ నీవు దాని జయింపలేకపోయినను నష్టములేదు కాని కోపమునుమాత్రము నీపై నెన్నఁడును విజయమంద నీయకుము. "సీ॥ పరులదోషంబునఁ బ్రభవించు క్రోధ, ముక్షీణక్షమా యుక్తిఁ జేసి పొలియు" నను భారతవచనము నిక్కమగుటఁ గోపమును క్షమచే నుపసంహరింపఁదగును.

9. కోపము నగ్నితోఁ బోల్చుట కలదు, కోప మగ్నివంటిది. కోపాగ్ని యితరులఁ గాల్చుటే కాదు, తా నంటిన కట్టెను గూడ దహించును. సరిగా వినియోగించువాని కగ్నివంటి యుపయోగకరవస్తు వింకొకటి లేదు. సరిగా నుపయోగించుకొనలేనివాని కగ్నివంటి వినాశనహేతు వేదియు లేదు. కోపము నట్టిదియే. కోపము ప్రధానముఁ జేసికొని ధనము, స్నేహము, బంధుత్వము, రాజ్యము, కడకుఁ బ్రాణమునుగూడఁ గోల్పోయి, చేతులు కాలినపిదప నాకులఁ బట్టుకొన్నట్లు పశ్చాత్తాపముఁ జెందినవారలున్నారు. వారిచరిత్రలఁ దలంచి కోప మూనకుండుట నీకు ముఖ్యకర్తవ్యము.

10. తాటాకుమంటవలె నొక్కసారి లేచు కోపము వెంటనే చల్లారును. లోలోపల నణఁగి పెంపొందు కోపమెక్కు డపకార మొనరించును. దీర్ఘకోపము ప్రాజ్ఞలక్షణము కాదు. మొత్తముమీఁదఁ గోపము కూడని తామసగుణము.

ఎగతాళి.

1. ఎగతాళి సేయుట యనఁగాఁ బరిహసించుటగదా యని యెల్లరు బరిహాసము చేయఁబడుట కర్హు లనుకొనఁగూడదు. దైవ ప్రసక్తిలోఁ బరిహాసమున కాస్పదము లేదు. "నావిష్ణుః పృథ్వీపతి" యనుటచే ధరాపాలురు దేవసములు. తల్లిదండ్రులు, నక్కసెల్లెండ్రు, నన్నదమ్ములు, గురువులు, వయసుచెల్లిన వారు, పరస్త్రీలు పూజనీయులగుట నెన్నఁడెగతాళి కనర్హులు. నృపాలు రొండొరులతోఁ బరిహసించుకొనెదరు. బావ మఱఁది మఱదలు జామాత మనుమఁడు మనుమరాలు మొద లగువారలు నావరుసలుగలవారు ప్రేమపూర్వకమగు గేలి కిందగిన జనము. ఎవ్వారితోనైన నపాయకరమగు పరిహాస ముత్సాహశూన్యతను బాపు దివ్యౌషధము. కాఁబట్టి యనమితమై యుచితమై సమయానుకూలమై సందర్భానుసార మగు గేలి యక్రమముగాదు; పైగా నవసరము.

2. పరిహాసము చేయుట మేలైనదే కాని యదే వృత్తిగాఁ బెట్టుకొనుట దోషము. సమయము వచ్చినపుడు పరిహసింపఁ దగునే కాని పరిహాసము చేయు సమయములఁ గల్పించుకొన

రాదు. వృత్తిగాఁ బెట్టుకొని యితరులం గేలిసేయువాని నేరును మెచ్చరు. దరిఁ జేరనీయరు. ఎప్పుడైన మనోల్లాసమునకుం జీట్లాడిన కాదనరుకాని యదేవృత్తిఁ జేసికొనుట నీతిపరులనిందల కగ్గమై పరులకు దూర మగుటయే. అదేరీతి నజస్రము పరిహాసముసేయుటే ముఖ్యవృత్తిగాఁ బెట్టుకొనిన వాఁడు మెప్పు వడయంజాలఁడు.

3. ఇరువైపుల వాయిగల యాయుధంబులంబోలు వేదవాక్యంబులవిషయంబునఁ బరిహాస మొనర్చుట యగ్నినిఁ గట్టుకొంగున మూటగట్టుకొనుటయే. వేళాకోళమున కుచితములుగ దేవుఁడు, దేవాలయము, వేదములు, మొదలగువానికంటె మించినవేవియు నీకుఁగన్పట్టుట లేదా? పరియాచకము చేయువిద్య సులభముగాఁ దలపెట్టినంతనే మానవునకబ్బును. నీచపరియాచకము బిల్వ నక్కఱ లేకయే పట్టువడును. దానిఁ గొనితెచ్చుకొన నక్కఱలేదు. తనకొడుకును గృహవ్యాపారములఁ బెద్దను జేయుదునను నర్థముతో నాకొడుకగు యువరాజును బట్టాభిషిక్తుఁ గావించెద ననియొక పేదవాఁడనెను. ధర్మాధర్మవిచారణచేయుచు న్యాయమూర్తియై శాంతిమంతుఁడై యుండవలసిన నృపాలుఁ డాపలుకు ల్మాలకించి తనకుమారు నా పేదవాఁ డెగతాళిఁ జేసె నని యాగ్రహముం బూని వాని తలఁ దీయించెను. కష్టసమయములందు సయితము శాంతస్వాంతుండై యుండవలసిన భూనేతకే యింత తొందరపాటును బుట్టించినపరిహాసవాక్యము పరులవిషయమునఁ జేయు చిత్తవిభ్రమమును జెప్పనలవియే? ఏమాటలసందున నైన నీ వను

కానకయే నృపాలురను దైవమును బూజ్యులను వేదములను గేలిగొట్టితివా వెంటనే పశ్చాత్తాప మూనవలసియున్నది. బుద్ధిపూర్వకముగఁ బాకముఁదప్పి చేయు నిరసనాపూర్వకపరిహాసవాక్యములు మూర్ఖులయనుగ్రహము సంపాదించినను బుద్ధిమంతుల కాగ్రహకారణములే యగును. నాగరకతలో నగ్రస్థాన మలంకరించియున్నాముగదా యని సంభాషణమున వాక్యస్వారస్యము లేని మోటుయాటవికులవలె మెలంగుట యేరికింబాడిగాదు. అధికారము చేతిలోనున్నదిగదా యని సేవకులతోడను, ధర్మమిచ్చువాఁడనుగదా యని బిచ్చగాండ్రతోడను బరియాచకమునకు దిగుట పనికిమాలిన కార్యము.

4. మరణమొందినవారివిషయములో నెన్నండుం బరిహాసము విసర్జింపందగును. చనిపోయినవారిచెడుగులన్నియు మఱచిపోయి మఱి స్మరియింపకుండుటే ప్రాజ్ఞులకు ధర్మము. సరివారితోఁ బరిహాసముచేయుటొకటి, విగతజీవులవిషయమై పరిహాసపూర్వకముగ వాకొనుట వేఱొకటి. ఎంతనీచుఁడైనను బరమపదించినపిమ్మట వానిమంచితనపు శేషమునే నీవు తలపెట్టుము. మృతులను నీవు పరిహసించినచో నీవుమాత్రము నీమరణానంతరము భావిసంతతుల గేలికిఁబాత్రుఁడవు కావా ?

5. బాగుపఱచుకొన లేని సహజలోపము లితరులయందున్నచో నీ వెప్పుడు వారి నావిషయమున గేలిసేయఁ బూనరాదు. కుంటివానిని వానిచేతికఱ్ఱతోడనే కొట్టుట తగదు. లోపముల నెంచి పరిహాస మొనర్చునపుడు దైవదత్తములగుట్ల వట్టి లోపములను నీ వెత్తుకొని పరిహసింపరాదు. న్యాయము

నీతి పీడక నరుఁడు జీవించుచున్నచో వాఁ డేవృత్తి నవలంబించి నను నెగతాళి కర్గము కానేరఁడు. పేదవృత్తియైనను శ్రమ కాలవాలమగువృత్తియైనను సరే యోగ్యమైనదే! ఆవృత్తి నంతమాత్రమున నపహసించుట తగదు. చెప్పులఁ గుట్టువాని వేళ్లు నల్లగా నున్న వనిగాని యడుసుఁదొక్కువాని కాళ్లు బాడెగా నున్నవనిగాని నవ్వి పరిహాసించుట నీచమైనపని.

6. నరుఁడు పరుల దుష్టపరిహాసవాక్యతత్పరుఁడై యుత్సాహపూర్వకంబుగ వాని నేకరువుబెట్టినపు డవి స్వకీయము లట్లు పలుకాడుట సాజము. అట్టితఱిఁ బరవాక్యగర్భితవిష పుఁగొండిని దొల్తనే తొలఁగించి చెప్పవలయును. చమత్కారము లేక యున్నదంతయు నెత్తిపాడుపేమైన పరిహాస మక్కఱకురానిది. నిందయే యందుఁ బ్రాధాన్యత వహించిన యెడల నది సర్వావయవవిషపూరితఖలపరిహాస మగును. కావున నట్టిదానితో జోక్యముగలుగఁజేసికొనక యున్నకుండుటే యుత్తమపద్ధతి.

7. ఒక్క యెగతాళివాక్యమువలన స్నేహితులఁ గోల్పోవుటకంటె మరణమే మేలు. కారము నోటికిఁ దగిలి నప్పుడే మిర్చిరుచి తెలియుననునది మనస్సులో నిడుకొని కొందఱితరుల నొవ్వఁ బల్కినప్పుడే కాని తమపరిహాసము నకు విలువ లేదని యెంచెదరు. పరులమనస్సుల నొచ్చు మచ్చున మాటలాడెదరు. ఎగతాళి జనసామాన్యమువిషయమైనచో బాధలేదుగాని విశేషించి ప్రత్యేకవ్యక్తులఁగూర్చి యైనచో బాధకరము ; స్వఘనతకు భంజకము.

8. ఇతరులపరిహాసము నీకుఁ గోపహేతు వగునప్పు డీవెన్నఁ డితరులను బరిహసింపఁజనదు. ఇచ్చి పుచ్చుకొనుట యనఁగా నని యనిపించుకొనుట పరిహాసతత్త్వరహస్యము. కాచగృహవాసివైన నీ వితరులగృహంబులపై ఱాలు రువ్వ రాదు. ప్రతిక్రియ ననుభవింపఁగల శక్తిమంతుఁడవై నప్పుడే యాక్రియ నాచరింపవలెను. పడఁగల యతఁడే మాట లనవల యును. మాటపడువాఁ డుండఁడుగదా! కనుక ప్రతిపరిహాస ము పడఁగల్గిననే పరిహాస మాడఁదగును. అన్యుల కెగతాళి కుడికెడువానిని లోకులు మఱింత యెగతాళి సేయుదురు. ఎగ తాళిసేయువాఁడు తాత్కాలికానందముచేతఁ బొంగిపోయి గురివెందగింజచందమునఁ దననలు పెఱుఁగక యన్యుల నేఱసు లన్వేషించి వానిం బరిహసించుచుండును.

9. పరిహాసమున కొక సమయ మన్న దున్నది. ఎల్ల వేళలఁ బరిహాసము సేయువాఁడు కాలౌచిత్యముం గనిపెట్టమిని చిక్కులం దగుల్కొనును. విచారసంతప్తుఁ డగువానితో నెక్క సక్కెములు కూడదు. ఒకఁ డాలోచనలోనున్నప్పుడు, బంధు గులతోఁ గూడియున్నప్పుడు, దుఃఖములోఁబడియున్న వేళల, నీవు వాని నెగతాళియొనర్పఁగూడదు. తన కురిశిక్షపడి తల తీయఁబడుటకుముం దెవ్వఁడు పరిహాసములఁ బాల్గొనఁడు. ఏమన విచారసమయమునకుఁ బరిహాసమునకుఁ జుక్కయెదురు. భక్తి, ప్రేమ, దుఃఖము మొదలగునవి పరిహాస మొనర్ప రానివి; చులకన చేయరానివి.

10. ఈవిధముగఁ బరిహాసనియమ నవరత్నహార మిందుఁ బొత్తుపఱుపఁబడినవి. పరిహాసవాక్యములు చమత్కారముగను సమయానుకూలముగను వర్తించినచో దురుద్దేశప్రోత్సాహితములుకానివగుచో సంభాషణమునకు వన్నెఁదెచ్చును. పఱులదూఱుటకును, దనపై ముప్పుదెచ్చుకొనుటకును నుపయోగపడు పరియాచక మనవసరము, అప్రశస్తము. విచారసమయములందుగాక సంతోషసమయములందుఁ బ్రేమపూర్వకమగు సమయానుకూల పరియాచకము జలయూరిన ట్లూరుట సహజము, దుఃఖవినాశకరము, సంతోషసంవర్ధనము.

వృత్తి:

1. పలువృత్తులు నుదరపోషణార్థమే యనునర్థమిచ్చు 'నుదరపోషణార్థం బహుకృతవేషం' అను సామెతగలదు. అనఁగా మానవు లాహారార్థము వివిధకార్యము లాచరింపవలసియున్నది. జీవనోపాధికొఱకు నరుం డవలంబించి చేయుపనినే వృత్తి యందురు. చెప్పులుగుట్టుటవృత్తి. వ్యవసాయము చేయుట వృత్తి. ఇల్లెవర్తకము, వడ్రంగము, కమ్మరము మొదలైన వన్నియు వృత్తులు. ఏయింట వంశపారంపర్యముగా వృత్తి యొక్కటియే యవలంబింపఁబడినదో యది యాయింటి కుల వృత్తి యగును. నేఁడుద్యోగము చేయుట వృత్తి, దాస్యమొనర్పుట వృత్తి, తిని కూర్చుండుట వృత్తి, తల కొకవృత్తి. దినమున కొకవృత్తి. తండ్రియుద్యోగి కాఁ గొడుకు సాపాటురాపున్న

వృత్తి జేకొనవచ్చును. నేఁడు ధనమున్నకె యన్నవిక్రియశాల స్థాపించి నడిపి మెల్లి గౌరవోద్యోగియై వెలయవచ్చును. కొంత కాలముదరపోషణార్థను క్రమముగాఁ జేయుకార్యము వృత్తి యనందగును. ఊడిగపువృత్తులకంటె స్వతంత్రవృత్తులు మేలైనవి. కులవృత్తి యవశ్య మవలంబనీయము.

2. ఏవృత్తియైన నవలంబించి చేయువారంద ఱొక్క నామంబున వ్యవహరింపబడుదురు. కంసాలులు, బజంత్రీలు, మేదరులు మొదలగు పదము లన్నియు నీరీతి నుద్భవించిన నామంబులే. వృత్తి యేదైన నేమిగాని దాని నవలంబించినవారు శ్రమపడి పరోపకారములైన పనులఁ జేసి తన్మూలమున ద్రవ్య మార్జింప సమకట్టుట సమంజసము. అట్లార్జించినసొమ్మె తినిన వానికరుగుదలకువచ్చును. శ్రమ లేకగడించినది దక్కదు. మోస గించినదానిమాట చెప్పనేల? అట్టిది యేదోవిధంబుననాశనం బగును. సంవత్సరంబంతయుఁ జెమ్మట యూడ్చిశ్రమపడిపొలపు లోఁబనిచేసి పండించిన పంట నమ్మియో తినియో తృప్తి జెందువానిది యోగ్యమైన వృత్తి. బలవంతుఁడై శ్రమ నోల్లక బిచ్చగానివృత్తిఁ బూని ప్రజల వేపించుకొని తినుట శ్లాఘనీయమైన వృత్తి గాదు.

3. అవలంబించినవృత్తియందులక్ష్యముంచిన్యాయబుద్ధి తోఁ గొనసాగించుచో నరుఁడు కీర్తిమంతుఁడై వృత్తిఘనత కాపాడినవా డగును. అన్యాయప్రవర్తకుఁడైనచోఁ బేరుఁ బోఁగొట్టుకొని వృత్తివారి కందఱకు నపఖ్యాతి చేకూర్చును. నాటకములాడుట వృత్తిగాఁ బెట్టుకొనిన నటకుఁడు వృత్తియం

దలి మంచినంతయు నేర్చి ప్రజలరంజింపఁజేసెనా పేరుగాంచును. తాగుఁడు మొదలగు పాతకంబుల కొడిగట్టెనా ప్రజల రంజించియుఁ దాగుఁబో తనిపించుకొనును. అంతటితోఁ గథ ముగిసిన మేలు. కాని నటకులకందఱకదే పేరు లోకమున వాడుకలోనికి వచ్చును. నటకులు కొందఱు సారాయములకుఁ, గొందఱు స్త్రీలకు లోనగుటచేత నేకదా కళయై, పండితాకర్షణీయమై, గౌరవాస్పదమై వెలయవలసిన నాటకవృత్తి నేఁడు నీచవృత్తిగఁ బరిగణింపఁబడుచున్నది. సంగీతము లని కూనిరాగములు తీయుచుఁ జదువుపొంతఁ బోని కుమారునిఁ గని, తండ్రి 'నాటకపు...'యని సంబోధించి తిట్టుచున్నాఁడు. కొందఱుద్యోగులు తోఁ-చముల గ్రహించుటచేతఁ గొన్ని యుద్యోగములు లంచపు టుద్యోగము లని పేరు గన్నవి. కాఁబట్టి యెవ్వఁడైన తన వృత్తియందు లక్ష్య ముంచి గౌరవ మార్జింపవలెను.

4. ఏవృత్తివాఁడైనఁ దనపరికరములఁ బూజింపవలెను. వ్రాయసకాఁడు లేఖినిని, కమ్మరి సుత్తెలను, మేదరవాఁడు కత్తులను బూజింపవలయును. నావికులు మనదేశములో జెప్పులకాళ్ళతోఁ బడవ నెక్కనీయకపోవుట తెలియునా? ఏ పరికరములు తన జీవనమునకు మూలమో, తనవృత్తికి చిహ్నములో వాని నావృత్తివాఁడే పూజింపకున్న నితరులు గౌరవించెదరా?

5. వృత్తికొక్క నియమముండి వృత్తివారంద ఱానియమంబులఁ బాటించి మెలంగుట క్షేమము. వర్తకులందఱు నేయి నొక్కధర కేవిక్రయింపవలెను. లాభము రూపాయి కణాయుండ

వలెను; తప్పుడురాళ్లుపయోగింపరా దని నిశ్చయించి యీసూత్రముల నేమఱక గమనించినచో వర్తకము ప్రశంసనీయవృత్తియగుటయేగాక వర్తకులు న్యాయపథానువర్తులని పేరు గాంచెదరు. నియమములు లేక యున్నను వానిఁ బాటింపక వణిక్కులున్నచో వర్తకుల నమ్మువా రుండరు. వారికిఁ జెడ్డపేరు వచ్చి స్థిరముగ నిల్చిపోవును. మోసగాండ్రనియు ద్రవ్యసంపాదనమున కే మార్గమైనఁ ద్రొక్కెదరనియు వారిని జనులు వర్ణించుటయేగాక యీవర్ణనల కెంక నెన్నియో చిలవలు పలవలు మొలిపించెదరు. న్యాయవాదివృత్తిలోనున్న కొందఱు కక్షిదారులకు వైరంబు పెంచి మోసగించి ద్రవ్యములాఁగ సమకట్టి రనుఁడు. అప్పుడు న్యాయవాదులు పేచీకోరు లను బిరుదు లనాకాంక్షితముగ లభియించును. తప్పుజేసినవారి కేకాక తద్వృత్తివారి కెల్లర కదే నామము సిద్ధించును. కొందఱ దుష్ప్రవర్తనమువలన వారిగౌరవమేగాక వృత్తిగౌరవముకూడ నేలమట్టమై సంపూర్ణముగా నదృశ్యమగును. మఱియు నెంత పాడువృత్తి యని పేరుగన్న దానియందుఁ గొలఁదిమంది యోగ్యులు పాపభీతిగలవారు దైవభక్తిగలవారు నుందు రనుట తథ్యము. కాని వారుకూడ శేషించిన దుర్మార్గుల దౌష్ట్యమువలన వెల్లడికాక యణఁగి మణఁగియుందురు.

6. వృత్తిలోనివారినందరి నియమబద్ధులఁ జేయుటకు ప్రతివృత్తి కొక్కసంఘ మావశ్యకము. ఇందున కక్షరజ్ఞానము న్నవారు ప్రతివృత్తిలోఁ గావలెను. చదువులోఁ బుష్కరము పై గడపి పట్టభద్రులై యుద్యోగములకై తిరిగి తిరిగి తక్కువ

కమ్మరువానికంటె విద్యాధికు లేవృత్తినో చేపట్టి కొన్ని నిబంధనలప్రకారము సంచరించి స్వతంత్రజీవనములఁ జే యుట మేలు; వృత్తిసంఘము నెలకొల్పి వృత్తిని లేవనెత్తుట కర్తవ్యము. వృత్తు లగౌరవప్రదము లని కొందఱుస్త్రీలు పర్షులకు బందుగులకే యనుడు బానిసలైరి. ఇంట స్త్రీలు చేయఁదగినపను లెన్ని లేవు? విద్యావంతులు కూడ నభిమాన పడక వృత్తు లవలంబింపవలయు. ఇప్పటి యున్నతవిద్య యుద్యోగలోపము, నిరాశ గన నింతకంటె నుత్తమోద్యమ ము కానరాదు. ఉద్యోగియై ధనము తక్కువ కమ్మరువడి యొ కనిక్రింద నూడిగము చేసి బ్రతుకుటకంటె స్వతంత్రవృత్తి నేర్చి యొక్కచో దుకాణము పెట్టి, పదుగుర నాకర్షించుట శ్రేష్ఠ తరముగాదె! ఏవృత్తి యవలంబనీయ మని యోజింపఁబని లేదు. నియమబద్ధులైనవారి కేదియు నీచవృత్తి కాదు. న్యాయ వర్తనులైనచో వారికన్నియు సద్వృత్తులుగాఁ జూపట్టును. లోహములపైఁ జెక్కుట, అాతిమలపు, బట్టలుకుట్టుట, నేత నేయుట వృత్తులు గావే? ఇవి యిప్పుడు చదువురానివారి చేతులలో నున్నవి. వానిని విద్యాధికులు గొని యన్యాయము వదలి సంచరించినచో నెంతయో లాభము. మఱియు వేరు పోఁగొట్టుకొన్నవృత్తుల రక్షించి గౌరవవంతములఁ జేసినవా రగుదురు. ఎప్పుడు స్వతంత్రవృత్తులన్నియు మనదేశమున వి ద్యావంతుల చేతులఁబడునో యప్పుడు దేశసౌభాగ్యము కల్గును.

పట్టుదల.

1. మానవులు నిమేషమునుండి నిమేషమునకుఁ గాక యొకపనినుండి మఱియొక పనికిం జనుచున్నారు. కాన మానవజీవితము కార్యజాత మనవచ్చును. అందుచే నేవో పనులఁ బ్రారంభించువారే యెల్లరునై యున్నారు. అయితే సంకల్ప మాత్రముననే యెకార్యములును గొనసాగనేరవు. అనుకొన్న కార్యములు నెఱవేరుటకధికసన్నాహ మావశ్యకము. సంకల్పిత కార్యాచరణమున కడు గడుగునకు విఘ్నము లనేకములు తల సూపుచుండును. వానినన్నిటి నోర్చుకొనుట యనునది తాల్మి యను స్థాణుగుణము. తాల్మితో నగచాట్లఁ బడుచు, విఘ్నము లతిక్రమించి, వాని నెదుర్కొనుచు ముందునకుం బోవఁజేయు గుణము పట్టుదల. పని సంకల్పించి, సన్నాహముచేసి, సంభార ముల సమకూర్చి, విఘ్నముల నెదుర్కొని కార్యసానుకూలమ్ము జేసికొన్నవాఁడే పట్టుదలగలవాఁ డను నామార్థుఁ డగును గాని తదితరులు కానేరరు. పనిఁ బ్రారంభించినది మొదలు విజయము చేకూరువఱకు నిరంతరదీక్షతోఁ బాటుపడఁ జేయు గుణము పట్టుదల. స్వల్ప ఘన భేదంబులు లేక యన్ని కార్యముల సాధనమునకుం గావలసిన గుణసముదాయమునఁ బట్టుదలప్రధానమై యగ్రస్థాన మలంకరించును.

2. చేకొన్న యుద్యమమునెడఁ గల దృఢవిశ్వాసమే పట్టుదలకు మూలము. సచ్ఛీలముగలవాఁ డన్నమాటఁ జెల్లిం చుకొనును. తలంచిన పని సాంతమొనర్చును. కాబట్టి సత్ప్రి

వర్తనగలవానికిఁ బట్టుదలయుండి తీరును. అందుచేతఁ దాఁజేసి కొన్న కార్యమేదియు నాతఁడు నడుమను బరిత్యజించు భీరువు గాక, తాను మంచిది కాదని నమ్మిన వ్యాపారము మొదట సంకల్పింపనే సంకల్పింపఁడు. హృదినాటిన విశ్వాసమే కొండలఁబోలు నంతరాయముల నెదిరింపఁజేయును. మనసారసంకల్పించి చేసిన పనులలోఁ గడకు విజయము చేకూరును. నడుమఁ జిత్తచాంచల్యముతో ముందు వెన్కల కూగులాడు నరుఁడు తనయుద్యమమున విశ్వాసము లేనివాఁడును, సత్యమన్న గౌరవము లేనివాఁడు ననియే భావింపఁదగును. నీకు సంపూర్ణ విశ్వాస మున్న కార్యము లాచరింపఁ గడంగితివా పట్టుదల యదియే కల్గును.

3. కార్యమేదైన మొదలిడఁ బ్రారంభ శూరత్వమే తొలుతఁ గొంతవఱకు దీక్షగాఁ బనిచేయించుట సహజము. మఱియుఁ గార్యాంతము సమీపించునపుడు తుది చేరువ యగుచున్నదిగదా యనెడి యుత్సాహమునఁ జకచక పని సాగించుటయుం గలదు. అనఁగాఁ గార్యారంభమునఁ గార్యాసక్తియుఁ గార్యాంతమునందుఁ గార్యాంతసందర్శనమును నరు నెదుటకు నడిపించును. ఇఁకఁ గార్యమధ్యమున నుత్సాహము గాని, పురోగమనశక్తి గాని లేక పెక్కండ్రు తాము తలపెట్టిన పనులఁ బరిత్యజించెదరు. ఇచ్చటనే యీ సమయములందే పట్టుదలయున్న యెడల నదియే మానవులను ముందంజవేయించును. ఏకార్యమందైనను బట్టుదల ముఖ్యావసరము. ఆ

పట్టుదలయొక్క శూన్యత్వముచేతనే నరులు ప్రారంభించిన కార్యమును నడుమఁ బరిత్యజించుభీరు లగుదురు.

4. ఏ దినమందైన నుదయంబునను బరుండఁబోవుటకు ముందును వస్తువులు సమకూర్చుకొనుట సర్దుకొనుట యను పనులు బాగుగనే సాగునుగాని మాధ్యందిన కార్యములు జాప్యముగ సాగును. అయ్యెడఁ బని చురుకుగ నడపుటకుఁ బట్టుదల కావలయును. పాఠశాల తెఱచి పని ప్రారంభించిన నెలలో విద్యార్థులు, నుపాధ్యాయులు గష్టపడి పని చేయుదురు. సంవత్సరాంతమున సమీపించు సెలవు పది దినము లున్నవి, వార మున్నది, యని దినములు లెక్కించుకొనుచు నుత్సాహముతోడనే గడపెదరు; కాని సంవత్సరమధ్యమున బనివేడి చల్లారకుండ వారల నడిపించునది పట్టుదలయే. గ్రంథకర్త కృతిప్రారంభమునఁ దుట్టతుదను బాగుగఁ జురుకుగనే వ్రాయునుగాని కృతిమధ్యమున వానిని లేవనెత్తి ధైర్యమూది ముందునకు లాగుకొనిపోవునది పట్టుదల. పథికుఁ డారంభమున గమనవేగిరమై క్రమముగఁ గాళ్లు వెతికిలవేయును. గమ్యస్థానసందర్శనసామీప్యమున వానికి విసురుగఁ గాలుసాగును. ప్రయాణమధ్యమున వానిని జతికిలఁ బడనీయక ముందునకుం గొంపోవునది పట్టుదల. ఏకార్యమైనఁ బ్రారంభశూరత్వముతో మొదలిడి పట్టుదలలేక నడుమ దానిఁ బరిత్యజించినవారసంఖ్యాకు లుండుటచేతనే 'యారంభశూరత్వ' మనునది యధిక్షేపణసమరోచితసమాసం బైనది. పట్టుదలగలవానిముందీ యధిక్షేపణము రూపఱిపోవును.

5. ఏనరుఁడైనను దాఁ గలుగఁజేసికొన్నపని మంచిదని యు, దానిని జేసితీరవలెననియు గాఢమగు నమ్మకము పట్టుద లకుఁ గార్యసఫలత్వమునకు సహకారి. అభినివేశ మున్నవ్యక్తి యుత్సాహముతో నంతరాయము లధిగమించి పురోగమనము సాగించి విజయ మరచేతి యామలకంబుం గన్నయట్టు గాంచు ను. ఇందులకు దృష్టాంతంబుగ సాలెపురుగుఁ బేర్కొనందగును. గూడునల్లుకొను వేళ నాకీటకము ప్రమాదమునఁ జూరునుండి తంతువుతో జారి నేలఁబడి, యథాస్థానముం జేర నేరీతి ననేకప ర్యాయము లెగిరిపడుచుఁ బ్రయత్నించుచుండునో చూడవలసి నదే. మనస్సున నున్నపని నెగ్గువఱకు నట్లాతంతునాభము ప్ర యత్నించుటకుం దగు హేతువు పట్టుదల. దీనికిందోడుగ దృఢ సంకల్పము, కార్యోత్సాహము, ఫలాసక్తి గూడ నోడువం ద గును. మును పాఱుపర్యాయములు వైరులచే నోడింపఁబడి కొండగుహలోఁ దలఁదాఁచుకొన్న మహీకాంతుఁ డొకఁడు సాలెపురుగు పట్టుదలం దిలకించి వెనుకటి యోటమిమాట మఱచి ద్విగుణీకృతోత్సాహముతో ధృతిఁబూని, మఱొక్క సారి శత్రువులం దాకి విజయరమాకాంతుఁడై వెలసె నని విం దుము. ఇట్లు సర్వకార్యసాఫల్యమునకుం బట్టుదల గావలయును.

6. అయితే దుర్మార్గుఁడు సన్మార్గుఁడుకూడ నిజకార్య సాధనమునకుఁ బట్టుదలసూపును. ఈయిర్వురలో మొదటి వాని దౌష్ట్యవిషయికమగు పట్టుదల నీచమై నివారింపఁబడవల సినదై యుండ రెండవవానిసత్కార్యవిషయికమగు పట్టుదల ఘనమై యుగ్గడింపఁబడవలసినదై యొప్పారును. అనఁగా

సత్కార్యాచరణమునఁ బట్టుదల ప్రశంసాపాత్రము; వంద్యము. దుష్కార్యములపట్ల పట్టుదల నివారణయోగ్యము; నింద్యము. పరులకు సేగిసేయననుకట్టి చలపాదితనమున నది సాధించువఱ కన్నపానముల వర్జించి పనిచేసి పట్టుదలచూపుట గర్హ్యము. పరులసొత్తున కాసపడుటే తప్పు; అందునకై చాటుపడుట దోషము. అం దాదిపరాజయమును సరకుఁగొని తత్కార్యమునకు విముఖతఁజూపక, మగుడ యత్నించుట మహాదోషంబు. ఇదియు నిట్టి యితరదుష్కార్యములపట్లఁ జూపఁబడుపట్టుదల క్షమింపరాని మహాఘోరపాపము. పగఁగొన్నవాని నురగము చంపువఱకుఁ జలపట్టునట్లు దుర్మార్గుఁడు తా ననుకొన్న పాడుపని నెఱవేఱుదనుకఁ బట్టుదలఁ జూపును. ఇది కూడదు. సత్పురుషుఁడు దైవభయమునఁ బాపభీతిని దుష్కార్యములు తలంపఁడు. మొత్తముమీఁద సత్కార్యములందుఁ బట్టుదల యర్హ్యము; ముఖ్యావసరము.

7. ఈ విధమగు బట్టుదలఁజూపినవారే మనము నేఁటికిని స్మరించుమహనీయులం దనేకులు. మతకర్తలు సంఘ సంస్కర్తలు మొదలగువారు చిరంజీవులై యుండుటకు వారిపట్టుదలయే కారణము. తాల్మికిం దోడుగఁ బట్టుదలయున్నచోఁ బసిడికిఁ దావియబ్బిన చందమున శోభించును. పట్టుదలలేనివారది పరిశ్రమవలన నలవఱచుకొనఁగలరు. వారికిక్రింద నుదహరించిన మార్గము లనుసరింపఁదగును.

౮ మున్ముందుగ నే పనినైన బాగుగా నాలోచించి, దృఢవిశ్వాసముతో దానిఁజేయఁగడంగి, చేఁపట్టినది తుదివఱకు

విడువక ప్రయత్నించుటే రాజమార్గము. ఒకసారి కార్యము కలిసి దాకున్నయెడల వెనుకాడక మఱఁడ నదియే యత్నింప వలయును. తన్మూలమునఁ బట్టుదల యలవడును. ఏమనఁ దక్కిన సద్గుణములవోలెఁ బట్టుదలయు నలవాటుచే నలవడు నదియే సుఁడీ! ఏక్షణమునఁ జేతిలోని పని మానవలె నని బుద్ధిపొడమునో యప్పుడే తత్కార్యసాధనమువలన నీకును నీ యాశ్రితులకును గల్గు ప్రయోజనములఁ దలపోయుటచే బట్టుదల యబ్బును. నీకు సత్యప్రియత్వబుద్ధి పట్టుదల ప్రసాదింపుమని యనుదినము పరమేశ్వరునిఁ బ్రార్థించుచుండితివా యెదుటకు ద్రొక్కుకొని పోఁగల బలసాహసాదికంబులం బొందెదవు. పట్టుదలతోఁ బనిచేసి విజయముపొందిన మహాత్ములచరిత్రముల నాదర్శముగఁ బెట్టుకొని నీకుఁ బట్టుదల తఱుఁగు తఱిని వారిదెసం గనులు ద్రిప్పిచూచుట యను మేలగు కార్యమునం జేసి పట్టుదల యెదవును. కష్టములందును మనోరథభంగకాలములందును దదాదర్శపురుషులే నీకు ధైర్యమూఁదగల సమర్థులు.

9. ఈ పద్ధతులఁ బట్టి పట్టుదల గఱచి సత్కార్యము లాచరింపఁబూనుము. సహజముగ దుర్బలుఁడవయ్యుఁ బట్టుదల యున్నవాఁడవైనచో నే పనినైన సాధింపఁ గలవు.

మరణము.

"వేషధారియొక్కఁడు పాత్రి వినిచిపోవ
వేఱొకనిరాక సభ్యులు వేచునట్లు
కాలమందినవానిని గాటఁ జేర్చి
యుదితుఁ డగువానిని కుటుంబ మెదురుచూచు"

జాతుఁడు మృతుఁడగుట ధృవము, మొదలగు వేదాంత వాక్యము లెఱుఁగని, సర్వదా స్మరింపని నరపురుగు భారతదేశమున లేదు. అందిమిడియున్న భావ మనుల్లంఘనీయమగు బ్రహ్మలిఖితము. ప్రతివృక్షమును, జంతువును, మానవుఁడును నుద్యమమును బుట్టి కాలానంతరము మరణము పొందితీరును. జంతువు తన దినాంతమున విశ్రాంతిఁ జెందును. మానవులకుఁ, గొన్నిఖేచరములకు, భూరుహములకు, సత్వములకు రాత్రి నిద్ర. కొన్నివిహంగములకు జంతువులకు మాత్రము పగలు నిద్ర. ఎట్టయిన ననుదినమున నివి పొందు విరామము నిద్ర. ఇందుఁ బ్రతిదియును జీవితాంతమునఁ బొందు విరామము మరణము. నిద్రఁజెందినవాఁడు మఱల లేచును. మరణమొందిన వాఁడు మఱి మేల్కొనఁడు. అందుచేతనేకాఁబోలు మరణమునకుఁ బెద్దనిద్దుర యను నామ మున్నది. నిద్ర జెందినప్పుడు శరీరమునందలి యుచ్ఛ్వాసనిశ్వాసములు రక్తప్రసారము మొదలగు వ్యాపారములు కొన్నినడచుచునే యుండును. మరణించినప్పుడు సర్వశరీరవ్యాపారములు నుడుగును. మరణింపనున్న రోగిని జాలకాలము పరీక్షచేయు వెజ్జులు రోగి కొక్కొక్కచర్యయు నుడుగఁ దుది సమీపించుచున్న దందురు. సర్వదేహావ్యా

పారము లుడుగుటయే మరణము. అయితే యోగాభ్యాసము వలనఁ గొంతకాల మవయవస్తంభనచేసి శరీరకార్యము లుడుగఁజేసికొనఁగలవార లుండి రనునమ్మక మున్నది. ఇది నిజమని యొప్పుకొన్నవేళ మరణమును సర్వశారీరక వ్యాపారములు శాశ్వతముగ నుడుగుట యని గ్రహింపవలయును.

2. మరణమున కొక్కకాలనియమము లేదు. పంటపండుట కొక్కకాలము. పంటఁ గోయుట కొక్కకాలము. పక్షులు గుడ్లుపెట్టుటకుఁ బశువు లీనుటకుఁ బ్రత్యేకముగ ఋతువు లున్నవి. అన్నిభౌతికకార్యములకుఁ బ్రకృతిసిద్ధనియమము లున్నవి. వీనికిందోడు మనుజనిర్మితసమయము లున్నవి. మరణమునకు మాత్ర మారీతిగ వేళనియమము మృగ్యము. కొందఱు రాత్రివేళ మరణించుట యున్నది; పగలు మరణము పొందుట గలదు. వేసవిని వర్షకాలమున శీతున ననేకులు మరణించుచున్నారు. ఒకకాలములోఁ బండ్లు కాయలు గింజలు దుంపలు మిక్కుటముగా మెక్కుటచేత, నొక్కకాలమున నవి లేక తినకుండుటచేత నరులు మరణముపా లగుచున్నారు. తిండికలిమిరూపమునఁ దిండిలేమిరూపమునను మనచుట్టు నీకాల మాకాలమనక నిరంతరము వేయికన్నులతోఁ గనిపెట్టిచూచుచు వస్తువుతో ఛాయయట్లు ప్రాణితో మరణము వెంటనంటి పోవుచునే యున్నది.

3. మరణము దయాదాక్షిణ్యములులేని దేవత యండ్రుు. దీనికి జాలి నాలి సున్న. ముద్దుముచ్చటలు ముక్కలైనవి. ప్రేమ పెంకులైనది. ముక్కుపచ్చలారని ముద్దుబిడ్డను,

నవనవాంకుర యౌవనకన్యను, సింహబలునిఁ దరుణవయస్కునిఁ దనవాతఁ బెట్టుకొనును. ఏకపుత్రివిశేష మనికాని, కురంగశాబక మనికాని, క్రొత్తకోడ లనికాని, చిగురుజొంప మనికాని యుచ్చదశానువర్తనుఁ డనికాని యీమృత్యుదేవత సందేహింపక తనపొట్టఁ బెట్టుకొనుటే నిజధర్మ మని తలంచును. మృతప్రాణి బంధుమిత్రవిలాపము లీమెమనస్సును గరఁగింపఁజాలవు. తా ననుకొన్నవారిఁ గబళించుటే దీనికిఁ బ్రధానముకాని దుర్బలప్రబలభేదంబు లీమె పాటింపదు. తనకు సహజముగ జాలి ప్రేమ సానుభూతులు లేకున్నమానె, తాఁ జంపనెంచువాని యాలుబిడ్డల దుఃఖరోదనములుగాని వేడికన్నీటిధారలుగాని చూచి యామెయించుకయు మోమోటపడి యొక్కింతయుం దాళను. పక్షపాతము లేనిదాన నని మాత్ర మీమి త్తి విఱ్ఱవీగును. సత్కార్యాచరణమునఁ బక్షపాతము లేకుండిన శ్లాఘనీయముగాని యెల్లరఁ బరిమార్చుచోఁ బక్షపాతము లేకున్నఁ బ్రయోజన మేమి? మకుటమాంధాతను బాలముదున్న కర్షకుని, పేరుగన్న జగదేకయుద్ధవీరుని, బిరికిపందను, నేండ్లుగడచిన వృద్ధును, నప్పుడే భూపతనమై యభము శుభము నెఱుఁగని చిట్టికూనను, సంపూర్ణవికసితలతాంతరాజ్ఞిని, గరవికాసనసూనంబును, జిరకాలవిఖ్యాత పత్రికారాజమును, బరులు దేరనున్న పత్రికను సరిసమానచిత్తముతో నీమెయంత మొందించును. శుద్ధాంతమున హంసతూలికాతల్పమున నత్తరువాసనలఁ గమ్మతెమ్మెఱల ననుభవించు కోమలాంగిని, దిరిపెమెత్తుకొనుచు నర్ధవస్త్రధారిణి యగు ముష్టిదానిని, వసంతమున నంటుమామిడిగు

న్నశిఖరమునఁ గోయని కొసరికూయు గండుకోయిలను నూ ల్లఁ దిరుగుచుఁ గావు కావని కర్ణకఠోరముగ నార్చువాయసము ను, రూపపరాక్రమసంపదచే మృగరాజై మెకములగుండె ల వియ గర్జించు సింగమును వర్షకాలమున మురుగుకుండున దొ అలి ఘుర్ఘురించు సూకరమును మరణదేవతదృష్టిలో నొక్క టియకాని, వానికిం దారతమ్యంబు గన్పట్టదు. ఈచెప్పినదంత యుం గన మంటినిఁ బుట్టినసర్వముఁ గడకు మంటిపాలుజేసి లోకములోఁ గలకొలఁది గొప్పలనెల్ల మిత్తి సరిసమాన మొనరింపఁగల శక్తియని వెల్లడియగుచున్నది.

4. మరణదేవత బుద్ధిమంతురాలు; యుక్తిపరురాలు. తనచేతిక్రింద జ్వరాదిరోగములుహత్యలు నకస్మాత్సంభవములు నను వివిధమరణసాధనములఁజేర్చుకొని యెప్పుడు నేదో యొక్క వైపునకు వానిని బ్రయోగించుచుండును. ఉద్యమము ధనము లే క నశింప, నరుఁడు జ్వరపీడితుఁడై మడియు. పూ ఎండవేడిమికి వాడ, బాటసారి యొడలు తెలియక తప్పత్రాగినవానిచే హతు డగును. ప్రయాణికుఁడు రైలుప్రమాదమువలనఁ జావ భీరుత్వ ముచే స్త్రీ యాత్మహత్యగావించుకొనును. ఆయాసందర్భ ముల మృతవస్తువుపైఁ బ్రేమగలవారలు మరణమునే నిందింపక మరణకారణ మగు రోగమునో వ్యక్తినో సంభవమునో తిట్టి పోసెదరు. పాడుజ్వర మనియో యచ్చిరాని నూయియనియో దొంగయూబి యనియో యెన్నఁ డెఱుఁగని తూమ మనియో యపూర్వసంఘటన మనియో మిత్తి పేరెత్తకే తత్సాధనమును నిందించెదరు. మరణ మనిన దప్పదని నిశ్చయించుకొన్నవా

రును మరణమునే నిందించెదరు. ఇది యజ్ఞానజనిత మని వేదాంతజ్ఞు లందురు. ఏది యెట్లున్నను మరణము లేకుండఁ జేసికొను ప్రయత్నంబుల నేరుం దలపెట్టనే తలపెట్టరు. కాని మశూచినో కాలువాపునో తలనొప్పినో కీళ్లపట్లనో వైద్యమువలన నివారించి తచ్ఛాంతికై పాటుపడెదరు. ఆ పిమ్మటమాత్రము మరణమురాదా? ఆపాటు ప్రేమకొలఁది నుండును. కాని సర్వ వైద్యసాహాయ్యములును, మరణదేవతనిశ్చయముముందు పటాపంచ లగును.

5. పదిమందితోఁ జావు పండుగతో సమానము. ఒక్కఁడు జబ్బుపడి క్రమముగఁ దీసికొని శుష్కించి తన్నుఁ బరివేష్ఠించినవారిమధ్య ప్రాణములు విడుచుట కెంతయో క్లేశము జెందును. సంఘమరణమున నట్టివిచారమునకుం దావుండదు. ఉప్పెన వచ్చి యూళ్లు తుడిచిపెట్టుకొని పోవునప్పుడు, గృహములు పరశురామప్రీతియైననాఁడు, ధూమశకటము లొండొంటిపై డీకొనినప్పుడు జలమధ్యమున నౌక మున్గెడివేళఁ గలుగు సంఘమరణము లొంటరిమరణములకంటెఁ గీర్తిదాయకములు. అవి నల్గురనోళ్ల శ్లాఘింపఁబడును. ఆ యాసమయంబులఁ బ్రత్యేకవ్యక్తిగతాభిప్రాయములు విషాదకరంబు లయ్యుఁ గలిసి మరణించుట యనునది విచారకరము. 'యుద్ధ మొనర్చు రణభూమిని మరణించినవారు స్వర్గసౌఖ్యమును, బిఱికిపందయై యిల్లుదూఱినవారు నరకబాధలను బొందెద రనుట యుద్ధవీరుల విషయమైన పురాతనపునుడులు. పరాక్రమముతో నిమిత్తము లేక యొక్క విషవాయువుతో దేశము నాశముసేయు నీ

దినములలో నవి వర్తింపవు. ఎల్లరు దురములఁ బొల్గొన వీలు లేదు కనుక సత్కార్యములం జేసి మంచినడవడి గల్గి యాయుర్దాయము ముప్పాతిక గడపి సంతోషముతో వానప్రస్థముం జొచ్చి మరణమున కెదురుచూచుచుండి దానిఁ బొందుటే మేలైన పథము.

6. మరణమున సవ్యాపసవ్యమరణము లని యున్నవి. అనుభవములన్నియుఁ బొంది ముద్దు ముచ్చటలు తీర జరాగ్రస్తులై యవయవపటుత్వము దొలంగ చీకి బిడ్డలచేతులలో నరుఁడు మరణించుటే సవ్యమరణము. తల్లి తండ్రి తాత మొదలగువారందఱు బ్రతికి యుండఁగ వారి కాశాభంగముఁ గల్గించి తాను సంసారతాపత్రయ మెఱుంగకే నరుఁడు గతించుట యపసవ్యమరణము. సవ్యమరణమైనను మఱొక్కటైనను జీవి కనాయాసమరణము మేలు. మఱియుఁ జావునకు నీచమని మేలని విశేషణములఁ దగిలించుట మనుజుని వెఱ్ఱిగాని క్రియ యొక్కటియు. ఘటమం దున్న జీవాత్మ పరమాత్మతో సంధాన మగుటయే మరణము. జీవాత్మ జన్మపరంపరలలో మరణ మనునది ప్రస్తుతజన్మాంతము, నూతనజన్మోదయము. ఏమన దేహ మనిత్యము, ఆత్మ నిత్యము. ఈ కడపటివాక్యములు సాధారణులకుఁ దల మించినవిగాన వారిబుద్ధి కందనివి.

7. మహానుభావు లిచ్ఛాధీనమరణు లని పెద్ద లందురు. అనఁగా వా రాత్మనిర్ణీతక్షణమునఁగాని విగతాసువులు కారు. ఇందులకుఁ దార్కాణముగ భీష్మనిర్యాణ ముదాహరింపఁదగును. భీష్ముఁడు రణరంగమున దక్షిణాయనమున గాయపడి

యుఁ బ్రాణములు వీడక యంపశయ్యపై నిలిచి యుత్తరాయ ణాగమనమునకై వేచియుండెను. పుణ్యకాలము వచ్చువఱకు సజీవుఁడై యుండి, యాసన్నుఁడయ్యు దూరమున నిలిచియున్న మృత్యుదేవతను దాఁ బిలిచిన వేళ రా నాజ్ఞాపించెను. యోగు లిట్టి యిచ్ఛాధీనమరణులు. వారిపట్ల మిత్తియాటలు సాగవు. వారియాజ్ఞానువర్తినియై యామె యే మెలఁగవలసియున్నది.

8. మరణించినవాని దేహమును శవ మందుము. మృత కళేబరము భయంకరముగ నుండును. మరణచిహ్నము లీ క్రింది పద్యమున నున్నవి తెలిసికొనుము.

"గీ. ముక్కు వ్రాలుట కర్ణము లొగ్గఁబడుట
రదనవైవర్ణ్య మక్షివిరాగభావ
మంగ మతికృష్ణ మగు టుల్ల మడరఁ జెడుట
సూచకములు సద్యోమృత్యుగోచరతకు."

—భారతము.

ఈలక్షణము లెఱుంగకుండుటచేతఁ బలువురు బంధుగుల మరణసమయంబులలోఁ జిక్కులఁ జిక్కిరి. మృతదేహము చైతన్యము లేక వికృతాకృతిఁ దాల్చియుండును. పూర్వము నరుఁడు సజీవుఁడై యుండఁ దోఁచిన ప్రాణమిత్రులు నాత్మబంధువులే దగ్గర కరుగ వెఱచెదరు. పోయినను వారిలోఁ గొందఱు కాఁటివఱకే పోదురు. పోవువాఁడు పూచికపుల్లయైన వెంటఁ గొంపోవక పుట్టినవాఁడు పుట్టినట్లుగఁ బోవును. వాని సుకృతదుష్కృతములు మాత్రమే యాజీవుని వెంటనంటును.

9. మరణముతో మానవుని శారీరకబాధలు మనస్తాపములు, సంసరణపుటిక్కట్టులు, ప్రాపంచికసంబంధములు, పరస్పరానురాగద్వేషములు మొదలగునవన్నియు ముగియును. ఒకని మరణమువలన వానిబంధుగులు కష్టములపాలై విచారించెదరు. కాని మరణించినవాఁ డెప్పుడు నదృష్టవంతుఁడే! మరణించినవాని కీర్త్యపకీర్తులుమాత్రము భూమిని మిగులును. అవియుఁ గాలవాహినిలోఁ గొంతకాలమున కంతరించిపోవును. మరణించినవాని కంత్యక్రియలు ఘనముగాఁ జేయుటకంటె జీవించియున్నప్పుడు వానికి స్వల్పము వెచ్చించినను మేలు. జీవి కిచ్చిన పుష్పమైనను బీనుగ కిచ్చిన మాలికకంటె నమూల్యతరము.

మితవ్యయము.

1. మితవ్యయముఁజేయుట యనఁగా లోభివలె నవసరముపట్లఁగూడ వ్యయము సేయకుండుటగాని, దూబఱదిండిఁ వలె నొడలెఱుంగక జుట్టు ఛిఱియఁ బోసికొని యనవసరసమయంబులఁగూడ నెంతయున్ననంతయు వ్యయముచేయుటగాని కాక, యదనున నవసరమగునంత, శక్తికిఁ దగుమాత్రముగ ధనవ్యయమొనరించుటకే వర్తించును. ఇంత వెచ్చించుటే మితవ్యయ మని నియమము లేదు. ఆనియమము వ్యక్తినిబట్టి, వాని యభిరుచి ననుసరించి, యాదర్శోన్నత్యపేక్షావిశేషానుసరణీయమై యుండును. కొంతమంది తమ యాదాయమునకుఁ బది

మడుంగులకు మించిన వ్యయముఁ గావించియు మితవ్యయము చేయుచున్నా మనెదరు. కాని ధనము నిరర్థకముగఁ బోయిన దనుకొనరు. నెలకు లక్ష రాఁబడివచ్చు మహారాజు భోజనములకై మాసమునకు వందలు వేలు వెచ్చించియు లోభి యనిపించుకొనును. నెలకు వంద వచ్చుబడికలవాఁ డందు సంగోరు భాగము వ్యయముచేయుభోజనముమాత్రము గొన్నను, మితవ్యయము చేయువాఁ డనిపించుకొనఁడు. నెలకుఁ బదిరూకలార్జించువాఁడు తొమ్మిది తినియు మితవ్యయముచేసి యర్థసంచయముచేయు పొదుపరి యనిపించుకొనును. ఇందు నియమమేది? నీ కేవిషయపు టర్థవ్యయ మగత్యమో నీయంతరాత్మ నడిగి తెలిసికొనుము. అప్పుడే నీ కేవ్యయ మవసరమో స్పష్టమగును. ఆరీతి నవసర మేదియో యనవసర మేదియో బాగుగ విమర్శించి గ్రహించి యవసరవ్యయమునే చేయుట మితవ్యయమగును. పరిశుద్ధసాత్వికాహారము గౌరవోచితవసనము మానవులకు ముఖ్యావసరములు. వానివిషయమై యర్థవ్యయముచేయుట మితవ్యయమే. కేవలము విలాసార్థముగవస్త్రాహారములకమితధనము సెలవొసంగుట యనవసరముగాన వానికై మితముగ ధనము వ్యయపరచుటముఖ్యము. భోగమున ధననాశన మున్నది గనుక యది మన స్సంగీకరింపనిది. అందుచేత ధనము నిష్ఫలముగావ్యయమొనరించుటకు మనకు స్వాతంత్ర్యము లేదు. బిడ్డలు రుగ్ణతగా నున్నప్పుడు వైద్యమునకు వెచ్చించుట మితవ్యయము. దీపావళినాఁడు కాల్చువస్తువులకై వ్యయము దుర్వ్యయము.

2. డాబునకు శివమెత్తి సంచరించి సర్వస్వము వెచ్చించి కడకుఁ గాళ్లు సాఁచుకొని దారిద్ర్య మనుభవించుట యకార్యకరణమగుట బొత్తుగ తగనిది. ఇంటిపరికరము లున్నకొలఁది మఱియుఁ గావలసియున్నట్లే యుండును. ధనము వెచ్చించిన కొలఁది వెచ్చింప బుద్ధియే యుండును. "తిన్నమ్మకే వాపి, కన్నమ్మకేవాపి." ఇంతవట్టు నిజము నైజము. ఎన్నియున్నను లేనివానికై విచారము వసుంధరావల్లభునకును ముష్టింపచునకును సమానముగ నుండియే తీరును. క్షీరములలోనికిఁ బంచదార లేదని ధనియుఁ గంజినీళ్లలోని కుప్పుగల్లు లేదని నిర్ధనియు దురపిల్లుచునే యుండుట తప్పదు. వ్యయము చేయుటకు మొదలిడినచోఁ గొండలు పర్వతములు నాటవు. గండితెగినట్టి తటాకములోన నీరు నిల్చునే. అట్టియెడ ముఖ్యావసరవస్తుసంపాదనకైమాత్రము ధనము వెచ్చించుచు మిగిలినది మూటగట్టుకొనువానికి లేమిబాధ సంభవించుట దుర్లభము. అట్టివాఁ డెన్నండును లే దని పొక్కనక్కఱయుండదు. అసంతృప్తి నిరాశాదులు చిత్తంబులం దగులొక్కనవు. ఇంతకన్న నరజన్మమెత్తినవాని కబ్బఁగల సౌఖ్యమున్న దే? ఈసుఖ మొదవఁజేయునది మితవ్యయము. ఆఁడుబిడ్డల వివాహాదిశుభకార్యములలోను, బండుగదినంబుల వేడుకల లోను, దీపావళిసరకుగాల్చుపట్లను, మన దేశీయులు గొప్ప దనఁపుచిన్నియ యని గర్వముతో లేనిపోని యెత్తు లెత్తి, తమ యూదాయమునకు మించిన వ్యయముచేసి, తీరనిఅప్పులపాలై తుదకుఁ బూట తిండికిని, నిలువ నీడకును దూరమై, దారిద్ర్య

ముచేఁ గడగండ్ల మునిఁగి యేమందులును మాన్పఁజాలని మనోవ్యథంబడినవార లధిక సంఖ్యాకు లన్నియూరుల నీ నాఁడెందఱో, చెఱువు లెండినప్పు డొడ్డునఁబడిన మీనుల ట్లున్నారు. అమితార్థవ్యయమువలన సంభవించు నిడుములు వారింగనినవారల కెఱుకవడును, మఱియు ననుభవించినవారి కెఱుకయగును. జనులు మితవ్యయమునే లక్ష్యముగాఁ బెట్టుకొన్నచో నిట్టి యిక్కట్టులు పుట్టుట కవకాశ ముండనేరదు. గృహసౌఖ్యమునకును సంఘసౌఖ్యమునకును హేతుభూతము "మితవ్యయము మితవ్యయ" మని మితిమీఱినన్ని మాఱులు ఘంటాపథముగఁ జెప్పనొప్పును.

3. మితవ్యయమువలన దారిద్ర్యము కలుగకుండుటయే లాభముకాక ధనము నిలువఁజేసికొనుటయుం గల్గును. వెచ్చించునాఁడు చేతిలోఁ బడి రాళ్లున్నప్పుడు విజృంభింపక తలవంచి మిన్నకుంటివా ధనము పెఱుఁగును. దానఁ గలకాలము తలయెత్తుకొని బ్రతుకవచ్చును. పట్టుఁదలప్రధానము చేసికొని యొకని మించి యొకఁ డున్నసొమ్మెల్ల వెదజిమ్మి వమ్మునర్చి యెల్లరును లేనివారగుటకంటె శోచనీయాంశ మేమున్నది? ప్రతిమానవుఁడు తనముంగిలి తా నూడ్చుకొన్నచో వీధియంతయుఁ బరిశుద్ధముగ నుండు తెఱంగున, నెవ్వని మట్టునకు వాఁడు మితవ్యయ మొనర్చు ప్రతిజ్ఞఁ బూనినయెడల సంఘమంతయు సూర్యోదయకాలమునందలి తామరకొలనివలెఁ గలకలలాడుచు లక్ష్మితోఁ దులఁదూగును. మఱియుఁ గష్టించి సంపాదించినదానిలోఁ గొంతభాగముఁ దాచుకొన్నవాని కున్న

ధైర్యము సౌఖ్యము చెప్పనలవికాదు. అక్కఱలాడనినాఁటిగతి యే మను చింతతొలంగును. వ్యాధిగ్రస్తుఁడై మంచముపట్టిన నాఁడు పోషణచికిత్సలకై కలగుండువడ నక్కఱ లేదు. నిర్విచారమునకంటె మనుష్యునారోగ్యస్థితిలో నుంచు దివ్యౌషధం బెందును గానరాదు. నిలువలేనివాని హృదయస్థితి పగవాని కైనఁ గోరరానిది. కాఁబట్టి నీ వెల్లవేళల మితవ్యయమును దృష్టిలో నుంచుకొనుచో ధనము నార్జింపఁగలవు. ధనమున్నవాఁడు దాత కాఁగలఁడు. చేతనాలుగుడబ్బు లున్నయతఁడే లేనివారి కింతధర్మముచేసి పుణ్య మార్జింప శక్తిమంతుఁడై యుండు. అట్టి నరుని యశ మదియే వచ్చి చేఁపట్టును. అందుచేత మితవ్యయమువలనఁ దోఁడిమానవతతిబాధలఁ దగ్గింపనుగాని నిర్మూలింపనుగాని శక్యమగును.

4. తన వచ్చురాముల మచ్చున కుచితముగఁ గొంత వ్యయముచేసి, కొంత పొదుపుచేసికొనుచుఁ బ్రవర్తించుటే తెలివిగల్గి మనుగడ యొఱింగినవానికి లక్షణము. వచ్చిన నాఁడు ముందు రానినాఁటిమాట నెద నెంచక సర్వము భక్షించువారు గొందఱు. ఆయమునకుమించిన వ్యయములం దలపెట్టి ఋణగ్రస్తులగువారికంటె పీరు పరిముల్లువాసి మేలు గనందగును. ఏనుఁగుతొండపు లావుగల రాఁబడి యున్నవాఁడు సూది యురవున వ్యయము చేయవలయునని యనుభవజ్ఞులనుడి. ఇప్పాళపుఁ బ్రవర్తనమందు లుబ్ధత్వము లేకపోవుటయే కాక ముందు రాఁబోవు లేమిదినంబులందలి యనుభవమునకు మిగుల్పున్నది. పిపీలికల సంపాదన వ్యయపద్ధతులు మానవుల

కనుసరణయోగ్యములు. కడుపుఁగట్టుకొని యార్జనమంతయు మూటఁగట్టుకొన్నవాని మిగుల్పు మితవ్యయపు ఫలితముగాక లుబ్ధత్వజనితము. దిబ్బుదిబ్బు దీపావళి పండుగ యని కుప్ప నూర్పుగ నెప్పటిదప్పుడు దులుపుకొని తినువాఁడు తాఁ దిను తరి లోభుల నధిక్షేపించునుగాని క్షామసమయములందును ధర్మకార్యాచరణమందును పిశినారులు ముల్లెమూటల విప్పి పంచిపెట్టఁగల సమర్థులని తలపోయఁజాలఁడుకదా! దూరదృష్టితో దమ్మిడి దమ్మిడి చేసి లక్షలు కోట్లు చేర్చినవాఁడు నవవసరవెచ్చమున కిచ్చగింపఁ జాలఁడేకాని మితవ్యయ మొనరించును. కాని వానిపైఁ బ్రేమ లేనిలోక మీర్ష్యఁ గాని లుబ్ధబిరుదము నడుగఁబడకయే ప్రసాదించును. ఆబిరు దొసంగిన వారలందఱు పేరైన లేక మడిసిపోవ నట్టిలుబ్ధులు బుద్ధిపుట్టినప్పుడు చేసినమహాత్కార్యములు, ప్రారంభించిన సంస్థలు దినదినాభివృద్ధితో నిలిచియున్నవి. మనదేశమునందలి ధర్మశాలలు సత్రములు మొదలగున వెన్నియో దమ్మిడికి దమ్మిడిఁ జేర్చి పెద్దమొత్తములం జేసిన మితవ్యయాభిలాషుల యౌదార్యగుణనగ ఫలితంబులేయని మఱువకుఁడు.

5. మితవ్యయాభ్యాసమువలన సత్త్వవర్తన మలవడును. తద్వ్యయ మాదర్శముగఁ బెట్టుకొన్నవాఁడు కొన్ని భోగములనువిలాసములను వేడుకలను క్షణకాలికములని కనిపెట్టి యాత్మనిగ్రహముం జూపును. ఆత్మనిగ్రహము లేనివాఁడు చేతఁగల బేడయు నుదయపానీయములకుఁ బొగచుట్టలకు వెచ్చించి, కైపెక్కి పెద్దపిన్నతారతమ్యమును మఱచి వావివరుసలు లేక

యెల్లర నీసడించుచుఁ బ్రవర్తించుచుండఁగా, మితవ్యయములక్ష్యమున నుంచుకొన్నవాఁడు ముక్కుపట్టి లాగుభోగాశనునిగ్రహించి పేద మిగుల్చుకొని యంగవిహీనులకు నిరుపేదలకు దమ్మిడి దమ్మిడిగ దానముచేయుచుఁ బుణ్యసంచయ మొనర్చుకొనుచుండును. మితవ్యయము చేయువాఁడు కొన్ని నియమముల బాటించును; దన్నియమబద్ధుఁడై యుండుట కిచ్ఛగించినచో మితవ్యయ మది యే యలవాటగును. అట్టి నియమబద్ధజీవనమే మానవునకు గొప్ప నైతిక శిక్ష. బుద్ధిని, నీతిని, శీలమును దూబరతిండితనము చెఱుప, వానిని మితవ్యయ మాభివృద్ధిగావించును. దూఁబరతిండితనము బలమును బుంస్త్వమును వమ్మొనరించును; మితవ్యయము వానిని బెంపొందించును.

6. కేవల లుబ్ధత్వముకాని దూఁబరతిండితనముగాని నీచము. మితవ్యయమే సర్వశ్రేయోమూలము. ఆర్జింపఁగల శక్తి ప్రతివ్యక్తికిం గలదు. అది వ్యయముచేయు శక్తియుం గలదు. ఆర్జించినదానిలో నవసరవ్యయముమాత్రము చేసి మిగులుచు శక్తి గలిగియుండుటే యరుదగు మితవ్యయము. ఇంతవినినపిదప నీవు బుద్ధిమంతుఁడవైనచోఁ గోరి యాచరణమునఁ బెట్టవలసినది మితవ్యయమే సుమీ!

భూతదయ.

క॥ సమదర్శియై యఖిల భూ
తములను దనయట్లు గాఁగఁ దలఁచును నెవ్వాఁ
డమలన్యాయపరుండగు
నమరు లతని వందనీయుఁ డండ్రు నరేంద్రా!

—భారతము.

1. భూతములయందు దయఁగలిగియుండుట భూతదయ. భూతము లేవి? 'పృథివి, అప్పు, తేజస్సు, వాయువు, ఆకాశము' అను నవి పంచభూతములు. వీని ప్రశంస భూతదయ కాదు కాని భూతదయయం దొకవిధముగా నివి యిమిడియే యున్న వనవలసియున్నది. పిశాచము లన భూతము లని వాడుక యున్నది. ఆభూతప్రసక్తి నిందుఁ జొన్పుట యభూతకల్పనమే. భూతదయా సమాసపూర్వోక్తపదముగఁ జేర్పఁగఁ బడిన భూతమునకుఁ బ్రాణి యని యర్థము. భూతదయ యనఁ బ్రాణి కోటిపైఁ గరుణఁ గలిగియుండుట యని భావము. ఈగుణము సర్వప్రాణుల కగత్యమై యున్నది. అందున జ్ఞానవంతుఁ డని విఱ్ఱవీగు మానవుఁడు తోడివారిమీఁదను దక్కఁగల జంతు వృక్షవిహంగంబులమీఁదను గరుణ నవ్యాజముగఁ జూపుట యవసరము. భూతములపై నెనరుఁజూపుట భూతదయ.

2. దెబ్బతగిలినను, కాలిలో ముల్లుగ్రుచ్చుకొన్నను బ్రాణి యెంత విలవిలలాడునో సర్వజనానుభవము. ఒకని చేయి తెగిన రక్త మెట్లుస్రవించునో, తీ పెట్లు మనస్సును వేధించునో, కోతవడినచోట నెట్టిగాయమగునో తెలియనివిషయ

ము కాదు. నరుఁడు దేనినైన నొప్పుకొనునుగాని, తన ప్రాణాపాయము నొల్లఁడు; తన దేహహాని నిచ్ఛగింపఁడు. వైద్యుఁడైన నితరులకంతులఁ గోయగలఁడుకాని తనకంతి గోసికొనఁజాలఁడు. ఏజీవికైనను దనప్రాణముకంటె మధురతరమైన దింకొకటి గాన్పింపదు. గోదావరిలో నొక మున్గుచుండ లోపలనున్న వాఁ డెవ్వని ప్రాణముల వాఁడు దక్కించుకొనఁ బ్రయత్నించునుగాని యితరుల నెంతయాత్మబంధువులనైన రక్షించుటకుఁ దొల్తఁ బ్రయత్నింపఁడు. సాల నిప్పంటుకొన్నవేళ, నేజంతువున కది తప్పించుకొనఁజూచి కట్టుత్రాళ్లు బలవంతమునఁ ద్రెంచికొని బయటపడఁజూచును. అనఁగా నేజంతువునకైనను స్వప్రాణమునకంటెఁ బ్రియతరమైనది లేదు. ఆత్మప్రాణరక్షణమునకన్నఁ బని లేదు. జీవితవ్యాపారములన్నియు నరుని నిజప్రాణావనమునకే. తనను గాపాడుకొన్నట్లె నరుఁ డితరులన్ గాపాడవలెను.

3. తననొకఁడు గొట్టఁ దా నెంత బాధఁ జెందునో నరుఁడు తాఁ గొట్ట నితరు లంత బాధఁ జెందెదరు. నరుఁడు తన వ్రేలు గోసికొన్న రుధిరము గారునట్లె యితరసత్వముల కాయంబుల గాయంబు లొనర్చినచో నందుండియుం గీలాలము జారును. వృక్షములం దెగఁగొట్టినచో నాతావులనుండియు రసము ధారలు గట్టును. తన ప్రాణమును గాపాడుకొనుటయొకటి, యందు నిమిత్తము పరుల ప్రాణములఁ దీయుట వేఱొకటి. తన కపజయము, హాని, ధనక్షయము, బంధునాశనము, తిండిలేమి మొదలగునవి సంభవింప నరుఁ డమితబాధఁ జెందును. తద్విధ

మున నితరులుకూడ బాధఁజెందెదరని తలపోయుట, వారి బాధల నివృత్తిఁ జేయుట, వారి కుపకారము లొనరించుట, యనునవియే భూతదయాతత్వము. తన్నుఁగోయఁ బాలుగారి యొరులఁగోయ నీరు గారునా? ఎల్లరక్షత దేహములనుండియు రక్తమే కారును. అట్టిచోఁ దనవంటివార లే యితరులని వారికి మేల్లొడఁగూర్చుటయుఁ గీల్లొనర్పకుండుటయు భూతదయారహస్యము. 'ఆత్మవత్సర్వభూతాని' యని తలపోసి యాచరణ మం దని పెట్టునతఁడే భూతదయాపరుఁ డనఁ దగినవ్యక్తి.

4. ఎందుకొఱకు భూతదయగలిగి మానవు లుండవలయు నన్నచో సమాధాన మీక్రింది కందము నున్నది.

క. భూతముల కలుగునతనికి
భూతము లఖిలమ్ము నలుగు భూతహితార్థీ!
భూతతతి కభయమిచ్చిన
భూతాత్మున కభయమిచ్చు భూతావలియుఁ.

—భారతము.

అందునిమిత్తమేమైనను భూతదయఁజూపుట మానవునకు ధర్మము. బాధపడుశరీరభాగమువైపుఁ దక్కినభాగములన్నియు దృష్టిఁబఱపును. బాధపడు బంధుగునివైపుఁ దక్కిన బంధుగులందఱు వాత్సల్యముఁ జూపెదరు. అట్లే యేప్రాణి కామయాదికంబులు దటస్థించినఁ దక్కినప్రాణులన్నియుఁ దోడగుట ధర్మము.

5. భూతము లసంఖ్యాకములు. నీతోడిమానవులు నీవు పెంచుజంతువులు, వన్యసత్వములు, పక్షులు, జలచరం

బుల్లు మొదలగునవి స్థూలదృష్టికిం గోచరించెడివి. ఇవియే సర్వజీవు లనరాదు. మానవుని యంత్రసాహాయ్యశూన్యదృష్టికిం గోచరించునవిగాక యనేకకోట్లజీవరాసు లీప్రపంచమునం గలవు. అవి యంత్రసాహాయ్యమునం గన్పట్టు సూక్ష్మజీవులు; నీటను మంటెని గాలిని నివసించుచున్నవి. నీతలలో జీవులు, మేనిపై జీవులు, దేహములోపల జీవులు, నీవు కాలు కదిపిన జంతువులపైఁబడును. చేయిఁద్రిప్పిన జంతువులకుం దగులును. వీనికిందోడుగ వృక్షములు ప్రాణములు గలవి. పచ్చగడ్డి పోఱక మొదలు వటవృక్షపర్యంతముగల భూతము లనేకంబులున్నవి. పిపీలికాదిబ్రహ్మపర్యంతముగల భూతములసంఖ్య నెన్నఁదరంబె? గణింపవీలుకాని యధికసంఖ్యగల జంతువులను దయతోఁజూచుటయన్నఁ గష్టము. ఓమానవుఁడా! నీవు నవనాగరకుఁడననియుఁ బ్రకృతినంతయు లోఁబఱచుకొని దానిచే నూడిగము చేయించుకొనుచుంటిననియు బీరములఁ బల్కెద వే! నీబడాయియంతయు జీవహింసపై నాధారపడియున్నది. పునాదియే చెడ్డదైననాఁడు పైకట్టడమంతయు నట్టిదియకదా! జీవహింసచేయక గౌరవమార్జింపవలయును. సంసారములో నుంటివా జీవహింసాచరణ మవశ్యకర్తవ్యమగును. కావున నరుఁడు భూతదయాపరుఁడనిపించుకొనుటకు సన్న్యాసియైమనుట యుత్తమోత్తమమార్గము. సంసారములో నుండఁదలంచిననాఁడు వాఁడు యోజించి యేపనిఁ జేసినచోఁ దక్కువ జంతుహింస యగునో నిర్ణయించి యధమ మాపనియైనఁ జేయవలయును.

6. భూతదయగలిగి ప్రవర్తింపఁదలఁచుకొనినవాఁడు మెలఁగవలసిన దెట్లు? భూతహింసాకరములగుకార్యము లాచరింపకుండుటయే కర్తవ్యము. కాలుతీసి కాలుమోపునప్పు డడుగు పురుగుపైననో పిపీలికపైననో, పడి ప్రాణాపాయము సంభవింపఁజేయును. నీవొసఁగఁజాలని ప్రాణము నీవు సులభముగ ననాలోచితముగఁ దీయఁగడంగు టెంతపాపకార్యము? కాఁబట్టి వివేకబుద్ధితోఁ ద్రికరణశుద్ధిగ జంతువుల కపకారములగు పనుల మానుకొనుము. కొందఱు విద్వాంసులు పానీయపాత్రల దోముచో సూక్ష్మజీవులు నశించునని తోమని చెంబులనే వాడుకొనెడివారఁట. అదే కారణమునఁ దడిబట్టల నుదుకకయే యారఁగట్టుకొనెడివారఁట. అట్టి దయాపరుల కునికిపట్టయిన భారతదేశములో మాంసము దినెడివారిప్పటికిని నిల్చియుండుట సిగ్గు. విషజంతువులగు పాము, తేలు మొదలగునవి కంటఁబడినను వానిఁజంపక విడిచెడివా రిప్పటికిని నంద్ఱం దున్నారు. స్వేచ్ఛగాఁదిరుగు విహంగంబులను జంతువులను బెంచుచున్నా మను నెపమునఁ బంజరంబుల బోనుల వానిని బెట్టి చెఱపెట్టువారిని పెద్దలు నిందించుచుందురు. ఏల? ఆసత్త్వముల స్వేచ్ఛకు భంగమువాటిల్లినది కాదా? రోగముచే బాధిల్లు జంతువులఁ దుపాకితోఁగాల్చి చంపి వాని బాధఁ బాపుట పాశ్చాత్యులయాచారము. ఆపలుకే భారతీయునకుఁ గర్ణకఠోరముగనుండును. పరుల మోసగించుట, వారి కేవిధమగు నపకారమేని యొనర్చుటకూడ జీవహింసలోనే పడును. అవి వర్జింపఁదగును. భూతదయ కహింస ప్రథమసోపానము.

అహింసావ్రత మసిధారావ్రతమువోలెఁ గఠినమైనది. తద్వ్రతావలంబకుఁ డితరజీవులను దూషింపఁడు. వానికిఁ గీడు మనోవాక్కాయములఁ జేయఁడు. అతఁడు భౌతికసంబంధములు త్యజింపవలసినవాఁడగును. ఎక్కడ నెప్పు డేమిచేసిన నే భూతములకు నష్టమో యని తిండికూడమానుకొని నిరశనవ్రతదీక్షావలంబకుఁ డగును. చల్లని చిత్తవృత్తి నెల్లరపై మలగించును. సకలభూతములయందు పూర్ణదయయుక్తుండగును. అహింసావ్రత ముత్తమలోకములఁ గూర్చును. భూతదయఁగలిగియుండుట యన్నఁ గృపచిగురొత్తుచిత్తంబుతో నహింసావ్రత మారంభించుట. ఇది మానవుని విధాయకకృత్యము.

ఆ॥ వె॥ దంతియడుగులోనఁ దక్కినజంతుచ
యంబునడుగులెల్ల నడఁగియుండు
నట్ల ధర్మకోటు లన్నియు లోనగు
నిర్గుణ!యహింస కింత నిజము. —భారతము.

7\. అహింసావ్రత మవలంబించినపిదప నరుఁడు చేయవలసినది భూతముల కుపకారము. శక్తికొలఁది పరజీవులకు మేల్లొడఁగూర్చుట యుక్తము. జంతువులఁబోషించుట, యాకొన్నవాని కన్నమిడుట, పిపాసఁగొన్నవానికిఁ బానీయ మిచ్చుట, సంపాదనలోఁ గొంతపాలు భూతబలియొసంగుట, దీనులకు సాయ మేవిధముననఁగాని చేయుట భూతదయయగును. ఎఱిఁగియు నెఱుఁగకకూడఁ జేసిన పనులవలనఁగలిగిన పాపమును బోఁగొట్టుకొనుట కిది సాధనము. చీమలపుట్టలకై వెదకి కలకండయో నూకలో వేయుటయు, భోజనారంభమున

భూతబలి యొసంగుటయు, వేసవి వేడికి సొక్కినజంతువులకు నీరములు పోయుటయు, వఱదలు తుపానులు భూకంపములు మొదలగువానిమూలమునఁ జెడి దుస్థితిలోనున్న వారికి సాయ మొనరించుటయు, భూతదయాప్రబోధితకృత్యములే. ఉపకారి యపకారి యనుభేదము గణనసేయక యెల్లభూతములపై నెనరుఁజూపుటయే భూతదయ.

8. భారతీయుల కహింసగాని భూతదయగాని బోధసేయుట కమ్మరవీధిని గఱిటె లమ్ముట వంటిది. ఇది వేదకాలము నాఁటినుండియు సాంప్రదాయసిద్ధముగ వచ్చుచున్నది. గౌతమబుద్ధుని బోధాసారమంతయు నహింసాధారము. అహింస లేనిచో బౌద్ధమతమే లేదు. నేఁటిదినమున నీభూతదయయే మహాత్ముల యహింసావ్రతాచరణమున లోకవిఖ్యాతిఁ గన్నది. అట్టిజగన్నుతిఁ గన్న విస్తారవ్యాపృతవిషయమునుగూర్చి యధికముఁ జెప్పఁబూని యవకతవకలు వ్రాయఁబూనుట కంటె బుద్ధుని బోధనములను ఇతరమతగ్రంథములను బరిశీలించి యాభూతదయావ్రతదీక్షఁ బూని సుఖంపుఁడని హెచ్చరిక చెప్పి 'అహింసా పరమోధర్మః' యని భూతదయావ్యాసము ముగించుట మేలు.

మూఢవిశ్వాసము.

1. మూఢవిశ్వాసము ప్రతిదేశమునం గలదు. అదిలేని జాతి యుండదనియు వ్యక్తియుండ దనియుఁ గాల ముండదనియు

ఘంటాపథముగ వాకు ్రిచ్చనగును. భారతదేశములో మూఢమగు నమ్మకము లనేకము లున్నవి. ఎంతటి విద్వాంసుడైనను బరుల మూఢమగు నమ్మికల నిరసించునేగాని యాత్మీయ మూఢవిశ్వాసముల సమూల మూడబెఱుకఁ జాలఁడు. నీవు పనియేదైనఁ బ్రారంభించునప్పు డితరులు తుమ్మినయెడల నాపని సానుకూలము కాదనునది మూఢమగు నమ్మిక. స్వకీయకార్యమునకును బరకీయతుమ్ముతమునకును సంబంధమేమని గాని, యాతుమ్ము నీకార్యము నెట్లుబాగోగులఁ జేయుననిగాని నీవు యోజింపవు. అనుకొన్న పనిఁ బ్రారంభింపవు. ఒకవేళఁ గార్యముల యొత్తిడిచే మొదలిడినను నీలోమూఢమగు నమ్మిక వేళ్లుబాఱియుండుటచేత నాపని చేయుచున్నంతసేపును నీ మనస్సు వెనుకకు లాగులాడుచుండును. నీచిత్తము గుంజాటనలో నీకార్యాసురక్తి చెడుచునే యుండును. తుదకుఁ గార్యము గలిసివచ్చినయెడల మఱి దుశ్శకునమును దూషింపవు. ఆకార్యము గలిసిరాకున్ననాఁడు నీప్రయత్నబలహీనతను బట్టుదలలేమినిగాక తొలుదొల్తఁ బనియారంభించునాఁడు తుమ్మినవానిని దుంపలు మొదళ్లు తెగునట్లు తిట్టిపోయుదువు. వారిం గనినప్పుడు పెడమొగము పెట్టెదవు. వారివెనుక మెటికెలు విఱిచెదవు. వారిఁగూర్చి దుర్వార్త లేవియో బయలుదేరదీసి వారికీర్తికి భంగము గల్గింప యావచ్ఛక్తిని వినియోగించెదవు. వారు నీకు గర్భశత్రువులట్లు భావించి వారిని దప్పించుకొని తిరుగఁజూచెదవు.

2. కొన్ని సంభవములమీఁదగాని కొన్ని కార్యములమీఁదగాని కలుగు నకారణ నిరాధారవిశ్వాసమే మూఢమగు నమ్మిక యని విబుధులందురు. అగోచరగూఢశక్తి యేదియో తన కపకారముచేయునని విశ్వసించుటే మూఢవిశ్వాసము. ఈశ్వరునిపై భక్తి నెలకొల్పి మనసు దిటముచేసికొనుటకు మాఱుగ కీడుమేళ్లొదవింతురని క్షుద్రములైన యజ్ఞానసృష్టదేవతలపై భయభక్తులఁ బాదుకొల్పుకొనుటయే మూఢవిశ్వాసము. తప్పుదారిఁ ద్రొక్కిన యీభక్తియే మూఢవిశ్వాస మనంబఱగు. కొన్నిశకునములు దటస్థించినప్పుడు నీకుఁ గీడో మేలో యొదవునని స్వభావసిద్ధముగ నమ్ముటయే మూఢమగు నమ్మకమునకు లక్షణము. ఆ తటస్థములవలన నీ కెట్టుపకారాపకారములు గల్గునో చెప్పుమని యెవ్వఁడైన బ్రాజ్ఞుఁడు నిన్ను నిలఁబెట్టి సాగదీసి యడిగినయెడల నీవు తెల్లమొగముఁ బెట్టి మిన్నకుండెదవు. నీ భయమునకుం గారణముఁ దెలుపఁజాలవు. కాఁబట్టి కారణములేనట్టి భయసంభ్రమహేతువులగు శకునములపై బుద్ధినిల్పుటయే మూఢవిశ్వాస మనంబడును.

3. హేతుహేతుమద్భావసంపత్తితోఁ దులఁదూగు నాధునికప్రపంచము మూఢ మగు నమ్మికల సరకుసేయదనియుఁ బ్రకృతిశాస్త్రజ్ఞానభూయిష్టహృదయములు సంభవమునకు ఫలితమునకుఁగల సంబంధ మారసి తెలిసికొనిననే గాని కేవల మూఢవిశ్వాసముల విశ్వాస ముంచదనియుఁ గొంద ఱనుకొనవచ్చును. ఎందుచేతననగా సందేహము నవ

నమ్మిక మానవుఁ డుగ్గుపాలతో గఱచినవిద్య. పాలుదాగు పసిబిడ్డ తల్లి చెప్పు కథనంతయు నాలించి 'అమ్మా, యీ కథ నిజమేనా?' యని ప్రశ్నించుట యిందులకుఁ దార్కాణము. ఇఁక విద్వాంసుల ప్రమేయము తలపెట్టితిమా వారు మూఢమగు నమ్మికల సంపూర్తిగ నిరసించెదరు. కాని యెంత తోలిన నవి వెనుకచూపుతో మగిడివచ్చి యంటిరింతలవలెఁ బట్టుకొని వదలవు. కావుననే నవనాగరకత జ్ఞానసంపత్తి గల యీనాఁడుకూడ నన్నిదేశముల నన్నిజాతుల విచిత్రమూఢ విశ్వాసములు ప్రబలియేయున్నవి. ఇతరులను మూఢవిశ్వాస ముల నిందించువారేగాని అంతయో కొంతయో మూఢ విశ్వాసగ్రస్తులు కానివా రెందరును లేరు. బల్లిపలుకులు, తీతువుపిట్ట కూతలు, ప్రయాణోన్ముఖుల శకునములు, భుజస్పం దనములు, కంటి యదరిపాటులు మొదలగున వన్నియు సుఖ దుఃఖ హేతువు లనునవి మూఢవిశ్వాసములే. వానిచేఁ గట్టు వడనివాఁ డుండఁడు. మూఢమగు నమ్మకములుగల వారిఁ జూడనైన నొల్లక నిరసించుచు విజ్ఞానసంపన్నులమని విఱ్ఱవీగు వారలుగూడఁ బదుముగ్గు రొక్క భోజనపుబల్లదరిఁ జేర నొల్లరు. ఇదేరీతి నేడ్వురు భోజనపంక్తిని జేర మనవార లొప్పరు. ఈ ప్రకారమే మనకు మార్జాలదర్శనము, దివాం ధపురుతము విధవశకునము మొదలగున వన్నియుఁ జెఱుపు సేయునని నమ్మకము మూఢవిశ్వాసము గాక యన్యం బెట్లగును.

4. మన చుట్టునున్నవారేదియన్న నదియే మనమున వలయును. ఒకప్పుడు భూమియే స్థిరముగనుండ సూర్యుఁడు దానిచుట్టుఁ దిరుగుచుండెనని లోకమంతయు నమ్మినదినము లున్నవి. ఆ దినములలో సూర్యునిచుట్టు భూమియే తిరుగుచుండెనని యన్నవాఁ డెగతాళి సేయఁబడెను; దండింపఁబడెను. రానురాను సూర్యుఁడు మధ్యనుండ భూగోళ మా సూర్యునిచుట్టుఁ దిరుగుచున్నదని యొక్క మహానుభావుఁడు స్థిరపఱచెను. నాఁటినుండియు నేఁటివఱ కదియే నమ్ముచున్నాము. ఇప్పుడట్లే యననివారిఁగని యెగతాళిచేయుదుము. శాస్త్రాధారము ప్రయోగాధారముగల వాని విషయములైన నమ్మకములే యిట్లు మాఱుచుండ విపరీతములైయుండ మూఢవిశ్వాసములు స్థిరములైయుండి విశ్వసనీయములు గావలె ననుట వెఱ్ఱి.

5. దేశదేశములఁగల మూఢవిశ్వాసములు భిన్నభిన్నములుగ నుండునని పైనఁ జెప్పితిమి. ఒకప్పుడు కొన్ని దేశములకు సమాన మూఢవిశ్వాసము లుండవచ్చును. కుక్కలు మొఱ్ఱోయని రోదనధ్వనితో మొఱిగినవీధిని మరణము సంభవించునని నమ్మి వీధులందు గుక్కలారీతిని మొఱుగుచో జనులు వానిని దఱిమెదరు. తక్కిన సమయంబుల శ్వానరావంబుల నలక్ష్యమొనర్చినను గృహంబున రోగియున్నప్పుడు రోగిబందుగులు కుక్కలను దఱిమి దుడ్డుకఱ్ఱలతో మోదెదరు. ఆ రీతిని దఱిమి సారమేయముం గొట్టినమాత్రమున రోగి జీవించునా? ఇదిపాశ్చిమదేశవాసుల కెల్లరకుం

గలమూఢవిశ్వాసమే. ఇట్టిదిగాక మనదేశమునకుఁ బ్రత్యేకములగునవి కొన్నియున్నవి. ఉత్తరవైపు తలగఁబరుండరాదు. భోజనపంక్తి నేడువిస్తరు లుండకూడదు. ఇత్యాదు లూహ్యాంబులు.

6. మూఢవిశ్వాసములకు మూలమేమి? మరణము తీతువుకూత కాకతాళీయముగ నొకప్పు డెప్పుడో సంభవించియుండును. యదనన్తరన్యాయమున వెంటనే మరణమునకుఁ దీతువుకూత హేతువని సూత్రము కల్పింపఁబడియుండును. దానినే యెల్లరు నమ్ముచున్నారు. అంతియకాక తీతువు నెవ్వఁడైనఁబట్టి దానిచేఁగూయించి, కూసినప్పుడెల్ల మరణముగల్గుట గన్నవాఁడున్నాఁడా? అట్లు నిజముగ జరుగునా? యుక్తిపరులు దీనికొక్కసమాధానము చెప్పెదరు కాఁబోలు. బలవంతముగఁ గూయించినకూతలుగాక సహజరుతములు మరణసూచకములనీ వారందురు. అయితే మరణసమయములం దెప్పుడు నారుతములు వినఁబడునా? అవి వినఁబడినప్పుడెల్ల మరణంబులు సంభవించునా? ఏదియు లేదు. కాని మూఢవిశ్వాసముమాత్రము నిల్చియున్నది. కార్యకారణజ్ఞానము లేక తొందరపాటునఁ దైత్తిరీయరుతము మరణసూచకమని నొక్కి యొక్కప్పు డెవ్వఁడో వాక్రువ్వ నది వ్యాపించి వంశపారంపర్యముగఁ బ్రాకి లోకములో వేరులు బాఱి నిల్చినది. అదేరీతి నొకదినమున ధనలాభము నొందినవాఁడు నాటి యుదయంబున నెవ్వని మొగంబుం జూచితినో యని యూహసేయును. సువాసినీదర్శనము నిద్ర మేల్కాంచినంతనే యైనది గనుక ధనప్రాప్తి యయ్యెనని మూఢమగు

నమ్మిక కల్గును. దినమునఁ బ్రప్రథమమున సువాసినీదర్శనము ధన మొనగూర్చునని మూఢవిశ్వాసము. ఇది మూఢమగు నమ్మికయే కాకున్న ననుదిన మెందఱో తాము నిద్రమేల్కొనినంతనే సువాసినులఁ జూతురే? వారందఱు ధనలాభము నొందుచున్నారా? అయినను పైనఁ జెప్పిన విశ్వాసము నిలిచియున్నది. సాధారణముగ భయంకరమై యసహ్యకరమైన వస్తుదర్శనము దుఃఖహేతు వగుననియు, రమణీయమై ప్రియమైన వస్తుదర్శనము సుఖహేతు వగుననియు నమ్ముటే మూఢవిశ్వాసమునకు మూలము.

7. కొందఱు బయలుదేరుచో దుశ్శకునముం గని ప్రయాణము మానెదరు. తొందరవ్యాపారము లున్నవారు సుశకునముకొఱకు వేచియుండి బయలుదేరెదరు. లేదా, యింటిలోని పుణ్యస్త్రీలఁ గొందఱఁ గొంతదూరము బంపి తమ కెదురు రమ్మనెదరు. ఇవి బలవంతముగ రప్పింప వచ్చినవిగావా? వీనివలన మనస్సునకుఁ దృప్తియే కాని ఫలము శూన్యము. ఇట్టివారిని హేళనచేయుటకే కాఁబోలు వెనుకతుమ్ము ముందునకు లాభము, వరుసను రెండు దుశ్శకునములొక్క సుశకునమునకుఁ దుల్యమని కల్పనములు చేయఁబడినవి. ఇప్పుడొక కథ వినుండు. పూర్వ మొక భూనేత గలఁడు. ఆతఁ డుదయముననే నిద్రలేచి వీథిలోనికిం దొంగిచూచెను. వీథి నేగు నొక బాలుఁడు వానికంట పడెను. అటుతరువాత రాజు గుఱ్ఱపుస్వారిఁ జేయుచుఁ గ్రిందఁబడఁబోయెను. ఎన్నఁడు లేని యిట్టి సంభవమునకు హేతువు బాలకదర్శనమని నిశ్చయించు

కొనెను. అధికారము చేతిలోఁగలదుకనుక బాలుని బిలిపించి వానికురిశిక్ష విధించి కడసారికోర్కెఁ గోరుకొమ్మనెను. దానికా బాలుఁ డడలక రాజుతో సంభాషింపఁగోరెను. నృపాలుఁ డందులకు వల్లెయనెను. అంత బాలుఁడు 'రాజా! నేఁడు ప్రథమమున నన్నుఁ జూచుటచే నీవు తురగముమీఁదినుండి క్రిందఁబడఁబోయితివి. కాని నేను నీముఖారవింద సందర్శనమును తొలుదొల్త నొనరించుటచే నా కురిశిక్షయైనది. దీని కేమందు వనెను? రాజు తెల్లబోయి మంచివాఁడగుటఁ దన తెలివితక్కువతనమునకుఁ జింతించి బాలుని సంరక్షించెను.

8. కడకు నిజము చెప్పవలసివచ్చినయెడల మూఢమగు నమ్మికలన్నియుఁ జెడ్డవి. వానివలనఁ గీడుగల్గు నన్న నాఁడు వానిఁ దలంచి లక్ష్యము సేయుదురు. వానినే నమ్మియున్నవారు సోమరులై ధైర్యసాహసములకు దూరులై పౌరుషహీనులై చెడెదరు. అతిగా ముందువెన్క లారయుట, పిఱికితనమును, హృదయానిశ్చలత్వమును, మూర్ఖతను బుట్టించునవి మూఢవిశ్వాసములు. అనుదినవ్యాపారములలో ననేకపరివర్తనానియమములు మూఢవిశ్వాససంజనితము లగుట, దేని కేది కారణమో, యేది ఫలితమో నిశ్చయింపఁజాలక యెంతటి విద్వాంసులును మూఢవిశ్వాసములకుఁ జేఁజిక్కియున్నారు. నూటికిఁ గోటి కొక్క బుద్ధిమంతుఁ డెవ్వఁడో మూఢవిశ్వాసములకు హృదయంబునఁ దా వొసంగక, పిడుగునకు వారశూల యేమని చరియించు. పరీక్షించి యర్థవిమర్శనచేసి ఋజువుచేయ వీలైనవానినే నమ్మవలయును. మూఢ

విశ్వాసము లపాయహేతువులు. ఇంతటితో నీ మూఢవిశ్వాస రచన సరిగాని మూఢవిశ్వాసమునకుఁ దుది యేది?

అలవాటు.

1. అలవాటున కర్థ మేమి? ఏ పనినైన నొక్కఫక్కిని జేయు చేతివాలుదనమునకు, బుద్ధిపోకడకు నలవా టని పేరు. ఆ పోకడలు కర్తకుఁ దెలిసినను దెలియకున్ననుగూడ సంతతాభ్యాసఫలితములు. వేకువనే యనుదినమున నిద్రలేచు వాని కనుదినము వేళకు మెలకువ రప్పించునదే యలవాటు. మీసములు దువ్వుకొనుట కలవాటుపడినవాని చేతిని మీసములు పోయినతరువాతఁగూడ చెయ్యిమూఁతిమీఁదికి లేవనెత్తున దలవాటు. ఆఱెనిమిదు లెంత యని ప్రశ్నింపఁ బసివాండ్రెక్కము మొదలు దొరకొని చెప్పుచు నాఱెనిమిదులవరకు వచ్చిగాని యుత్తరమీయరు. వారి నట్లే చేయనిచ్చిన నదియే వారి కభ్యాసమై నిలుచును. ఇదేరీతిని మానవుఁడు ప్రభాతమున లేచినదాది సుషుప్తిమగ్నుఁ డగుదనుక చేయుకార్యము లన్నియు వాని యలవాటుచొప్పున నుండును.

2. అలవాటులు మంచివి చెడ్డవి యను రెండువిధములైన వున్నవి. మంచియలవాటులు నీకును బరులకును మేలు సేయును. చెడువి చెట్టపుట్టించును. నీ వే స్వల్పకార్యాచరణ-మొనరించినను నీకేగాక నీ తోడివారలకును దాన నేమి హాని వాటిల్లునోయని ముందుగ నాలోచనసేయుట యుచితము. నీ చెయ్వులవలన నీ కేముప్పును రాకుండ నెట్లు జాగ్రత్తపడె

దనో యట్లే యితరులకుఁగూడ నేవిధమగు ముప్పును గల్గ కుండునట్లు ముందుజాగ్రత్త తీసికొనునది. నిప్పు రాఁజేయు ముందు ప్రొయ్యిలో నేకీటకముౘైన నక్కియున్న వేమో వంటకత్తె చూచినయెడల నామె కేమి నష్టము? చూడకున్న యెడల నందొకవేళ నఁకగియున్న క్షుద్రకీటకంబులకుఁ బ్రాణహానియే సంభవించును గదా! తన యజాగ్రతయలవాటు వలన నిండుప్రాణము మరణింపవలసినదే గదా! అందుచే నామె జాగ్రత్త నలవడఁజేసికొనుటే మంచియలవాటని నీకుఁ దోఁచుట లేదా? ఇదేవిధమున మంచియలవాటులను నేర్చుకొనుట యెల్లర కవసరము. చెడ్డయలవాటులకు దిగుట దుఃఖమునకుఁ జేటు.

3. అలవాటు మంచిదైనను జెడ్డదైనను బలవత్తమమైనది. అలవాటు కాలక్రమమునఁ బ్రకృతిసిద్ధమై పరిణమించును. ఏపనికైన నలవాటుపడితివా యది మఱి వదలఁజాలవు. అనుకొనకపోయినను నలవాటుప్రకారము పనులఁజేయుచునే యుందువు. ఇతరకార్యాసక్తుఁడవై యున్న వేళలఁగూడ నలవాటైనపనులఁ జేయుచునే యుందువు. వ్రాయుచు నాల్కనాడించుట, పెద్దలతో మాటాడుచుఁ గాభ్రాగించుట మొదలగునవన్నియు నలవాటు లయ్యి నైజగుణములట్లుగఁ గన్పట్టుటలో నాశ్చర్యమేమి? అలవాటువలననే స్థిరమగు నడకతీరు మాటవరుస కార్యసాధనక్రమము పట్టువడుననుట నిజము. ఒకమాఱు పట్టువడిన యలవాటులు వదలించుకొంద మన్నను వదలవు. ఏచెడ్డయలవాటునకైన లోనై దాని

మానవలె నని ప్రయత్నించువారి కీ యలవాటుబలము తెలి
యును. తేనీటిఁ గ్రోలుట కలవడి, కొంతకాలము దానఁగల్గు
చెడుగులచే బాధపడి తదభ్యాసము మానవలె నని చీటికి
మాటికిఁ బ్రతినలఁ బూనువారేకాని మానినవారు వేళ్ళ
లెక్కింపఁదగినవారుగాక యెందఱో యుండరు. అట్టివేళ
మానవనిగ్రహశక్తికిని నలవాటుశక్తికిని ఘోరసంగ్రామమై
యలవాటే కడకు విజయధ్వజము నెలకొల్పును. మానవు
డోటమిఁగొని యయ్యలవాటను విజేతకు దాసానుదాసుండై
యది మఱచి ఘనుఁడ నని మురియుచుండును. అలవాటింత దా
ర్ఢ్యవంతమైనదగుటచే నీవు తొలుతనే మంచియలవాటు లబ్బఁ
జేసికొనవలయు. నీబుద్ధి కేది న్యాయమని తోఁచునో యదియే
కొంతకాల మొనర్పుము. అంత న్యాయాచరణమే యలవా
టగును. అన్యాయకార్యములఁ జేయుటకు నీమనసు పోనే
పోదు. ఈవిధమున జరించితివా సుగుణసంపత్తి యొదవున్గం-
మరియాద లబ్బును. చెడ్డయలవాటులు మంచివానికంటె సుల
భ్యములగుటంజేసి వానిబారిఁబడక మెలఁగినవాఁడే ధన్యుఁడు.

4. ఏ యలవాటైన నబ్బు విధమేది? చేసినదే చే
యుట యొకమార్గము. ఈ దినమున నుదయ మాఱుగంట
లకు స్నానముజేసితివా రేపుదయ మావేళకే యాపనిఁ
జేయుము. అత్తెఱఁగునఁ గొంతకాలము చేసితివా యాపని
యానందకర మగును. తొలుదొల్తఁ గష్టముగా నున్నను,
నీవు వదలక వేళప్రకార మహరహము నిరాటంకముగా న
క్కార్యమే చేయుచుండితి వేని యది నీ కలవాటై సుఖప్రద

మగును. దానికిం దార్కాణ మబ్బైసమైన యుదయస్నాన మే కారణముననో మానినదినమున నీ కితరకృత్యములు సాగవు. బుద్ధి పనిచేయదు, మతి సెడినట్లుండును. బలవంతముగ నన్యకార్యాచరణమునకుం గడంగినను నిన్ను నీదృష్టిని మనస్సును మానినస్నానముదిక్కునకే యాకర్షించు నయస్కాంతమలవాటు. మరగిన యలవాటు మానవుఁడు మడియువఱకు మానదు.

5. అలవాటొక్క నాఁడు పట్టుపడదు. సంతతము నియమానుసారముగఁ జేసిచేసి యవయవములరిగి కాయలు కాయవలయును. ఎంత తొందరలోనైన, నెట్టిపనియొత్తిడిలోనైన నీయభ్యాసకాలమున కలవాటు జరిగిపోవలసినదే! అనఁగా దీర్ఘాలోచన శ్రమ లేకయే యలవాటుచొప్పున నక్కార్యము చేసితీరెదవు. ఇది యసంభవ మనుకొనరాదు. నీ వెంతయాలోచనానిమగ్నుఁడవైయుండి వీథినిఁ బోవుచున్నప్పుడైనను దోల్తి నీ వనుకొన్నట్లు నీయడుగులు నీయింటికే కొంపోవును. అడుగడుగునకు నీబుద్ధి ‘యబ్బాయీ! యీదిశ నేగు’మని యుద్ఘోషింపకున్నను నీపదచలనమువిషయమై యోచించుటకు నడకలో నాలోచనములో నీకుఁ దీరికయైన లేకున్నను మనస్సన్యధావర్తి యైయున్నప్పటికిని నీదారి నింటికే పట్టించిన దలవాటు. ఇది పట్టువడుట కెంతయో కాలము పట్టినది. ఇట్లే మిగిలిన యన్నిటివిషయ మని గ్రహింపఁదగును.

6. ఒకయలవాటు పట్టువడఁజేసికొనుట దారపుబంతిఁ జుట్టుట వంటిది. దారపుబంతి చుట్టుటకు నేర్పును బట్టుదలయు

నుండి తీరవలెను. బంతి పెట్టెఁగినకొలఁది చుట్టుట సుకరము గును. కాని యే కారణముచేతనైన బంతి చేయిజారి పడి నదా, యొకటికాదు రెండుకాదు వందచుట్లదారమూడిపోవును. తిరిగియదిచుట్ట నెంచువాఁడేమువెన్కఁలఁ బనిప్రారంభింపవలెను. ఒక్కపరి చేయిజారుటచే నప్పటిచుట్టయేకాక వెనుకచుట్టిన చుట్టును వానికై గడపినకాలమును బడినపాటును నిరర్థము. లగును. అవ్విధంబున నేయలవాటులోఁ బదిదినములు పని చేసినను వృద్ధి గన్పింపదుకాని యొక్కదినము పొరపాటునఁ బనిచేయకున్నచో నాఁటిపనియేకాక యంతకుఁబూర్వ మెన్ని దినంబులో యొనర్చినదంతయు వ్యర్థమై చెడును. పాటంతయు నొక్క దొసంగుతోఁ జెడుననుట యిక్కతననే.

7. ఒకని యలవాటుల పుంజమే వానియొక్క శీల మనంబడుచున్నది. మంచియలవాటులం జిన్నప్పుడే నేర్చితివా యోగ్యుఁడ వగుదువు, చెడ్డయలవాటులం జిక్కితివా యయో గ్యుఁడ వగుదువు. చెడ్డయలవాటుల మరగినచో నసభ్యకార్యము లాచరించెదవు; మరియాద లతిక్రమించెదవు, పరులయసహ్యమున కుఁ బాత్రుఁడ వయ్యెదవు. మంచియలవాటు లే గరచినప్పుడు యోగ్యప్రవర్తనముగలిగి పదిమందిలో నోహో యనిపించు కొనెదవు. ఏతత్కారణమునైన నీవు సదాచారసంపత్తిగల్గి మంచిపనులఁ జేయుట కలవడి సౌఖ్యమున్ను బొంది తద్ధము నరణపరులకు సౌఖ్య మొనగూర్చు శీలముంబొందుట ధర్మము.

8. కొన్ని చెడ్డయలవాటులఁ జెప్పుమంటివా యవి తండో పతండములుగఁగొండకు భూమికిం దాళము వేసినన్ని యున్నవి.

చెప్పఁదొరకొన నంతము దొరకదు. ఎంతమంది వీథులలోఁ బాదరక్షలు లేకుండఁ బోయెదరో యెఱింగియు, వారికాళ్ళ కేమికీడుగల్గునోయనియేని యోజింపక రాజబాటపైఁ బశువులు మూత్రపురీషములు విడుచుచందమున నుమిసి చీది ధ్వంసమొనరించు కొందఱఁ జూచితివా? కొందఱుస్త్రీ లిండ్ల లోని చెత్తచెదారమునంతయు నెత్తి తెచ్చి బాటప్రక్కలనైనఁ గాదు, నడుమఁబోయుట గమనించితివా? పట్టనములలోఁ గంకర బాటనడుమఁ బుల్లియాకు లెగురుచు సూకరంబుల నాకర్షించుటఁ గంటివా? ధూమశకటంబుల నల్గురుం జేరుబల్లలమీఁదను దిగువను నసహ్యకరముగ తిని జెఱుచు మూర్ఖాళికి నితరులపై నెంత లక్ష్యమున్నదో గ్రహింపుము. అరటిపండ్లయుత్తము మైలగుడ్డలతో నల్గురుఁ జూచుచుండ నిలిబలి లేకుండ నొంటిగాఁ దినినదేహికి మిగిలినది బైటకు విసరుటకుఁ జేతులురావా? రైలుబండిలోనే వేయువలయునా? పొట్టకూటికై బండిఁ దోలుకొనువాఁడు లోపలఁగూర్చున్నవారిముక్కులు బద్దలగునట్లు పొగవిడుచుచుఁ జుట్టత్రాగుటయా? ముక్కుపచ్చలారని పసివాండ్రు యౌవనమైకమున ననుభవజ్ఞులచెప్పుచేతల మెలంగక యయోగ్యులై సంచరించుటయా? ఈ చెప్పిన వన్నియుఁ జెడ్డయలవాటులే. వాని పొంతఁబోకుము. ఇవిగల వారలకేగాక తోడి మానవులకుంగూడ నసహ్యకరములై రోగహేతువులై దుఃఖభాజనము లగును.

9. ఇఁకఁ జిన్నవార లలవడఁజేసికొన లేఁ బ్రాయము ననే యత్నింపవలసినవి చెప్పెద:—

i. నిరంతరపరిశ్రమ:—శరీరమునకును మనస్సునకును నెడతెగని పరిశ్రమ కావలెను. కష్టేఫలీయనునట్లు పాటుపడిననే ఫలము దక్కును. తాము పాటుపడకయే సర్వము లభించు ననుకొనువారు వెడంగులు, పరిశ్రమ యేకార్యంబు నేని సులభసాధ్యము గావించుట నిక్కంబు.

ii. పట్టుదల:—తలపెట్టిన పనికి జలగవలె నంటిపెట్టి కొని యాటంకముల సరకుగొనక, మనోరథభంగములకు వెఱవక, జయము గలుగువరకుఁ జేయుచుండుటకుఁ బట్టుదల మూలము. దీనంజేసి కొండంతలు గోరంత లగును.

iii. కాలనియమము:—అనుకొన్న వేళ కనుకొన్న పని చేయుటే కాలనియమము. దాన గౌరవముబ్బును. కాలనియమము లేనివానికన్నఁ గాలనియమ మున్నవాఁడు రెట్టింపుఁబనులఁ జేయ సమర్థుఁడగును. రెట్టింపు సులభముగాఁ జేయఁగల్గును. రెట్టింపుతృప్తి పొందఁగల్గును. ఇతరుల కాల మతఁడు వ్యర్థ మొనర్పఁడు.

iv. వేకువను నిద్రమేల్కొనుట:—ఇది శరీరమునకును మనస్సునకును శాంతినైర్మల్యతలఁ గలిగించును; ఆరోగ్యముం గూర్చును. జీవితమును గాచి పెంపొందించును.

v. సాత్వికనిరాడంబరజీవనము—ఉన్నతాలోచనము:— జీవనమునకు గావలసిన యవసరవస్తువులకు వేషమునకు మాత్రము ధనము వెచ్చించుచు, నిరాడంబరముగ మెలంగు

బలమూన కవసరము. భోగములు తాత్కాలికసుఖకరము లయ్యు బలమును జెరుచును. సదా మహద్విషయంబులనే మనంబునc బ్రవర్తింపcజేయునది. విలాసవిషయములు తేలికభావముల పొంత మనోహాయంబును డాయింపంజనదు. దీన నీయోగ్యత మంచిదై జీవితోన్నత్యంబుం బెంపొందించును.

vi. తలపెట్టినపని బాగుగcజేయుట— సంపూర్ణహృదయముతోc జేసికొన్నపనిని కూలంకషముగ శ్రద్ధగాcజేయుట లగ్గు. కొంతమంది యనాలోచితముగా నొకపని ప్రారంభించి, తాముచేయుపనిపై మనస్సుంచరు. ఇష్టములేనిపనిని మొదటనే మానందగును. పనిచేయcదలపెట్టి సరిగా నెఱవేర్పకుండుటకంటె దోషం బన్యంబుండదు. అట్లొనర్చువారి కాపనులు వ్యర్థములగుటయే గాక యమూల్యము గావించుకొనcదగు జీవితమే వ్యర్థమగును. వారికి నైతికవృత్తి తక్కువ. అంతరాత్మ సుప్రబోధము లసలే మృగ్యములు. చేయనిశ్చయించుకొన్నది తుదివఱకు జాగ్రత్తగా శ్రద్ధతోc జేయుట సమంజసము. ఈ యలవాటువలన బుద్ధికుదురును; నిల్కడ యబ్బును; జయము చేకూరును.

vii. కోప మడంచుకొనుట:—కోపములేకుండుట దైవసంఘటనమే. నిర్మలజీవనమునకుc గోప మడంచుకొనుట యవసరము. చిఱచిఱలాడువాcడు తననేగాక యితరులcగూడ క్షోభింపcజేయును. కోపమువలనc బనుల ధ్వంసముగావించుకొన్నవారధికసంఖ్యాకులున్నారు. కోపమునుసాధ్యమైనంతగా

నడంచుటే కర్తవ్యము. ఆకోపము రాక్షసతామసగుణము గాని మానవగుణము కాదు. అభ్యాసమువలనఁ గోపముం జయింపఁ గలవు. క్షమ కోపమునకు సంకల్పవర్జనము.

viii. నిర్మలమనోవాక్కర్మలు:—చెడునాలోచనలఁ జేయకుము. అవి కలిగినను వానిని నిలువనీయకుము. మంచి వానిపైననే దృష్టిని మనస్సును బ్రసరింపనిమ్ము. మనస్సు విమలమైనయెడల వాక్కర్మలును స్వచ్ఛతగాంచి పవిత్రము లగును. చెప్పవెఱచుతలంపులఁ దలంపకుము; చేయవెఱచు వాక్కు లాడకుము, ఆలోచింప వెఱచుగార్యములు చేయకుము. ఏపని నైనఁ ద్రికరణశుద్ధిగఁ జేయునది.

10. ఈవిధమున నిందుఁజెప్పినవేకాక యణకువ వినయము మొదలగునవన్నియుఁ జిన్నప్పటినుండియు నలవాటు గావించుకొన్నవాఁడు యోగ్యుఁడై యనుకూలజీవయాత్ర చేయఁగలఁడు. ఏయలవాటైనఁ జూచి భయపడక ప్రయత్నించినఁ బట్టువడుననుట నిర్వివాదాంశము. అభ్యాసమువలన నెద్దియుం గూసువిద్య యగును. మంచియలవాటులపుంజమే యోగ్యత.

11. ఏగూటిపిట్ట యాకూత కూయును. ఏయింటఁ బుట్టినవాఁ డాయింటిమర్యాదల నేర్చి యాయింటియలవాట్లు గలవాడును. యజమానుఁ డేయలవాటు లున్నవాఁడో వాని గృహములోనివా రాయలవాటులు గలవా రగుదురు. తండ్రి నిష్ఠాపరుఁడైనచోఁ గుమారుఁడు నట్టిఁడగును. తత్ప్రతికూలవర్తనుం

డగు కుమారుఁ డుండఁడా? పండితపుత్రుఁడు పామరుండన్న దుత్తటాటోటువచనమా యని యడుగుదువేమో? అది యెల్లెడల వర్తింపదు. సాధారణముగఁ దల్లిదండ్రులయలవాటులే బిడ్డల కలవడును. కూడనిప్రేమచే శిక్షలో బిడ్డల నుంచని తల్లిదండ్రులే బిడ్డల దుర్వర్తనాంకురమునకు దానిదోహదమునకు హేతువులు. శిక్ష బాలుర కింపుగాఁదోలుతఁ గన్పట్టదు. జాలిఁగొని తల్లిదండ్రులే యుపేక్షించినచోఁ బిదప వారిపశ్చాత్తాపము గతజలసేతుబంధనం బగును. కాఁబట్టి తమకీవికి హాని యనుకొనక, విధాయకకృత్య మనియెంచి బిడ్డలకు బాల్యముననే మరియాద లలవఱచుట జననీజనకులకు ధర్మము. మొలకై వంగనిది మ్రానై వంగదుగదా! కావున శైశవమునుండియు బిడ్డలఁ గన్న తల్లిదండ్రులు బిడ్డలను సమ్యగాచారసంపన్నులఁజేసి వంశమర్యాదలఁ గాపాడక యాభారము నొజ్జలపైకిఁ ద్రోసి బిడ్డలు చెడిననా యొజ్జలఁ దూలనాడుట నీచము. బిడ్డల దిద్దుటకుఁ దల్లిదండ్రులే పూనినప్పుడు బిడ్డ 'సత్పుత్రః కులదీపకః' అను నుడి నిజమొనరింపఁ గల్గును.

ఓర్పు.

1. ఓర్పునకు క్షమ యనునది పర్యాయపదము. క్షమ యన నేమియో తెలిసికొనుటకు ముందొకటి రెండుదాహరణములం బరిశీలింపఁదగును. క్షమలో భూదేవికీడుగానరాదు. భూదేవి తాలిమికత్తెల కన్నాకు. కావున నామె యోర్పు

నిరుపమానము. ఓర్పుగల స్త్రీని భూదేవి యని యెల్లరుం బ్రశంసించెదరు. భూమి కిట్టి క్షమావంతురాలని బిరుద మేలా కలిగెనో విచారణ యవసరము. తనపై నెంతమంది త్రొక్కు-చున్నను, నెన్నిచోట్లం ద్రవ్వుచున్నను, నెట్టి కల్మషపదార్థములు పారవేయుచున్నను, ధరిత్రి భరించుచున్నది. సమస్త వస్తు వృక్ష జంతు మానవ నివహభారంబును మోయుచు, జెక్కు-చెదరక నిల్చియుండి విధాయక కృత్యములు నెఱవేర్చుచున్నదే కాని యాగ్రహము వహించుచున్నట్లు కాన్పింపదు. నానాప్రకారచరాచరంబులు నింద వేర్వేఱ జనియించి, యిందుఁ బెఱిఁగి, పిదప నింద యడఁగు గావున నీభూమి సకలమునకుం బరాయణస్థానము. ఇదిగాక భూమి తనగర్భమున నున్న యత్యమితోష్ణాగ్రిత గర్భనిర్భేదమై యుండి బాధించినను శాంతంబున నోర్చుకొనుచున్నది. దైనందిన సంచారము సాంవత్సరిక సంచారము సర్వదా చేయుచునే యున్నది. కష్టములన్నియు భరించు నిత్యధర్మములు నెఱవేర్చుచున్నది. దుఃఖభరణశక్తినే క్షమ యందురు. ఒకయువతి యత్తింటిలో నత్తమామలపోరుఁ బడుచు, నాఁడుబిడ్డలరవ్వ కాఁగి, భర్త కాఠిన్యమునకు నిలిచి యెల్లర కదుపాజ్ఞలలో నుండి సంసారకృత్యములు యథావిధిగఁ జేయునప్పుడే యామె త్రాల్మి గలదగును. అట్టి కోడంట్రికఁపు బాధ లే లేకున్నను, నాబాధలఁబడక యామె యెదుర్కొన్నను, బడలేక యాత్మహత్యఁ గావించుకొన్నను గూడ నాస్త్రీకిఁ డాలిమికత్తెయను ప్రశంసాయోగ్యనామంబు

నిద్రించుచుండ నొక్క ఘోరకీటక మా సూర్యనందను క్రొఁదొడఁ దొలిచె. గురునిద్రాభంగం బగు నని యెంచి యెంతబాధకైన నైరించి రక్తస్రావమును సరకుగొనక ధైర్యంబునఁ గీటకకృత్యంబున కోర్చి యాతఁ డచలుండై యుండెను. రక్తము నిజశరీరముం దాక గురుం డగు పరశురాముండు నిద్రమేల్కొని జరిగిన యుదంతం బెఱింగి శిష్యు నుద్దేశించి, 'వత్సా! పరులెరికి నీకున్న యీనిరవధికమగు తాల్మిలే' దని సంభావించెను. అదియే గదా కర్ణున కెన లేనియోగ్యతాపత్రమును బిరుదమును బసదనంబును. కాని 'తనకృత్రిమోద్దేశము నెఱవేరుటకు భంగము వాటిల్లునని కర్ణుఁడోర్పుఁజూపెను. ఇది ప్రశంసాయోగ్యము కా' దని కొందఱమతము.

4. <u>సహన మనునది స్థాణుగుణము.</u> ఒకని నెత్తిపై భారమిడి యెండలో నిలుచుండుమని వాని నాజ్ఞాపించినపుడు వాఁడట్లొనరించినచో సహనశక్తిగలవాఁడని యర్థము. నిలుచుండుటకు విసుఁగుఁజెందెనా క్షమాశూన్యుఁడగును. పెద్దభారమును వహించుట దేహబలమును దెల్పును. మోయుచు నీయాజ్ఞానువర్తియై యెండలో వేడియిసుకపై వట్టిపాదములతో నిలుచుటకుఁ దాల్మిగావలెను. ఇసుక వేడిమికిఁగాని యెండతాపమునకుఁగాని, శిరోభారమునకుఁగాని విసుఁగుఁజెందక యాజ్ఞాబద్ధుఁడై నిలుచుటతాల్మి. ఎన్నికష్టములువచ్చినను భీతిల్లక, వానినన్నింటిని భరించుశక్తియోర్పు. విద్యార్థులెన్నితప్పులెన్ని మాఱులుజేసిన నుపాధ్యాయుఁడు కినియక వానిని దిద్దుబాటు చేయుటకుం గారణ మాతనియోర్పు. బిడ్డలయేడ్పుతో భర్త

చిరాకుతో నత్తమామల యాడిగంబుతో బంధుజనాదరణంబుతో సంసారతాపత్రయమునంబడి కొట్టుకొను కోడలినిఁ గష్టనిష్ఠురముల భరింపఁజేయునది సైరణశక్తి.

5. ఏకార్యాచరణమునకైన నోరిమి ముఖ్యావశ్యకము. కార్యసాధనమునఁ గలుగు కష్టము లనేకములు. కార్యమారంభించి విఘ్నములఁ జూచి భయంపడి, చేయుటని మామట ధైర్యవంతులకుఁ దగు లక్షణముకాదు. ఎన్నివిఘ్నము లెదురుగానిల్చియు ధీరమానవుని క్షమాకవచమును దాకఁజాలవు. ప్రహ్లాదుని యాదర్శనీయక్షమయే యాతనిభక్తికింబునాది. జనకుఁడు తన్నెన్ని బాధలపాల్సేసినను వానినన్నింటికి నోర్చి తాలిమికాఁడై కీర్తిఁగన్నవాఁడు ప్రహ్లాదుఁడు. హిరణ్యకశిపుఁడు తనయుని గష్టముల పాల్సేయకున్నను బ్రహ్లాదుడా బాధలపడలేక లొంగిపోయినను భక్తునియొక్క యోరిమికిం దావులేదు. ఓరుపరులక్షమఁ బరీక్షయొనరించుటకో యనఁ గష్టము లధికసంఖ్యాకము లగుచుండును. వానినెల్ల ననుభవించి యనుభవించి తమలో మొలకెత్తిన క్షమాబీజమును బెంపొందఁజేసికొనువారలే తాలిమికాండ్రై ప్రసిద్ధికెక్కెదరు.

6. క్షమలేకున్నచో నాగ్రహము గల్గును. ఏడ్చి విసిగించు బిడ్డయెడల తల్లికిం గోప ముద్భవించినయెడల రెండు చరువులతో వాని నామెమోదును. తప్పులొనరించు శిష్యునిఁ గని క్షమాహీనుఁడగు నొజ్జ వానిని దండించును. తపస్సుచేసి యోరిమిలేని ముని యెన్నటికిఁ బ్రత్యక్షముకాని దైవముందూలనాడి చేయఁగడంగిన కార్యమునుండి విరమించును. గృహ

ములోని యల్లకల్లోలముంగని తాల్మివిహీను లాత్మహత్యలేఁ గావించుకొందురు. యజమానులవలనఁగలుగు బాధలఁబడఁ జాలని సేవకులు తాల్మివిహీనులైనచో నెన్నియో పను లట్లునే నిలిచిపోవును. పసిపిల్లలు తడియిసుకలో బొమ్మరిండ్లు కట్టుచో నోరిమిలేనియెడల వారొక్కనాఁటితోనే యాటలను విడిచిపెట్టెదరు.

7. ఓరిమి ప్రతివ్యక్తికి నుండవలసినగుణము. ఇది పిన్నవారిలోఁ దక్కువగనుండును. అందుచే వారికిఁ జీటికిమాటికిఁ జిరా కుదయించును. పెద్దవారల కోరిమియధికము. సాధారణముగ వయస్సుగడచినవారికిని ననుభవశాలురకును స్త్రీలకు నోరిమి మిక్కుటము. బంధుగులలో నోరిమి తల్లి కపారము, భార్య కధికము. చుట్టఱికము దూర మగుకొలఁది క్షమయు క్షయమై పోవును. ధన మిచ్చి నాటకముచూడ నరుగువారు నటకుల యాలస్యముపట్ల క్షమఁ జూపరు. దేశనాయకుల యుపన్యాసములయం దెంత యాలస్యమైనను వినుట కెంత యిబ్బందియైననుగూడ సహనముఁజూపి యూరకొనెదరు. పరుఁడు తనను దనవారిని దిట్టుచో నెవ్వఁడును క్షమఁదలంపఁడు. వివేకజ్ఞుఁడట్టియెడలనే క్షమ ప్రకటించి యెదుటివాని కోపమునుగూడఁ బోఁగొట్టఁగలఁడు. ఆరోగ్యము చెడినవా రోర్మిలేనివారలవవచ్చును. బలాఢ్యులకుఁ దాల్మి లేనిచో క్షణక్షణమునకుఁ జుట్టుపట్లవారినిగొట్టి బాధించెదరు. పరిపాలకులకుఁ బాలితులపట్లను యజమానులకు సేవకులయెడలను దేశికుల

కంత్తే వాసులయెడలను బలవంతులకు బలహీనులయెడలను క్షమయావశ్యము.

స్తుతి.

క॥ తను లోకము కొనియాడఁగ,
విని యుబ్బఁడు సజ్జనుండు వెండియుఁ గడుమే
లొనరించి కీర్తిఁ గాంచుక
యును దనదెసఁ దోపనీక యుడుగుచువచ్చున్॥

1. స్తుతియనఁ బొగడ్త. సల్లక్షణలక్షితు నీక్షించినప్పుడీవు వానిని బొగడకతీరదు. నీవను కొనకయే శ్లాఘావాక్యము లొకప్పుడప్రియత్నముగా నీనోటినుండి నెల్వడును. ఘనకార్యము నొక్కఁ డాచరించువేళ 'బలే' యను హెచ్చరికమాట చూపఱుల పొగడికయే. ఒక్కనియందుత్తమ గుణములఁ గనినవా రాతనిసమక్షముననే నుతిసేయ నక్కఱలేదు. వానిపరోక్షమందునఁ బ్రశంసించిన బ్రశంసింపనగును. పరోక్షస్తోత్రమువలన స్తుతగుణాఢ్యత మఱింత ప్రకటన మగును. ఎదుటివానిగొనములు వానిం గనిపెట్టు మానవులబుద్ధికొలఁదినిబట్టి యుండుననుట నిర్వివాదాంశము. అనఁగా నల్పులు స్వల్పగుణములనే గని ఘనముగఁ బొగడెదరు. అంతకంటె నించుకంత యధికతరగుణములఁ గని వారాశ్చర్యమగ్నులై మూకీభావము వహించెదరు; ఉత్తమగుణములదెస మధ్యాహ్నమార్తాండుని దెసయట్లు వారు మొగమెత్తి యారయఁజాలరు. దీనియర్థమే

మన నధమగుణములకు స్తుతియు, మధ్యమగుణముల కాశ్చర్యము, నుత్తమలక్షణముల కంథత్వము సాధారణులు ప్రదర్శించెదరు. ఎవ్వఁడైన నెక్కువదూరము దూకెనా వానిని స్తవము నర్చి, సత్తరవును నిర్మించెనా దానికాశ్చర్యముఁ జూపి సర్వస్వత్యాగ మొనరించెనా వెఱఁగుపాటున మ్రాన్పడి వానివైపు బుద్ధి బఱుపఁజాలరుగదా సామాన్యమానవులు! జ్ఞానసంపన్నులు పరుని సద్గుణజాతము గ్రహించువానినే స్తోత్ర మొనర్చెదరు.

2. స్తుతిపాఠకులం దెన్నియో తరగతులవా రున్నారు. కొందఱు పడికట్టుత్రాళ్లవంటి పదములఁ జేర్చుకొని వానినే యెల్లర వర్ణించుపట్ల నుపయోగించెదరు. బట్టు లిట్టివారలై 'యింద్రు' డవు, చంద్రుఁడవు దానకర్ణుఁడవు మొదలగు పదములఁ బిడుగునకు బియ్యమున కొకటే మంత్రమన్న ట్లందఱ నుతించునప్పుడును వాడెదరు. వీ రంత తెలివైనవారుకారు. వీనివలనఁ బొగడ్తవడువాని కేమియు నపకారము లేదనవచ్చును. ఇఁక రెండవతరగతివారు లౌక్యులు, మోసగాండ్రు, స్వలాభపరాయణులు. వీరు నీ కేగుణమున్నదన్న నీవు విని సంతోషించెదవో గ్రహించి దానినేరి యదియే పొగడఁగడంగెదరు. దాన నీవుబ్బి తబ్బిబ్బై వారి నానందింపఁజేయ సంసిద్ధుఁడవయ్యెదవు. ఈ రెండు తెగలవారికిం దోడుగ నెదుటివాని యందు లేనిగుణముల నేదోకారణమునఁ బ్రశంససేయు వారిని జెప్పనొప్పు. వా రిచ్చకములాడుటచేఁ గల్లరులు.

మొత్తముమీఁద గుణగ్రహణపారీణులస్తుతులు సామాన్యుల పొగడ్తలకంటె విలువగలవనుట యథార్థము.

3. లోకములోఁ గొన్ని పొగడ్తపదములు మరియాద కొఱకు గౌరవార్థముపయోగింప వలసియున్నది. ఏలికను సందర్శించునప్పు డిది సాధారణముగ నెల్లరు నొనర్పవలసినదియు. కేవలము మహారాజులకే గాక గొప్పవారివిషయములలోఁ గూడ నుతులావశ్యకములు. మఱియు న్యాయమూర్తులని యొక్కని స్తుతించునప్పుడు న్యాయమూర్తివై యుండుమా యని చెప్పుటయుఁ గావచ్చు. ఇట్టివాఁడవని యొకవ్యక్తిని బొగడుట లోఁగలసారము నీ వీరీతిని వర్తింపుమని చెప్పుటయే. కొంతమంది యెదుటివాని కసూయాగ్రహము లుద్భవించున ట్లుగ్గడించెదరు. దీనివలన నుపకారమునకన్న నపకారమే యధికతరము. తమకుఁగల్గునుపకారమొద నెంచియెదుటివానిఁ గొండాడిలాలనఁ జేసి వశవర్తుని గావించుకొనుటయుఁగలదు. తనకంటె తక్కువ వారిచేతఁ, గ్రొత్తవారిచేతఁ, దనకు హితమగుకార్యము చేయించుకొనుటకై, ప్రేమగలవారిని వశపఱచుకొని యక్కఱ దీర్చుకొనుటకై యుపయోగించు స్తోత్రముల కర్థ ముండనేరదు. పొగడువాఁడును బొగడ్తనందువాఁడునుగూడఁ గార్యాంతమునఁ దాత్కాలికోపయోగకరములగు ముఖస్తుతివాక్యములు నిజమని తలంప వీలు లేదు. నుతగుణములు తమయందున్నను లేకున్నను గూడఁ బ్రాజ్ఞులు శ్లాఘించువారి నేవగించెదరు. స్తోత్రపాఠములఁ జదువు చాలింపుమని మందలించెదరు. సజ్జనులు పొగడ్తల కుబ్బకుండియు స్తోత్రపాఠకులకు మేతే

చేయుదురు. అవసరమగునంతస్తుతి మేలుచేయు ననుట జన బాహుళ్యముయొక్క యభిప్రాయము. కొంద రాడు పలుకు పెడసరము లేక శ్రోత్రపేయమై మృదుత్వముగల నుతిప్రియులై యుందురు. అట్టిచో వచోనైపుణ్య మున్నవారి వాక్యము లెదుటివానిని మోమోట పెట్టఁజాలవే? మఱియు స్తోత్రపాఠము లెఱుఁగక తమకార్యములఁ జెఱచుకొన్నవా రున్నా రన్నప్పుడు స్తుతి యవసరము. తప్పక తెలియఁగలదు.

4. నీవెంటఁ దిరుగుచు నిన్నెల్లవేళలఁ బొగడుటయే జీవనము గావించుకొన్న స్నేహితులంబోలువారి నుతులు శాపతతులు గాని యన్యంబులుగావు. వ్యక్తులఁగూర్చిగాని వస్తువులఁ గూర్చిగాని యధికప్రశంసకూడదు. "అతి సర్వత్ర వర్జయేత్". అనునది నుతిపట్లను నుపయోగింపఁ దగును. మితిమీఱిననుతి దుర్గుణాపాదమునకు దావొసంగును. నుతింపఁబడినవార లిరుగుపొరుగువారి యసూయాగ్రహంబుల కగ్గమగుదురు. ఒకస్త్రీఁ గూర్చిన పొగడ్తల విని కొంద ఱీర్ష్యాగ్రస్తులు తమ్ముఁ బరుల స్తోత్రములు చేఁబట్ట లేదని బట్టుల పైఁగినియు నవకాశము గలిగించుకొనెదరు. స్తుతించువాఁ డెదుటివానిని గాక వాని యుద్యోగమునో వృత్తినో ప్రశంసించుట యోగ్యమైనపని. 'నీవు బుద్ధిమంతుఁడవు సత్యసంధుఁడ' వనుటకంటె, నీవు న్యాయవాదివి స్వతంత్రవృత్తి చేకొన్నవాఁడ వని బట్టు అన్నచోఁ బొగడఁబడినవాఁ డుప్పొంగును. సద్గుణములమాట యటుంచి గడ్డిపోచ యార్జన లేని న్యాయవాదికూడ నీమాటల కలర నదనున్నది. నీ మండలాధికారి కొల్వుకూటములోని బంట్రోతుతోఁ బనిగల్గి

నప్పుడు వానింజీరి పేర్వెట్టి పిల్వక 'హుజూరువా' రను పద ప్రయోగముం జేసితివా, వాఁడు నీకు దాసుఁడగును. తా సేవిం చెడి మండలాధికారియే తనకిందివాఁ డని యాక్షణమున నా సేవకుఁడు మైమఱపునఁ దలంచును; నీకార్యము సానుకూల మొనరించును.

5. పూర్వము పొగడ్తలొల్లని నృపాలశేఖరుం డొకఁ డుం డెను. ఆతఁడు స్తోత్రపాఠకుల నేరిం దరిఁజేరనీయకుం డెను. కొంతకాలమున కొకగడుసరిబట్టు వాని నెట్లో సమీ పించి, 'అయ్యా! నేను భూమండలమంతయు బరిశీలించితిని. పురాణములవింటిని. చరిత్రలు చదివితిని. కాని రాజులందఱును స్తుతు లందుకొనువారలే నాకుం గన్పట్టిరి. పొగడ్తల నొల్లని వాఁడవు నీ వొక్కఁడవే సుమీ,' యనెను. దాని కారాజలరి బట్టునకుఁ బసదనంబిచ్చి గౌరవించెను. దీనింబట్టి తేలిన దేమి? పొగడ్త లసలె యొల్లనివాఁడు మహిలో లేఁడు.

6. పరస్తుతి యాత్మస్తుతి యనునవి రెం డున్నవి. రెం డింటిలోఁ బరులసుగుణోద్ఘాటనము మేలు. కాని స్తుతిభేదంబు లం బరికింప నన్నింటిలో నాత్మస్తుతి పరమనీచము. 'నేను దా రస్వభావుఁడను. సుగుణ వంతుఁడను, నేను సౌందర్యవంతుఁ డ ననుకొని యెవనిమట్టునకు వాఁడు చెప్పుకొనుట మూర్ఖత. ప్రసంగము దెప్పుడు నిజగుణముల బేర్కొని వర్ణింపఁబూనుట యెదుటివాని దృష్టిలో న్యూనతఁజెంద నుంకించుటయే. స్వగు ణములఁ బ్రస్తుతించుకొనుట నీచునివృత్తి. బుధు లెప్పుడు నల్పజ్ఞుల మనుకొనుచుండఁగాఁ బామరుఁడు పండితుఁడననుకొని

తన్నుఁ దా మెచ్చుకొనుట హాస్యాస్పదవిషయము. ఏవని వస్తువులు వానికిఁ బ్రియములు గావచ్చు. అంతమాత్రమున వణిజునివలె నాయంగడిలోనివస్తువులే మేలైనవని ప్రసంగించుకొనుట పామరత్వమునకే గాక యల్పజ్ఞతకుఁ దార్కాణము.

7. దైవస్తుతి దేవీస్తుతి యనునవెల్ల తెలిసిన వే. దేవుని వరములఁ బడయుందలంచి వానిని స్తుతింపఁగడంగుట భక్తుల నైజము. అనంతకల్యాణగుణుఁడవని యేమేమో మానవబుద్ధికిం దగిన నుతివాక్యము లాడెదరు. కాని యవి యెంతగొప్ప మానవబుద్ధిజనితములైనను దేవునికిం దక్కువవే యగును. తన్మూలమున భక్తులకు వేల్పునెడలఁగల ప్రేమయు భక్తియు వెల్లడి యగును. స్తుతులవలన దైవమే యుపకారబుద్ధిఁగొని భక్తవత్సలుండుకా, మానవులమాటఁ జెప్పనేల? పోతనవంటి కొందఱు మహానిష్కామకవితల్లజులు భూనాయకులవారూనాదులయెడ నిరపేక్షు లగుట శ్రీపతిస్తుతినిగాక నరపతి స్తుతి నొల్లక, తక్కుంగల శ్రీనాథాదికవీశ్వరులవలె నైహికవాంఛలతోఁ దమకబ్బంబుల రారాజుల కంకితం బొనరించి వారలఁ బ్రస్తుతింప రైరి. వారిప్పై రైనఁ దలంపక లేమిచేఁ గడగండ్ల పాలైరి. నరనుతి సేయరైరి. ఏమనఁ దక్కినజంతువులకంటె మానవుఁడు మాటాడుటలో నధికుఁడైయుండి యావాక్కును తనతో సరిసమానుల పొగడుటకై వినియోగింపక వాగ్దాతను స్తోత్రముచేయుటకై వినియోగించుకే యుత్తమ మని వారియుద్దేశము.

8. ఎదుటివానికిఁ గోప మబ్బు నను భయముచేతనో వారిచే లాభము లందవచ్చు నను నాశచేతనో సామాన్య వ్యక్తులు స్తుతించెదరు. కాని ధీరోత్తము లట్టిస్తుతులకుం గడంగరు. స్తుతిచేయుటకుఁ బిఱికితనము హేతువై యుండవచ్చును. స్తుతి యొందును దోషము నడంచి గుణమును బ్రకటించుటయే గాక లేనిగుణము లున్నట్లు వర్ణించును. పరనింద యాత్మ స్తుతివలెఁ గడుంగడు నీచమైనది.

9. నరులను వారిగుణములను బొగడువాని పొగడ్త మనస్సులోనుండి వచ్చినది కాకున్నను నాలుకకొననుండి వచ్చినదైనను సరియే కాని దైవవిషయములోని స్తుతి త్రికరణశుద్ధిగా నుండకున్నచో మే లొదవకుండుటయే గాక కీడు గల్గును. మఱియుఁ బ్రతివ్యక్తియు నితరులచేఁ బొగడఁబడుటను వాంఛించును. ఆత్మవిషయకపరోక్షస్తోత్రముల విని మఱియు నవి విననియట్లు నటించును. స్తుతుల నందుకొనఁగోరువార లా స్తుతుల నందుకొనఁదగు నర్హతను బడయఁ బ్రయత్నము లొనరించుట ప్రశంసనీయము. ఇక స్తుతి స్తుతికి స్వస్తి.